సురవరం సుధాకరరెడ్డి
వ్యాసాలు – లేఖలు
రూ॥200/- పేజీలు:290
నవచేతన పబ్లిషింగ్ హౌస్

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



కక్షసాధింపుల కోసమే పిసి ఘోష్ కమిషన్ ఎమ్మెల్యే హరీశ్‌రావు 03
'కాళేశ్వరం' నివేదికపై ఏం చేస్తారో ప్రభుత్వమే చెప్పాలి: మహేశ్వర్ రెడ్డి 04
అప్పుడు.. ఇప్పుడు కాంట్రాక్టర్లు వాళ్లే.. అక్బరుద్దీన్ 04



సంపుటి 28, సంచిక: 72 | సోమవారం | 1-09-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## బిసి రిజర్వేషన్లకు లైన్ క్లియర్



### 50 శాతం రిజర్వేషన్ పరిమితి ఎత్తివేత
### మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లులకు శాసనసభ ఆమోదం

ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ, ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటుకూ ఒకే

ప్రజాపక్షం/హైదరాబాద్



మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లులను తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత మున్సిపల్, తర్వాత పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను ఆది వారం సభలో ప్రవేశపెట్టారు. తెలంగాణ పంచాయితీరాజ్ చట్టం (2018) సవరణ బిల్లు 2025ని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనుసూయ (సీతక్క) సభలో ప్రవేశపెట్టగా, 'తెలంగాణ పురపాలికలు చట్టం– 2019' సవరణ బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. చర్చ అనంతరం ఈ బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. దీంతో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశముంది. అదే విధంగా ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ బిల్లు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ, ఇంద్రేశం, జిన్నారం తరువాయి 2లో


### పంచాయతీ రాజ్ 2018 చట్టం
## బిసి రిజర్వేషన్లకు గుదిబండ

● ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదించకుండా బిఆర్‌ఎస్ లాబీయింగ్ ● వారిది కల్వకుంట్ల కుటుంబం కాదు.. ఎవరినీ కలువకుండా చేసే కుటుంబం ● పంచాయతీరాజ్ బిల్లుపై చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు గుదిబండగా మారిన 'తెలంగాణ పంచాయతీరాజ్ 2018 సవరణ' ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించకుండా కొందరు తెరవెనుక లాబీయింగ్ చేశారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. వీరి (బిఆర్‌ఎస్) మాటలు విని ఆర్డినెన్స్ బిల్లును గవర్నర్ రాష్ట్రపతి వద్దకు పంపించారన్నారు. వారిది 'కల్వకుంట్ల' కుటుంబం కాదని, ఎస్‌సి,ఎస్‌టి,బిసిలు, హిందూ,ముస్లింలు ఇలా ఎవ్వరినీ 'కలువకుండ' చూసే కుటుంబం అని సిఎం అన్నారు. ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో ప్రస్తుత గవర్నర్‌తో ఉన్న సాన్నిహిత్యం కారణంగానే బిల్లులు ఆగాయన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలనే ఆకాంక్షతోనే తాము ఆర్డినెన్స్‌ను, బిల్లులను ఇలా అనేక ప్రయత్నాలను చేస్తున్నామని, ఇందుకు అందరూ సహ కరించాలని విజ్ఞప్తి చేశారు. 'తెలంగాణ పురపాలికల చట్టం 2019 సవరణ బిల్లుపైన శాసనసభలో ఆదివారం జరిగిన చర్చలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కెసిఆర్ తీసుకొచ్చిన తరువాయి 2లో

### ధనవంతులు కావాలనే
## దుర్బుద్ధితోనే డిజైన్

● కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో పేరును, ఊరును మార్చి దోపిడీకి పాల్పడ్డారు ● వాస్తవాలు బయటపెట్టారనే ఉద్దేశంతోనే పిసి ఘోష్‌పై హరీశ్ విషం చిమ్ముతున్నారు ● బ్యారేజీల విషయంలో మాజీమంత్రి చెప్పేవన్నీ అబద్ధాలే ● అక్రమాలపై ఎలాంటి విచారణ కావాలో సమాధానం చెప్పాలి ● ఘోష్ కమిషన్ నివేదికపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

నిజాం కంటే ధనవంతుడు కావాలన్న దుర్బుద్ధితోనే కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను డిజైన్ చేశారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. పేరును, ఊరును మార్చి దోపిడీకి పాల్పడ్డారన్నారు. తుమ్మిడిహట్టి, మేడిగడ్డ విషయంలో అప్పటి టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ' నివేదిక వారికి అనుకూలంగా లేకపోవడంతో ఆ నివేదికను తొక్కిపెట్టారని ఆరోపించారు. జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదికలోని హరీశ్ రావు తప్పు చేశారని, ఆ నివేదికలో వాస్తవాలను బయటపెట్టారనే ఉద్దేశంతోనే పి.సి ఘోష్‌పై హరీశ్‌రావు విషం తరువాయి 2లో



## నాణ్యత లేనందునే ఐదేళ్లలోనే కుంగుబాటు

కాళేశ్వరం పూర్తిగా చట్టవిరుద్ధ నిర్మాణమే

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిగా చట్ట విరుద్ధంగా నిర్మించడమే కాకుండా కనీస నాణ్యత ప్రమాణాలు కూడ పట్టించుకోకపోవడంతోనే కట్టిన 5 ఏళ్లలోనే కుంగిపోయిందని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఇది ప్రభుత్వం చెప్పడం లేదని జస్టిస్ పిఎస్ ఘోష్ న్యాయ విచారణ కమిటీతో పాటు ఎన్‌డిఎస్‌ఎ (నేషనల్ డ్యామ్ సెఫ్టీ అథారిటీ) స్పష్టం చేసిందని ఆయన పేర్కొన్నారు. శాసనసభలో తరువాయి 2లో

### అన్ని పార్టీలూ
## ఏకతాటిపైకి రావాలి

● కలిసి ఉద్యమించినప్పుడే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం ● సిపిఐ శాసనసభాపక్ష నేత సాంబశివరావు



ప్రజాపక్షం/హైదరాబాద్

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును సాధించుకోవాలంటే అన్ని పార్టీలు ఏకతాటిపై వచ్చి ఉద్యమించినప్పుడే సాధ్యమవుతుందని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. గతంలో తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత పోరాటం ద్వారానే అప్పటి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చిందని గుర్తు చేశారు. సభలో బిసి బిల్లుకు తరువాయి 12లో

## అంతా లోపభూయిష్టమే

### నాటి సిఎం కెసిఆర్ ఇష్టప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం

● రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం ● మాజీ ముఖ్యమంత్రిపై చర్య తీసుకునేందుకు ప్రభుత్వానికి పూర్తి స్వేచ్ఛ ● ప్రాజెక్టులో అక్రమాలకు బాధ్యులైన అధికారులపైనా తగిన చర్యలు ● జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ స్పష్టీకరణ ● నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర సర్కార్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మూడు బ్యారేజీల ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణలో నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ సూక్ష్మ అంశాలలో కూడా భాగస్వామి అయ్యి ఆదేశాలు జారీ చేశారు. ఫలితంగా బ్యారేజీల నిర్మాణంలో అక్రమాల ఇబ్బందులు తలెత్తాయి. నాటి నీటిపారుదల ఆర్థిక, ప్రణాళిక మంత్రి ప్రభుత్వ విధానాలను అమలు చేసే బాధ్యతను తీసుకున్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి స్థల మార్పిడి, నీటి లభ్యతపై నిపుణుల కమిటీ నివేదికను తొక్కి పట్టి (జిఓ 28) సిఎం నిర్ణయం తీసుకున్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణం నుంచి ప్రారంభం వరకు నీటిని నిలువ ఉంచడం వల్ల బ్యారేజీలపై ప్రమాదకరమైన ప్రభావం పడింది.
– పిసి ఘోష్ కమిషన్

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రాజకీయ కార్య నిర్వాహకులుగా ఉండాల్సిన నాటి సిఎం, మంత్రులు పరిపాలన కార్యనిర్వాహకులుగా వ్యవహరించి ప్రభుత్వ ప్రణాళిక, నిర్వహణను చేపట్టి రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టానికి కారణమయ్యారని, నాటి సిఎంపై చట్టం ప్రకారం చర్య తీసుకునేందుకు ప్రభుత్వానికి పూర్తి స్వేచ్ఛ ఉన్నదని జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ స్పష్టం చేసింది. అదే సమయంలో ప్రాజెక్టులో అక్రమాలకు బాధ్యులైన సంబంధిత కార్యనిర్వాహక అధికారులు ప్రభుత్వ విశ్వాసాన్ని వమ్ము చేశారని పేర్కొన్నది. సంబంధిత అధికారులు తాము కేవలం విధులు నిర్వర్తించేందుకే ఉన్నామని, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బ్యారేజీల నిర్మాణం విషయంలో విధుల నిర్వహణ బలవంతంగా చేయాల్సి వచ్చిందనే విషయాన్ని రక్షణగా భావించలేరని, తప్పుల నుంచి బయటపడలేరని



కమిషన్ తెలిపింది. తప్పు చేసిన అధికారులకు చట్ట ప్రకారం శిక్ష విధించాలని, వారికి తగిన గుణపాఠం నేర్పాలని నివేదికలో కమిషన్ సూచించింది. రాజకీయ కార్య నిర్వాహకులకు అనుగుణంగా అధికారులు వ్యవహరించడం, ఒత్తిడికి తలొగ్గడం వంటి విషయాలలో కఠినంగా ఉండాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ కేసులో తప్పు చేసిన అధికారుల పట్ల మానవతా దృక్పథంతో ఏమాత్రం ఉపశమనం కల్పించినా అది రాష్ట్ర భవిష్యత్తుకు, సంక్షేమానికి వినాశకారిగా మారుతుందని కమిషన్ హెచ్చరించింది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టింది. ఈ మేరకు శాసనసభలో స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ ఒక ప్రకటన చేశారు. కమిషన్ నివేదిక మొత్తం మూడు వాల్యూమ్‌లుగా 665 పేజీలు ఉన్నది. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిపాదన, నిర్మాణం, ప్రారంభం వరకు జరిగిన విధాన నిర్ణయాలు, కార్యకలాపాలు, ప్రభుత్వం, అధికారులు, సిబ్బంది పాత్రపై కమిషన్ తన నివేదికలో అనేక అంశాలను తరువాయి 12లో



## రైతు చుట్టే రాజకీయం!

నాడు రైతు రుణమాఫీ.. సాగునీరు...
నేడు యూరియా కొరత పేరుతో లబ్ధికి యత్నం..
స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టుకోసమేనా?

ప్రజాపక్షం/సూర్యాపేట

రైతు చుట్టే రాజకీయం సాగుతోంది. ఆయా రాజకీయ పార్టీలు రైతులను తమవైపు ఆకర్షించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ఛీత్కారానికి గురై అధికారం కోల్పోయిన బిఆర్‌ఎస్ తిరిగి తమ పట్టు సాధించుకునేందుకు తెగ ప్రయత్నం చేస్తుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల్లో పలుచన చేసేందుకు ప్రతిది రాజకీయం చేస్తూ వస్తుంది. నాడు రైతు రుణమాఫీ, సాగునీటి కోసం రాజకీయం చేసి లబ్ధిపొందే ప్రయత్నం చేయగా, నేడు యూరియా కొరత పేరుతో లబ్ధికి యత్నిస్తూ రైతులను అడ్డం పెట్టుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పట్టు కోసమే ఇదంతా చేస్తుందనే చర్చ ప్రజల్లో సాగుతుంది. బిఆర్‌ఎస్ పార్టీకి రైతులు తరువాయి 12లో

### గవర్నర్ వద్దకు
## నేడు అఖిలపక్షం

పంచాయతీరాజ్ మున్సిపల్ చట్టసవరణ బిల్లుకు ఆమోదం తెలపాలని జిష్ణుదేవ్ వర్మకు విజ్ఞప్తి

అసెంబ్లీ ఫ్లోర్ లీడర్లకు మంత్రి పొన్నం లేఖలు

ప్రజాపక్షం / హైదరాబాద్



స్థానిక సంస్థలలో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తూ శాసనసభ ఆమోదించిన తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018, సవరణ బిల్లును, మున్సిపాలిటీల చట్టం 2019 సవరణ బిల్లు ఆమోదించాలని అఖిలపక్షం సోమవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు విజ్ఞప్తి చేయనుంది. ఈ మేరకు గవర్నర్‌కు ఒక వినతి పత్రం ఇచ్చేందుకు ప్రభుత్వం గవర్నర్ అపాయింట్‌మెంట్‌ను కోరింది. బిసి రిజర్వేషన్ల బిల్లులకు సంబంధించిన వివరాలను వివరించేందుకు గవర్నర్ వద్దకు రావాలని అసెంబ్లీలోని తరువాయి 2లో

## ఎటిఎంలుగా సాగునీటి ప్రాజెక్టులు

అధికారులూ భాగస్వామ్యం కావడం దురదృష్టకరం

కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

సాగునీటి ప్రాజెక్టులంటేనే ఎటిఎంలుగా మారాయని, అధికారులు కూడా అందులో భాగస్వామ్యం కావడం దురదృష్టకరమని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ తరువాయి 2లో

### నేడు రాష్ట్ర ఎంపిలతో
## జస్టిస్ సుదర్శన్ రెడ్డి భేటీ

సాయంత్రం టియుడబ్ల్యుజె 'మీట్ ది ప్రెస్'



ప్రజాపక్షం/హైదరాబాద్

ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఎంపిలతో సమావేశం కానున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు వచ్చిన ఆయనకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కాంగ్రెస్ ఎంపిలు, నాయకులు స్వాగతం పలికారు. సోమవారం మధ్యాహ్నం తాజ్‌కృష్ణా హోటల్‌లో జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డితో జరిగే తరువాయి 2లో

### శత్రువులుగా కాదు
## భాగస్వాములుగా ఉందాం

● కీలక భేటీలో మోదీ–జిన్‌పింగ్ అంగీకారం ● సరిహద్దు సమస్యకు న్యాయబద్ధ పరిష్కారం ● ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణకు ద్వైపాక్షిక వాణిజ్యం,పెట్టుబడుల విస్తరణ ● చర్చలు ఫలవంతం ● సోషల్ మీడియాలో మోదీ ప్రకటన



**తియాన్‌జిన్:** శత్రువులుగా కాకుండా, భాగస్వాములుగా ఉందామని భారత్–చైనా దేశాధినేతలు తియాన్‌జిన్‌లో జరిగిన కీలక భేటీలో అంగీకరించారు. సరిహద్దు సమస్యకు పరస్పర సమ్మతితో న్యాయబద్ధమైన, సమయోచిత పరిష్కారం సాధించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అంగీకరించారు. ప్రపంచ వాణిజ్యవ్యవస్థను స్థిరీకరించేందుకు నిర్వహించాల్సిన పాత్రను గుర్తించి అందుకు అనుగుణంగా రెండు ఆర్థిక వ్యవస్థలూ వాణిజ్యం, పరస్పర పెట్టుబడుల్లో ద్వైపాక్షిక సంబంధాలను విస్తరించుకోవాలని,వాణిజ్యలోటును తగ్గించుకోవాలని ప్రతిజ్ఞ చేశాయి. పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వాలపై ఆధారపడి సంబంధాలు కొనసాగించేందుకు భారత్ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మోదీ స్పష్టం చేశారు. "భారత్–చైనా తమ సంబంధాలలో వ్యూహాత్మక స్వయంప్రతిపత్తితో వ్యవహరించాలి, మూడోదేశం ఆలోచనాదృక్పథంతో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## టెల్అవీవ్‌లో అర్ధరాత్రి వేలాదిమంది నెతన్యాహూ వ్యతిరేక ప్రదర్శన

**టెల్అవీవ్:** బందీలను హమాస్ ఉగ్రవాదులు కాల్చి చంపుతున్నారని, వెంటనే రక్షణ ఇవ్వాలని కోరుతూ శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇజ్రాయెల్ రాజధాని టెల్అవీవ్‌లో వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రదర్శన జరిపారు. హమాస్‌తో ఒప్పందం చేసుకుని బందీలను కాపాడాలని, వారిని సురక్షితంగా దేశానికి తీసుకురావాలని ప్రదర్శకులు కోరారు. బందీల బంధువులు, గల్లంతైనవారి కుటుంబీకులు,మిత్రుల వేదిక ఆధ్వర్యంలో టెల్అవీవ్ స్కేర్ వద్ద వేలాదిమంది ప్రజలు ప్రదర్శనగా వచ్చి చేరుకున్నారు. దేశ ప్రధానమంత్రి నెతన్యాహూ వైఖరిని ప్రదర్శకులు తీవ్రంగా వ్యతిరేకించారు. శుక్ర,శనివారాలలో ఇద్దరు బందీల అస్థికలను ఐడిఎఫ్ సైన్యం గుర్తించిన తర్వాత ప్రజలు ఆగ్రహంతో,భయంతో అర్ధరాత్రి వీధుల్లోకి వచ్చారు. 2023 అక్టోబరులో హమాస్ ఉగ్రవాదులు అపహరించి తీసుకువెళ్ళిన వారిలో ఒక బందీ మృతదేహాన్ని ఇలాన్ వెయిస్‌గా ఐడిఎఫ్ గుర్తించింది. శనివారంనాడు మరో బందీ అస్థికలను స్వాధీనం చేసుకుని వాటిని మరో బందీ ఇదాన్ స్టివికి చెందినవిగా సైన్యం గుర్తించింది.

## పాలస్తీనా బృందానికి వీసాలు ఇవ్వండి : ఇయు విజ్ఞప్తి



**బ్రస్సెల్స్:** పాలస్తీనా ప్రతినిధివర్గానికి వీసాలు ఇచ్చేందుకు, కొందరికి ఉన్న వీసాలను పునరుద్ధరించేందుకు అమెరికా తిరస్కరించింది. ఐతే వారికి వీసాలను పునరుద్ధరించాలని, పాలస్తీనా ఆవిర్భావానికి సహకరించాలని యూరోపియన్ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. న్యూయార్క్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కీలక సమావేశంలో పాల్గొనేందుకు పాలస్తీనా ప్రతినిధి బృందం సిద్ధమై వీసాలకు దాఖలు చేసింది. వీరిలో పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ సహా మరో 80 మంది ఉన్నారు. సెప్టెంబరునెలలో పాలస్తీనాను స్వయంప్రతిపత్తిగల దేశంగా ఐక్యరాజ్యసమితిలో గుర్తిస్తామని ఫ్రాన్స్, బ్రిటన్ తదితర దేశాలు ప్రకటించడంతో రాబోయే జనరల్ అసెంబ్లీ సమావేశం కీలకంగా మారింది. కానీ వారికి వీసాలు తిరస్కరించినట్లు అమెరికా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి టమ్మీ పిగొట్ తెలిపారు. వీసాలకు దాఖలు చేసుకున్నవారిలో పాలస్తీనా లిబరేషన్ ఆర్మీ (పిఎల్ఓ) సభ్యులు, పాలస్తీనా అథారిటీలో ప్రభుత్వ పాలకులు ఉన్నారు. ప్రస్తుతం పాలస్తీనా హమాస్ పరిపాలనలో ఉందని అమెరికా, ఇజ్రాయెల్ పేర్కొన్నాయి. పాలస్తీనాలో హమాస్‌ను తుడిచిపెట్టేవరకూ యుద్ధం ఆగదని ఈ రెండు దేశాలు పదే పదే ఉద్ఘాటించి చెబుతున్న తరుణంలో అమెరికా విదేశాంగశాఖ వారికి వీసాలను తిరస్కరించింది.

# స్పెయిన్ నుండి గాజాకు 50 నౌకల్లో ఆహారం

### వాటి వెంట థర్‌బర్గ్ సహా 44 దేశాల ప్రతినిధులు

**బార్సిలోనా:** గాజాలో కరువు బారిన పడిన ప్రజలను ఆదుకోవడానికి సముద్రమార్గంలో ఆహారం తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. పర్యావరణ పరిరక్షకురాలుగా పేరొందిన గ్రెటా థర్‌బర్గ్ సహా 44 దేశాల ప్రతినిధులు ఈ నౌకల్లో గాజాకు తరలి వెళుతున్నారు. మొత్తం 50 కిపైగా నౌకల్లో ఈ ఆహారాన్ని తరలిస్తున్నట్లు థన్‌బర్గ్ చెప్పారు. ఈ గ్లోబల్ సుమద్ ఫ్లోటిల్లా (అచంచలమైన ధృఢసంకల్పంతో ప్రయాణం)ను ప్రపంచంలోనే అతి పెద్ద ఆహార సరఫరా కార్యక్రమంగా విశ్లేషకులు పేర్కొన్నారు. గాజాలో ఆహారసంక్షోభాన్ని అడ్డుకుంటామని థన్‌బర్గ్ చెప్పారు. ప్రపంచదేశాలు గాజాలో సామూహిక హత్యాకాండను అడ్డుకోవడంలో, ఆహార కరువును నియంత్రించడంలో విఫలమయ్యాయని ఆమె విమర్శించారు. అక్కడి కరువు సమస్య పరిష్కరించేందుకు తాను నడుంకట్టానన్నారు. ఆదివారంనాడు స్పెయిన్ నగరం బార్సిలోనాలోని రేవుల నుండి ఈ నౌకలు బయలుదేరితే గాజాకు చేరుకోవడానికి దాదాపు ఏడు లేదా ఎనిమిది రోజులు సమయం పడుతుంది. సెప్టెంబరు నాలుగో తేదీన ట్యునీషియాలో కూడా మరికొన్ని ఆహారం నింపిన




బోట్లు ఈ ఫ్లోటిల్లా నౌకాబృందంలో చేరతాయి. అంటే సెప్టెంబరు ఏడు,లేదా ఎనిమిదో తేదీ నాటికి ఈ ఆహార నౌకలు గాజాకు చేరుకునే అవకాశం ఉంది. ఆగస్టునెలలోనే ఐక్యరాజ్యసమితి సహా ఇతర సహాయ సంస్థలు గాజాలో మానవతా సంక్షోభం,ఆహార సంక్షోభం, కరువు నెలకుందని అధికారికంగా ప్రకటించాయి. దాదాపు ఐదు లక్షలమంది ప్రజలు గాజాలో ఆకలి బాధలు ఎదుర్కొంటున్నారని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఇప్పటికే పిల్లలు సహా వందలమంది ఆకలిబాధతో మరణించారు. ఇజ్రాయెల్ ప్రభుత్వ గణాంకాల ప్రకారం, గాజాలో ఐడిఎఫ్ యుద్ధం ప్రారంభించి ఆగస్టు 31వ తేదీ నాటికి 695 రోజులు పూర్తయ్యాయి.

**గాజాసిటీ వదిలి వెళుతున్న ప్రజలు**

పాలస్తీనా ప్రజలు గాజా సిటీని వదిలి వెళ్ళిపోతున్నారు. గాజాసిటీలో ఆహార సరఫరా సరఫరా నిలిపివేశామని, దీనిని ఉద్ధృత యుద్ధప్రాంతంగా ప్రకటించామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించడంతో ప్రజలు సామాన్లు సర్దుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోతున్నారు. మరోవైపు గాజావ్యాప్తంగా ఇజ్రాయెల్ దాడుల్లో ఆదివారం 47 మంది మరణించారు. ఆహార కేంద్రాల వద్ద వేచి ఉన్న 11 మందితోపాటు మొత్తం 77 మందిని ఐడిఎఫ్ శుక్రవారం కాల్చి చంపింది. దాదాపు పది లక్షలమంది ప్రజలను గాజా నుండి బయటకు తరిమికొట్టేందుకు ఇజ్రాయెల్ సైన్యం ప్రణాళిక చేసింది. ఐతే రెడ్‌క్రాస్ సంస్థ తీవ్రంగా స్పందిస్తూ, గాజా సిటీ నుండి లక్షలాదిమంది ప్రజలను సామూహికంగా మరోచోటకు తరలించడం అసాధ్యమైన విషయమని స్పష్టం చేసింది.

గడచిన 23 నెలలుగా ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో గాజాలో మరణించిన పాలస్తీనా ప్రజలసంఖ్య 63,371 కు చేరుకుంది. 2023 అక్టోబరు 27న గాజాలో ఇజ్రాయెల్ అధికారికంగా యుద్ధం ప్రారంభించింది. ఇప్పటి వరకూ జరిగిన యుద్ధంలో 455 మంది ఇజ్రాయెల్ సైనికులు మరణించగా తాజాగా నలుగురు సైనికులు జాడ తెలియకుండాపోయారు. వీరంతా హమాస్ ఉగ్రవాదుల చెరలో చిక్కుకున్నారని భావిస్తున్నారు. కాగా గాజాలో శనివారం ఉదయం నుండీ జరిగిన దాడుల్లో 35 మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో ప్రధానంగా ఆహార కేంద్రాల వద్ద ఎదురుచూస్తున్నవారు మరణించారు. ఇదిలా ఉండగా, మరోవైపు డెన్మార్ రాజధాని కొపెన్‌హాగన్‌లో యూరోపియన్ యూనియన్‌లోని 27 దేశాలకు చెందిన మంత్రులు గాజా సమస్య పరిష్కారంపై సమావేశం జరిపారు.

# మెక్సికో అంతటా నిరసన ప్రదర్శనలు

### 18 ఏళ్ళలో 1.30 లక్షలమంది అదృశ్యం

**మెక్సికోసిటీ:** మెక్సికో దేశవ్యాప్తంగా ఆదివారం అనేకచోట్ల నిరసన ప్రదర్శనలు జరిగాయి. దేశంలో అనేకమంది జాడ తెలియకుండా పోతున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా ముఠా నాయకులే తమ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేస్తున్నారని ప్రజలు భావిస్తున్నారు. తమ బిడ్డలు అదృశ్యమవుతూ ఉండటంతో తల్లిదండ్రులు, వారి బంధువులు దశాబ్దాల తరబడి జీవించి ఉన్నంతకాలం వారికోసం వెతుకుతూనే ఉంటున్నారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ మానవహక్కుల సంఘాల కార్యకర్తలు, బాధిత కుటుంబాల ప్రజలు, బంధువులు, వారి మిత్రులు, భావసారూప్యతగల పౌరులు వేలాదిమంది మెక్సికో వ్యాప్తంగా ప్రదర్శనలు జరిపారు. మెక్సికో సిటీ, గుయాడలాజరా, కార్డోబా సహా అనేక నగరాలు, ఇతర పట్టణాలలో వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు జరిపారు. ప్రియమైన తమ కుటుంబ సభ్యుల జాడ తెలుసుకోవాలని, వారిని తమకు అప్పగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2007 నుండి ఇప్పటివరకూ మెక్సికోలో 1,30,000 మంది ప్రజలు అదృశమయ్యారు. అదృశ్యమైన




వారిలో ఎక్కువమందిని మాదకద్రవ్యాల గూండాలు లొంగదీసుకుని తమ పనులు చేయించుకుంటున్నారు. ప్రతిఘటించినవారిని నిర్దాక్షిణ్యంగా చంపుతున్నారు. ఈ సమస్య పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిని ప్రజలు వ్యవస్థీకృత నేరాలుగా పేర్కొంటున్నారు. ఈ నేరాల్లో భద్రతావిభాగం కూడా భాగంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. 1996లో ముగిసిన గౌతమాలా 36 ఏళ్ళ యుద్ధ సమయంలో 40,000 మంది అదృశ్యమయ్యారు. అర్జెంటీనాలో కూడా ఏడేళ్ళు జరిగిన యుద్ధం సందర్భంగా మరో 30,000 మంది అదృశ్యమయ్యారు.

## ఆస్ట్రేలియా దేశవ్యాప్తంగా...
# మితవాదుల వలస వ్యతిరేక ప్రదర్శనలు, ఘర్షణలు

**సిడ్నీ:** ఆస్ట్రేలియా దేశవ్యాప్తంగా ఆదివారం వేలాదిమంది ప్రజలు వలస ప్రజలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిపారు. వీరికి వ్యతిరేకంగా కూడా పలుచోట్ల నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ రెండు ప్రదర్శనల్లో పాల్గొన్న ప్రదర్శకుల మధ్య పలుచోట్ల ఘర్షణలు జరిగాయి. ఈ ప్రదర్శనలను ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. దేశంలో ఉన్న మితవాద వర్గాలు ఈ నిరసన ప్రదర్శనలను రెచ్చగొడుతున్నాయని, దేశంలో విద్వేషాన్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్న పచ్చిమితవాదులే ప్రదర్శనలకు కారకులని ఆస్ట్రేలియా ప్రభుత్వం విమర్శించింది. సిడ్నీ, మెల్‌బోర్న్ సహా అనేక నగరాలలో ఈ ప్రదర్శనలు జరిగాయి. అదేవిధంగా మాంఛెస్టర్‌లో మితవాదులు చేస్తున్న నిరసన ప్రదర్శనకు ప్రతిగా వ్యతిరేకవర్గం మరో ప్రదర్శన చేయడంతో ఘర్షణలు చెలరేగాయి. ప్రతిపక్షాలకు చెందిన అనేక పార్టీల నాయకులు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఇటీవలి కాలంలో ఆస్ట్రేలియాలో మితవాదశక్తులు తీవ్రంగా విజృంభించాయి. వారి కార్యకలాపాలు దేశవ్యాప్తంగా బాగా విస్తరించాయి. దీంతో గత ఏడాది ఆరంభంలోనే నాజీ శాల్యూట్ చేసినవారికి కఠిన శిక్షలు విధిస్తూ, ప్రభుత్వం ఒక శాసనం తీసుకువచ్చింది. సిడ్నీలో వలస ప్రజలను వ్యతిరేకిస్తూ 8000 మందితో భారీ ర్యాలీ జరిగింది. పెద్దసంఖ్యలో భద్రత ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన ప్రశాంతంగా జరిగింది. అదేవిధంగా మెల్‌బోర్న్‌లో వలస వ్యతిరేక ప్రదర్శకులు పాలస్తీనా అనుకూల ప్రదర్శకులతో బాహాబాహీకి తలపడ్డారు. నయా నాజీవాదిగా పేరుగాంచిన థామస్ సీవెల్ పార్లమెంటు భవంతి మెట్ల మీద నిలబడి ప్రదర్శకులను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా ప్రత్యర్థులతో ఘర్షణ జరిగింది. అడిలైడ్‌లో 15,000 మందితో భారీ ప్రదర్శన జరిగింది. వీరికి పోటీగా మరో ప్రదర్శన జరగ్గా ఈ ప్రదర్శకులమధ్య ఘర్షణ చెలరేగింది.

# సాగునీటి ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

నివేదికపై ఆదివారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ కూనంనేని బీహార్, యుపిలో ఇలాంటి అరాచకాలను వినేవాళ్లమని, ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో వినాల్సి రావడం దురదృష్టకరమన్నారు. రాజకీయ నాయకులే కాకుండా బ్యూరోక్రాట్స్ కూడా భాగస్వామ్యం తిలా పాపం తల పిడికెడు అన్నట్లు మారిందన్నారు. అప్పట్లో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన వాస్తవాలను బయటికి రానిచ్చారా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు సర్వ సమస్యలనకు విముక్తి అన్నట్లుగా వ్యవహరించారని విమర్శించారు. అందులోని లోతుకు వెళ్లితే తప్ప అసలు నిజం ఇప్పుడు తెలుస్తుందన్నారు. బ్యారేజ్‌కి డ్యామ్‌కు తేడా ఉండదా, అన్ని నీళ్లు నిల్వ చేస్తారా అని ప్రశ్నించారు. రెండున్నర టిఎంసిల కంటే ఎక్కువ ఏ బ్యారేజీలలో నిల్వ చేయడం సాధ్యం కాదని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం షోఅప్ కోసం సామర్థ్యానికి మించి నీటిని నిల్వ చేయడం ద్వారా తెలంగాణ ప్రజలకు ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఐదేళ్లలోనే కుంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం 'కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంజస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ కమీషన్ నివేదిక' పై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2009లో ఉమ్మడి రాష్ట్రంలోని అప్పటీ కాంగ్రెస్ ప్రభుత్వం తమ్మటిహట్టి వద్ద బిఆర్ అంబేద్కర్ ప్రాణహిత చెవేళ్ల ప్రాజెక్టుకు ప్రారంభించిందన్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతులు రూ.38 వేల కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మాణం చేపట్ట గా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ ప్రాజెక్టును కాద ని, రూ.80 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టుతో చేపట్టిన గత ప్రభు త్వం , చివరికి వ్యయాన్ని రూ. 1.47 లక్షల కోట్లకు పెంచారన్నారు. ఇంత భారీ వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టులోని 2023 అక్టోబర్ మేడి గడ్డ బ్యారేజ్ కుంగిపోయింది. దీనిపై సంబంధిత ఇంజనీర్లు మహాదేవ్ పూర్ పోలీసు స్టేషన్‌ను స్వయంగా ఫిర్యాదు చేశారు.

### 5 ఏళ్లలో తోడి పోసింది 101 టిఎంసిలే

కాళేశ్వర ప్రాజెక్టు ద్వారా ఏడాదికి 195 టిఎంసిల నీటిని ఎత్తి పో స్తామని చెప్పిన గత ప్రభుత్వం 5ఏళ్లలో మొత్తం కేవలం 162 టిఎంసిలు లిఫ్ట్ చేశారు. ఇందులో నుంచి 32 టిఎంసిలు మళ్లీ సముద్రంలోకి వదిలిపెట్టారు. దీంతో 5 ఏళ్ల 114 టిఎంసిలో మాత్రం అందుబాటులోకి అందులో నీటి ఆవిరి తదతరలు పోగా 101 టిఎంసిలు మాత్రమే ఎత్తి పోశారు. ఏడాదికి 195 టిఎంసిలు అన్న గత ప్రభు త్వం రూ. లక్ష కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టును ద్వారా ఏడాదికి ఎత్తిపోసింది కేవలం 20. టిఎంసిలు మాత్రమేనన్నారు. అదేవిధంగా ఈ ప్రాజెక్టు ద్వారా 34 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందని, ఇందులో 18 లక్షల ఎకరాలు కొత్త ఆయకట్టు, స్థిరీకరణ వ స్తుందని చెప్పారు. అయితే కొత్త ఆయకట్టు లక్ష ఎకరాలు కూడ కూ డ రాలేదని, మొత్తం రెండు లక్షలకు కూడ నీరు ఇవ్వలేకపోయ్యారని చెప్పారు.

### 5 ఏళ్లలోనే కుంగిపోయిన మేడిగడ్డ

రూ. లక్ష 47 వేల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును కేవలంలో 5 ఏళ్లలోనే పనికి రాకుండ పోయిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ బిఆర్ఎస్ అధికారంలో ఉన్న 2023 అక్టోబర్ 21నలో కుంగి పోయిందని, దీనిని 2023 అక్టోబర్ 24నే ఎన్‌డిఎస్ఎ పరిశీలించిందని వెల్లడించారు. నిర్మించిన ఏడాది 2019 నుంచే డ్యామ్ దెబ్బతిన్నడం మొదలైందన్నారు. డ్యామ్‌కు బ్యారేజ్‌కు తేడా లేకుండా నీటిని నిల్వలు చేయడం వల్లే కుంగిపోయిందన్నారు. అప్పటీ ఈఎన్ సి మురళీధర్ రావు బ్యారేజీల్లో మరమ్మతులకు చేపట్టాలని సూచించినా పట్టించుకోలేదన్నారు.ఎక్స్‌ఫర్ట్ కమిటీ డిజన్ల లోపాలు, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్లే మేడిగడ్డ కుంగిందన్నారు... బిఆర్ఎస్ హాయంలోనే డిజైన్ చేశారు. వారి హయంలోనే కట్టారు. వారి హాయంలోనే కూలిపోయిందన్నారు.

### రికార్డు స్థాయిలో ధాన్యం దిగుమతి

కాళేశ్వరం ప్రాజెక్టులోని నీటి చుక్కను వాడు కోకుండానే రాష్ట్రంలో 2024–25లో రికార్డు స్థాయిలో 256 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. 2021–22లో ఖరీఫ్‌లో 58 లక్షల ఎకరాలు, రబిలో 31లక్షల ఎకరాలు, 22–23లో 115 లక్షల ఎకరాలు, 23–24లో 115 ఎకరాలు 24–25లో 125 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారని తెలిపా రు. ఇందులో 21–22లో 186లక్షల మెట్రిక్ టన్నుల, 22–23లో 228 లక్షల మెట్రిక్ టన్నులు, 23–24లో 250లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యంత ఉత్పత్తి కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో 2024–25 ఖరీఫ్, యాసంగీ 261లక్షల మెట్రిక్ టన్నులు వరి ధాన్యం ఉత్పత్తి జరిగింది. దేశంలోనే ఇది సరికొత్త రికార్డు అన్ని వెల్లడించారు.

### జస్టిస్ పిసి ఘోష్ నివేదిక

జస్టిస్ పిసి ఘోష్ నివేదికను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సభకు వివరించారు. కమిషన్‌కు 110 మంది అప్‌డవిట్లను సమర్పించగా, 119 మంది విచారించిందన్నారు. ఇందులో మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రులు హరీష రావు, ఈటెల రాజేందర్‌లు ఉన్నారని వెల్లడించారు. జస్టిస్ పిసి ఘోష్ కమిటీ తన పూర్తి నివేదికను 2025 జూలై 31న ప్రభుత్వానికి సమర్పించిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ముగ్గురు సీనియర్ అధికారులుతో కూడిన కమిటీ ఏర్పాటు చేయగా సమగ్ర సారాంశంతో కూడిన నివేదిక ను మంత్రి వర్గానికి అందజేసిందని వెల్లడించారు. బిఆర్ఎస్ వల్ల రాష్ట్రానికి శాశ్వతంగా నష్టం జరిగిందని చెప్పారు. ప్రభుత్వం బిఆర్ఎస్ ఎప్పుడు ఏలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అదే చేయాలకుంటే తమ ప్రభుత్వం ఆధికారం చేపట్టిన రెండో రోజు నుంచే చేసేవాళ్లమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలకు సంబంధించి చట్టబద్ధంగా జస్టిస్ పిసిఘోష్ న్యాయ విచార ణ కమిషన్ ఏర్పాటు చేశామని, ఆ కమిటీ తన నివేదికలో కాళేశ్వ రం అక్రమాల్లో ఎవరి పాత్ర ఏమిటి అనేది స్పష్టంగా పేర్కొందన్నారు.

# దుర్బుద్ధితోనే డిజైన్

(మొదటి పేజీ తరువాయి)

చిమ్ముతున్నారన్నారు. పి.సి ఘోష్ నివేదికను తప్పుపడుతున్న బిఆర్ఎస్, ఇంతకు వారికి ఎటువంటి విచారణ కావాలని, సిబిఐ కావాలా?, సిబిసిఐడి కావాలా?, ఇడి కావాలా? సమాధానం చెప్పాలని సిఎం డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపైన జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ నివేదిక'పైన శాసనసభలో ఆదివారం స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ చర్చలో బిఆర్ఎస్ సభ్యులు తన్నీరు హరీశ్‌రావు ప్రస్తావించిన అంశాలపైన సిఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ కాళేశ్వరం నివేదిక, మేడిగడ్డ, తుమ్మిడిహట్టి బ్యారేజీల విషయంలో హరీష్ అన్నీ అబద్దాలు చెబుతున్నారని, ఆనాడు మంత్రిగా ఉన్న హరీష్ రావు, ఈ నాటికీ మంత్రిగా ఉన్నట్టుగానే భావిస్తున్నారని సిఎం ఎద్దేవా చేశారు. అసంపూర్తి సమాచారంతో హరీశ్‌రావు తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని ప్రయత్ని స్తున్నారని ఆరోపించారు. ప్రాణహిత చేవెళ్లలో నీరు అందుబాటులో ఉన్నదని, హైడ్రాలజీ అనుమతులు ఇస్తున్నామని, అక్కడ 205 టిఎంసిల నీరు అందుబాటులో ఉన్నదని, ఆనాటి కేంద్ర మంత్రి ఉమాభారతి 2014, అక్టోబర్ 24న స్పష్టంగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారని, కానీ మరోసారి నీటి లభ్యతను పరిశీలించాలని నాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు మళ్లీ కేంద్రానికి లేఖ రాశారని సిఎం వివరించారు. ఒకసారి ఎంఎల్‌ఎగా గెలిచి సర్టిఫికెట్ పొందిన తర్వాత మళ్లీ పరిశీలించాలని ఎవరైనా ప్రజల వద్దకు వెళ్తారా అని ఎద్దేవా చేశారు. 2009లో కూడా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నీరు అందుబాటులో ఉన్నదని అనుమతి ఇచ్చిందని, ఈ రికార్డులను కావాలనే ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం తొక్కిపెట్టిందని అన్నారు. నీరు అందుబాటులో ఉన్నప్పటికీ మళ్లీ పరిశీలించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. 2014లో నీరు అందుబాటులో ఉందని చెప్పిన విషయం దాచిపెట్టి, 13 మార్చి,2015 న కేంద్ర మంత్రి ఉమా భారతి రాసిన లేఖను హరీష్ కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నీటిపారుదల నిపుణులు విద్యాసాగర్ రావు ప్రస్తుతం బతికి ఉంటే వీళ్ల అబద్ధాలు వినలేక అదే కాళేశ్వరంలో దూకి ఆత్మహత్య చేసుకునేవారని సిఎం అన్నారు.

### తుమ్మిడి హట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మించొద్దని మహారాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ చెప్పలేదు

తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించొద్దని మహారాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ చెప్పలేదని, ఎత్తును తగ్గించుకోవాలని మాత్రమే సూచించిందని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీని నిర్మి ంచాలని కెసిఆర్, హరీష్ ముందే నిర్ణయించుకున్న తర్వాతనే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీని నియమి ంచారన్నారు. వారి ప్రణాళికలకు ఆదిలోనే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అడ్డు చెబితే, ఆ నివేదికను కనిపించకుండా మాయం చేశారని ఆరోపించారు. తుమ్మిడిహట్టి వద్ద సిడబ్ల్యుసి హెచ్చరిక జారీ చేసిందని చెబుతున్న హరీశ్‌రావు, సిబ్ల్యుసి అన్ని ప్రాజెక్ట్‌లకు ఇలాగే హెచ్చరికలను జారీ చేస్తుందని, కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ వద్ద కూడా ఇలాంలి హెచ్చరికలే జారీ చేసిందని సిఎం వివరించారు. ఏ కారణంతో తుమ్మిడిహట్టి వద్ద ఇచ్చిన హెచ్చరిక కారణాలు చూపిఆ ప్రాజెక్టును మేడిగడ్డకు ఎందుకు మార్చారో, అదే మేడిగడ్డ వద్ద కూడా హెచ్చరిక ఉన్నదనే విషయాన్ని పిసి ఘోష్ కమిషన్ తన నివేదికలో పొందుపర్చిందని తెలిపారు. అందుకే హరీష్ రావు ఆ కమిషన్ నివేదికపై తన అక్కసు వెళ్లగక్కుతున్నారని చెప్పారు.

### ఏనుగు తినేవారు పోయి... పినులుగు తినేవారొచ్చారు..

ఉమ్మడి ఎపిలో అప్పటి సిఎంలకు చిత్తశుద్ధి లోపించిందనే 'తెలంగాణ రాష్ట్రం' తెచ్చుకున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏనుగు తినోటోడు పోయి, పినుగులు తినేవారు వచ్చారని ఆరోపించారు. దురుద్దేశ పూర్వకంగా ఖజానాను కొల్లగొట్టారని మండిపడ్డారు. 'మహాభారతం', తర్వాత కాళేశ్వరం కథనే 600 పేజీలు ఉన్నదని సిఎం ఎద్దేవా చేశారు.

# రిజర్వేషన్లకు గుదిబండ

(మొదటి పేజీ తరువాయి)

పంచాయతీరాజ్ 2018 చట్టం బిసి రిజర్వేషన్లకు గుదిబండగా మారిందని, అందుకే తమ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తి వేయాలనే ఉద్దేశంతోనే ఆర్డినెన్స్‌ను జారీ చేశామన్నారు. ఇలాంటి బిల్లును ఆమోదించుకుందామంటే బిఆర్ఎస్ ఏదేదో మాట్లాడుతున్నారని సిఎం అన్నారు. మొదట బిసిల వివరాలు సేకరించే బాధ్యతను రాష్ట్ర బిసి కమిషన్‌కు అప్పగించామని, కానీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో విచారణ చేపట్టిన కోర్ట్ 'డెడికేషన్ కమిషన్'ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని, అందుకే తాము డెడికేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేశామని సిఎం వివరించారు. బిహార్, రాజస్థాన్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో వచ్చిన అడ్డంకులు తెలంగాణ రాష్ట్రంలో రాకూడదనే ఉద్దేశంతోనే తాము అధికారుల కమిటీని ఏర్పాటు చేశామని, మంత్రులను పంపించి ఇతర రాష్ట్రాలలో సమాచారాన్ని సేకరించామని సిఎం తెలిపారు. డెడికేషన్ కమిషన్ ఏర్పా టు, కుల గణన సర్వే మొత్తం ప్రక్రియను ఫిబ్రవరి 4, 2024న ప్రా రంభించి, 2025 ఫిబ్రవరి 4న పూర్తి చేశామని గుర్తు చేశారు. 365 రోజుల్లో పకడ్బందీగా చట్టాన్ని చేసి స్థానిక సంస్థల్లో బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధితోనే ప్రభుత్వం పని చేస్తుందన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో, స్థానిక సంస్థలల్లో రిజర్వేష న్ల విషయంలో రెండు వేర్వేరు బిల్లులను శాసనసభ ఆమోదించి గవర్నర్‌కు పంపిస్తే, ఆ బిల్లులను ఆమోదించకుం డా రాష్ట్రపతికి పంపించారన్నారు. ఈ బిల్లులు రాష్ట్రపతి వద్ద ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని సిఎం తెలిపారు. మరో వైపు స్థానిక సంస్థల ఎన్నికలపై కొందరు హైకోర్టుకు వెళ్లడంతో సెప్టెంబ రు 30 లోపు స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఢిల్లీ ధర్నాకు రాహుల్‌గాంధీ రాలేదని చెబుతున్నారని, ఆయన ఆదేశాలు లేనిదే తాను రిజర్వేషన్లను అమలు చేస్తామా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీని ప్రశ్నించే బిఆర్ఎస్ నాయకులు బిసి రిజర్వేషన్లపై జరిగే చర్చలో పాల్గొనేందుకు ప్రధాన ప్రతిపక్ష నేత కెసిఆర్ ఎందుకు రాలేదని సిఎం ప్రశ్నించారు. బలహీన వర్గాలకు న్యాయం జరగాలన్న చిత్తశుద్ధి కెసిఆర్‌కు ఏ మాత్రమైనా ఉంటే సభకు వచ్చేవారన్నారు.

### బలహీనవర్గాలు పరస్పరం అవమానించుకోకండి : సిఎం

'42 శాతం రిజర్వేషన్లు ఇస్తే సంతోషంగా ఉండేవారిలో మొదటి వరుసలో తాను ఉంటానని బిఆర్ఎస్ ఎంఎల్ఎ గంగుల కమలాకర్ చెబుతున్నారని, కానీ కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు సంతోషంగా ఉంటారని మాత్రం ఆయన చెప్పడం లేదని, ఆనాయకులకు దుఃఖం, బాధ ఉన్నదని, వారికి కడుపునిండా విషం పెట్టుకున్నారని కమలాకర్ చెప్పకనే చెబుతున్నారని' సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రిజర్వేషన్ల విషయంలో గంగుల కమలాకర్ వారి(బిఆర్ఎస్) ఒత్తిడి కి లొంగొద్దని, ఏమైనా అయితే శాసనసభ నాయకునిగా తాను మం చి, చెడుకు అండగా ఉంటానని, ఎవరికి భయపడొద్దని సిఎం సూ చించారు. బిసి రిజర్వేషన్లకు ఇదొక మంచి సమయం అని, ఇలాంటి సమయంలో తమ యజమానులను (పార్టీ అధ్యక్షులు ) సంతృప్తి కోసం బలహీన వర్గాలకు చెందిన వారు (మంత్రి, ఎంఎల్ఎలు) ఒకరినొకరు అవమానించుకుని, ఇతరుల ముందు పలుచన కావొద్దని సిఎం సూచించారు.

### 'మీరు ఇంకా మారకపోతే 'ఆ హోదా' కూడా మిగలదు..

'మీరు చేసిన తప్పులకు' ఇప్పటికే ప్రజలు శిక్ష విధించారని, అయినప్పటికీ మారకపోతే ప్రజలు 'మీకు ఆ హోదా'(ప్రధానప్రతిపక్షం) కూడా ఇవ్వబోరని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. పదేళ్లుగా బిఆర్ఎస్ చేయని పనిని తాము చేస్తే, తమను కెసిఆర్ అభినందిస్తే ఆయన పెద్దరికం పెరిగేదని, కానీ ఆయన ఇక్కడికి (అసెంబ్లీకి) రారని, వచ్చిన వారు ఇలా ఉన్నారని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్ల విషయంలో తాము ప్రధాని అపాయింట్‌మెంట్ కోరినా ఇవ్వలేదని, అందుకే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపడితే, దాదాపు వివిధ రాష్ట్రాలకు చెందిన వంద మంది ఎంపిలు హాజరై బిసి రిజర్వేషన్లకు మద్దతుగా నిలిచారని, కానీ బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు మాత్రం దీక్ష వైపు కన్నెత్తి చూడలేదని సిఎం చెప్పారు. పంచాయతీ రాజ్ బిల్లుపై సభలో గందరగోళం సృష్టించి,ఆ బిల్లును ఆమోదం పొందకుండా అబద్ధాల ప్రాతిపదికన మాట్లాడుతున్నారని సిఎం మండిపడ్డారు.

# నేడు అఖిలపక్షం

(మొదటి పేజీ తరువాయి)

అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం లేఖ రాశారు. అసెంబ్లీ ప్రాంగణంలోని ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి టి.హరీశ్ రావును మంత్రి కలిసి ఈ మేరకు కెసిఆర్‌కు రాసిన లేఖను వారికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రిజర్వేషన్ పరిమితిపై అన్ని పార్టీల సభ్యులు ఏకాభిప్రాయంతో ఉంటే ముందుకు వెళ్లవచ్చని 2012లో సుప్రీంకోర్టు తీర్పు ఉందని, ఇందు కోసం గవర్నర్‌ను కలుద్దామని సిపిఐ, బిజెపి, ఎంఐఎంలను కోరినట్లు తెలిపారు. బిసి రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్రపతి, ప్రధాని అపాయింట్‌మెంట్ అడుగుతున్నామని, కానీ వారు ఇవ్వడంలేదని, గవర్నర్‌ను కలిసి పరిస్థితిని వివరిస్తామన్నారు. రాష్ట్రంలో స్థానికంగా జరిగే ఎన్నికలపై రాష్ట్రాలు నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెబుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానం, అఖిలపక్షం అభిప్రాయం తాము చెబుతామని, నిర్ణయం గవర్నర్ ఇష్టమన్నారు.

# సుదర్శన్ రెడ్డి భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిల సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలు తప్పకుండా పాల్గొనాలని కాంగ్రెస్ ఎంపిల కన్వీనర్ మల్లు రవి కోరారు. హైదరాబాద్ పర్యటన సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డితో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో జరుగుతుందని టియుడబ్ల్యుజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామ్‌నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

# లైన్ క్లియర్

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపాలిటీల ఏర్పాటు బిల్లుకు కూడా శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. చర్చ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని 285 ఎ సెక్షన్ స్థానంలో 9,17,146,175,176 సెక్షన్లను చేర్చడం ద్వారా ప్రస్తుత చట్టంలో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ చట్ట సవరణ చేసినట్లు తెలిపారు. ఈ చట్టాన్ని సభ్యులు ఆమోదించాలని మంత్రి కోరగా, సభ్యులందరూ సవరణ చట్టాన్నిఏకగ్రీవంగా ఆమోదించారు.

### బిసి రిజర్వేషన్లు మరో పదేళ్లు ఆగాలనే ఉద్దేశంలో బిఆర్ఎస్ : మంత్రి శ్రీధర్ బాబు

బిసి రిజర్వేషన్ల అంశం మరో పదేళ్ళు ఆలస్యం కావాలనే ఉద్దేశంలో బిఆర్ఎస్ ఉన్నదని శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అం దుకే 9వ షెడ్యూల్ ప్రస్తావనను తీసుకొస్తున్నారని, ఈ విషయం పూర్తిగా కేంద్రం పరిధిలోని అంశమన్నారు. రిజర్వేషన్ల విషయంలో బిఆర్ఎస్, బిజెపి త మ స్పష్టమైన వాఖరిని తెలియజేయాలన్నారు. తెలంగాణ పురపాలికలు చట్టం 2019' సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము కేంద్రంలో అధికారంలోనికి వస్తే, రాజ్యాంగాన్ని సవరించి, రిజర్వేషన్లను పెంచుతామని రాహుల్‌గాంధీ హామీనిచ్చారని, ప్రస్తుతం అధికారంలో ఉన్న మోదీప్రభుత్వం రిజర్వేషన్ల విషయంలో స్పష్టత ఇవ్వాలన్నారు. అంతకు ముందు జరిగిన చర్చలో బిఆర్ఎస్ సభ్యులు గంగుల కమలాకర్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల విషయంలో తొందరపాటు నిర్ణయం వద్దని, రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్‌లో పొందుపర్చాలని, అప్పుడే రిజర్వేషన్లకు రక్షణ ఉంటుందని బిఆర్ఎస్ సభ్యులు గంగుల కమలాకర్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభు త్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి సభ్యులు పాయల శంకర్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల అంశాన్ని కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టుతున్నారన్నారు. బిసి రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ఢిల్లీలో ధర్నా చేసిందని, ధర్నాలతో చట్టాలు అవుతాయా?, మార్పులు వస్తాయా అని ప్రశ్నించారు. ఎంఐఎం సభ్యులు జాఫర్ హుసేన్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్ట సవరణకు మద్దతు ప్రకటించారు. రిజర్వేషన్ల విషయంలో తమిళనాడు తర్వాత తెలంగాణ రాష్ట్రం ఉండాలని ఆకాంక్షించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాజ్యాంగ సవరణ ద్వారానే బిసి రిజర్వేషన్లు సాధ్యం

**అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్లండి : కెటిఆర్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్లు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ ద్వారానే సాధ్యమని బిఆర్‌ఎస్ సభ్యులు కెటి.రామారావు అన్నారు. బిసి రిజర్వేషన్ల అంశం రాష్ట్ర పరిధిలోనిది కాదని, దీనిపైన ఎంత చర్చించినా ఉపయోగం లేదని, అందుకే అఖిలపక్షాన్ని న్యూఢిల్లీలోని ప్రధాని మంత్రి వద్దకు తీసుకెళ్లాలని శాసనసభలో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుపై ఆదివారం జరిగిన చర్చలో కెటిఆర్ మాట్లాడుతూ ఆర్డినెన్స్‌పైన సంతకం పెట్టని గవర్నర్, బిల్లుపైన పెడుతారా?అని ప్రశ్నించారు. గతంలో తాము ప్రవేశపెట్టిన 'పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్టం' ఎక్కడా సీలింగ్ అనే అంశం లేదన్నారు. బిసి రిజర్వేషన్లపై సిఎంకు చిత్తశుద్ధి ఉంటే జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహారదీక్ష చేపట్టాలన్నారు. 2004లోనే కేంద్రంలో బిసి సంక్షేమ శాఖ పెట్టాలని కెసిఆర్ డిమాండ్ చేశారని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో మోదీ, రాహుల్‌గాంధీ ఇద్దరూ చాయ్ తాగినంత సమయాన్ని కేటాయిస్తే బిసి రిజర్వేషన్లు అమలవుతాయని కెటిఆర్ తెలిపారు.

## ● మీడియా పాయింట్

### 'కాళేశ్వరం'ను కామధేనువుగా వాడారు : ప్రభుత్వ విప్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత పదేళ్లు సిఎంగా ఉన్న కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును కామధేనువుగా వాడుకొని, రూ.లక్షల కోట్లు దోచుకున్నారని ఎంఎల్‌ఎ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆదివారం ఆయన మాట్లాడుతూ కెసిఆర్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలతో తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతిన్నదన్నారు. కాళేశ్వరంపై వేసిన కమిషన్‌ను తప్పుపట్టడమేమిటని ప్రశ్నించారు. యూరియా కొరతపై కావాలనే రచ్చ చేస్తున్నారని ధ్వజమెత్తారు. యూరియా తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులు అవసరమైతే, అందుకు తగ్గట్టు కేంద్రం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. యూరియా ఇవ్వాలని కేంద్రాన్ని అడిగేందుకు బిఆర్‌ఎస్ నేతలకు నోరు రావడం లేదని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికలో తప్పెవరు చేశారన్నది తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానని ఆయన పేర్కొన్నారు.

### 'కాళేశ్వరం' నివేదిక భయంతో యూరియా నినాదం : నాయిని రాజేందర్‌రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై భయంతో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు యూరియా నినాదం ఎత్తుకొన్నారని వరంగల్ పశ్చిమ ఎంఎల్‌ఎ నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట దోచుకు తిన్నారని మండిపడ్డారు. నిన్న వరంగల్‌కు చెందిన బాలు నాయక్ అనే రైతుకు యూరియా వచ్చినప్పటికీ బిఆర్‌ఎస్ దొంగలు కావాలనే ఆ రైతుతో ధర్నా చేయించారని పేర్కొన్నారు.

### రాజకీయ కక్షతోనే పిసి ఘోష్ నివేదికపై చర్చ : కెపి వివేకానందగౌడ్



రాజకీయ కక్షతో పిసి ఘోష్ నివేదికపై అసెంబ్లీలో చర్చ పెట్టారని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కె.పి.వివేకానంద గౌడ్ అన్నారు. పిసి ఘోష్ కమిషన్ అంటే కాంగ్రెస్ కమిషన్ అని ఎద్దేవా చేశారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ అధికారం ఉన్నదని ఏకపక్ష నిర్ణయాలు తీసుకొంటున్నారన్నారు. యూరియా చర్చిద్దామంటే స్పందించడం లేదన్నారు. ఎంత ఆలస్యమైనా సభలో తమ పార్టీ సభ్యులు ఉండేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత తమపైన ఉన్నదని పేర్కొన్నారు.

### రైతులకు నష్ట పరిహారమివ్వాలి : పాయల్

ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా ఉమ్మడి ఆదిలాబాద్ , నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్టు బిజెపి ఎంఎల్‌ఎలు పాయల్ శంకర్, రామారావు పటేల్ తెలిపారు. వేల ఇళ్లు, పంటలు నీట మునిగాయని, 10 నుంచి 15 మంది వరకు మృతిచెందారని పేర్కొన్నారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ పత్తికి ఎకరాకు రూ.50వేలు, సోయాబీన్‌కు రూ.40వేలు, వరికి రూ.30వేలు, కందులకు రూ.40వేల నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే రైతు ఫసల్ బీమాను ప్రకటించాలని కోరారు. లేనిపక్షంలో బిజెపి తరఫున నష్టపోయిన రైతుల పక్షాన ఆందోళన చేస్తామని తెలిపారు.

### బిసి రిజర్వేషన్లకు మద్దతు :సూర్యనారాయణ

బిసి రిజర్వేషన్లకు బిజెపి పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తున్నదని బిజెపి ఎంఎల్‌ఎ ధన్‌పాల్ సూర్య నారాయణ తెలిపారు. అయితే,మతపరమైన రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకమన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు బిసిలకే ఇవ్వాలని, అందులో 10శాతం ముస్లింలకు ఇస్తే వక్ఫ్‌బోర్డు ఆస్తులు హిందువులకు ఇస్తారా? అంటూ ప్రశ్నించారు.

### గత ప్రభుత్వం నిధులివ్వకనే 'దేవాదుల' పనులు ఆగాయ్ : కడియం శ్రీహరి

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్లే దేవాదుల ఎత్తిపోతల పథకం పనులు పూర్తి కాలేదని ఎంఎల్‌ఎ కడియం శ్రీహరి అన్నారు. పంట కాలువలు పూర్తికాకపోవడం వల్ల చివరి భూములకు సాగునీరు అందించలేకపోయామన్నారు. కెసిఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇచ్చిన ప్రాధాన్యం ఏ ప్రాజెక్టుకు ఇవ్వలేదని, దీంతో దేవాదుల నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తికి ప్రాధాన్యం ఇచ్చిందని, పనుల పూర్తికి రూ.1,010 కోట్లు కేటాయించిందన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి నవాబ్‌పేట్ వరకు ప్రధాన కాలువతో పాటు ఉప కాలువల లైనింగ్ పనులకు సిఎం కెసిఆర్ రూ.140 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో సుమారు ఆరు లక్షల ఎకరాల సాగుకు నీరందుతుందన్నారు. దేవాదుల స్కీం పనులకు ప్రాధాన్యం ఇచ్చిన సిఎం రేవంత్‌రెడ్డికి , నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### బిఆర్‌ఎస్ హయాంలో 'దేవాదుల' నిర్లక్ష్యం : యశస్విని రెడ్డి

బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాదుల ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందని పాలకుర్తి ఎంఎల్‌ఎ యశస్విని రెడ్డి అన్నారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడుతూ మేడిగడ్డ లాంటి మేడిపండు ప్రాజెక్టులను వదిలేసి, ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా దేవాదుల పనుల పూర్తికి చర్యలు తీసుకొంటున్న సిఎం రేవంత్‌రెడ్డికి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు.

### రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం :కె.ఆర్.నాగరాజు

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచి, వారి సమస్యల పరిష్కరించే దిశగా ముందుకు పోతున్నదని వర్ధన్నపేట ఎంఎల్‌ఎ కె.ఆర్.నాగరాజు అన్నారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ యూరియా ఇచ్చినా కూడా ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందుకు రైతులతో రచ్చ చేస్తున్నారని తెలిపారు. ఇందుకు బిఆర్‌ఎస్, బిజెపి మధ్య చీకటి ఒప్పందం జరిగి, డ్రామాలు చేస్తున్నాయని మండిపడ్డారు. యూరియా కొరతపై రాష్ట్ర బిజెపి కేంద్రమంత్రులు స్పందించడం లేదన్నారు. రైతులకు యూరియా అందించేందుకు ప్రభుత్వం తీవ్రంగా కష్టపడుతుందని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో మరో రెండు మున్సిపాలిటీలు

తెలంగాణ పురపాలక సంఘాల (మూడవ సవరణ) 2025 బిల్లుకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదముద్ర



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో రెండు కొత్త పురపాలక సంఘాలను ఏర్పాటు చేయడంతో పాటు మరో పురపాలక సంఘంలో రెండు గ్రామాలను విలీనం చేస్తూ తెలంగాణ పురపాలక సంఘాల (మూడవ సవరణ) 2025 బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదముద్ర వేసింది. సభలో ఆదివారం ఈ బిల్లును ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తరపున శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టగా చర్చ అనంతరం సభ ఆమోదించింది. సంగారెడ్డి జిల్లాలోని ఇస్నాపూర్ పురపాలకలో రుద్రారం, లక్డారం గ్రామాలు చేర్చి పురపాలక సంఘం పరిధిని విస్తరించడంతోపాటు 10 గ్రామాలలోని 10, 252 మంది జనాభా, 20 వార్డులతో 'జిన్నారం' మున్సిపాలిటీని, 8 గ్రామాలు, 10,173 మంది జనాభా 15 వార్డులతో 'ఇంద్రేశం'ను కొత్త పురపాలక సంఘాలుగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు బిల్లు ఉద్దేశాన్ని మంత్రి శ్రీధర్ బాబు సభకు వివరించారు.

**కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడం కాదు.. అభివృద్ధి ఎక్కడ? : హరీష్ రావు**

ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడం కాదని, వాటి అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు ఏమిటని బిఆర్‌ఎస్ సభ్యులు టి.హరీశ్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బిల్లుపై జరిగిన చర్చలో హరీశ్‌రావు మాట్లాడుతూ ఇప్పటికే అనేక మున్సిపాలిటీల్లో కనీస సిబ్బంది కూడా లేరని, మరోవైపు ప్రభుత్వం నిధులను కేటాయించకపోవడంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి విడుదల చేసిన ఎస్‌డిఎఫ్ నిధులను కేవలం కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు ఉన్న నియోజవర్గాల్లో మాత్రమే అమలు చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వాటిని రద్దు చేశారని ఆరోపించారు. బిజెపి సభ్యులు హరీష్‌బాబు మాట్లాడుతూ నిధుల లేమితో మున్సిపాలిటీలు పూర్తిగా కునారిల్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు.

బిఆర్‌ఎస్ సభ్యులు హరీశ్‌రావు సభను పక్కదారి పట్టిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఆక్షేపించారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్లే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోందన్నారు. ఎస్‌డిఎఫ్ నిధులను అవసరమున్న చోట మాత్రమే ఖర్చు చేస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీలో అధికారులు, సిబ్బంది నియామకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి వెల్లడించారు.

**గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వాలి : వేముల ప్రశాంత్‌రెడ్డి**

నిధులు లేక గ్రామ పంచాయతీల అభివృద్ధి కుంటుపడిందని బిఆర్‌ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బిల్లుపై చర్చలో ఆయన పాల్గొంటూ గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం 'పల్లె ప్రగతి' కార్యక్రమంలో నిధులు ఇచ్చేదని, తద్వారా ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. అయితే గడిచిన 20 నెలలుగా నిధులు లేకపోవడంతో ట్రాక్టర్లలో డీజిల్ పోసేందుకు కూడా డబ్బులు లేకపోవడం గ్రామ కార్యదర్శి అప్పులు చేసి కాలం వెళ్లదీస్తున్నారన్నారు. బిజెపి సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ గ్రామాలను మున్సిపాలిటీలలో కలపడం వరకు బాగానే ఉన్నప్పటికీ ఆ తర్వాత వారు ఉపాధి హామీ పనులను కొల్పోతున్నారని, అలాంటి గ్రామవాసులకు ప్రత్యేకంగా ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**గతంలో సర్పంచ్‌లు భార్యల పుస్తెలు అమ్ముకొని పనులు చేశారు : మంత్రి పొన్నం**

అభివృద్ధి పేరుతో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులను గ్రామ సర్పంచులు చేసిన పనులకు బిల్లులను చెల్లించకపోవడంతో వారు భార్యల పుస్తెలు అమ్ముకునే పరిస్థితి కల్పించారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోని పెండింగ్ బిల్లులను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు.

# అల్లోపతిక్ ప్రైవేటు వైద్య సంరక్షణ సంస్థల చట్టం రద్దు

శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అల్లోపతిక్ ప్రైవేటు వైద్య సంరక్షణ సంస్థల (రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ) చట్టాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ ఆదివారం శాసనసభలో ప్రవే శపెట్టిన బిల్లును సభ ఏకగ్రీవంగా ఆమోదించిం ది. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజ నర్సింహ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2002లో ఈ చట్టం తీసుకురాగా, రాష్ట్ర విభజన తర్వాత 2015 డిసెంబర్‌లో అప్పటి ప్రభుత్వం జిఒ 111 ద్వారా తెలంగాణ రాష్ట్రానికి అనువదింపచేసిందన్నారు. అయితే 2010లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాన్ని రాష్ట్రానికి సైతం అనువదింపజేస్తున్న క్రమంలో తెలంగాణ అల్లోపతిక్ ప్రైవేటు వైద్య సంరక్షణ సంస్థల (రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ) చట్టం అవసరం లేకపోవడంతో ఈ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేస్తోందని వివరించారు. ఇందు కు సంబంధించి మంత్రి ప్రవేశపెట్టిన బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

**ఆరోగ్యశ్రీ నిధులను విడుదల చేయాలి: డాక్టర్ సంజయ్**

తెలంగాణ అల్లోపతిక్ ప్రైవేటు వైద్య సంరక్షణ సంస్థల (రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ) రద్దు బిల్లుకు బిఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు తెలుయజేస్తున్నట్లు బిఆర్‌ఎస్ సభ్యులు డాక్టర్ కల్వకుంట సంజయ్ చెప్పారు. అయితే ఆరోగ్యశ్రీ సేవలకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రులు పేదలకు వైద్య సేవలను అందించేందుకు నిరాకరిస్తున్నాయని తెలిపారు. దీంతో ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ఉన్న ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. బిల్లుకు మద్దతు తెలిపిన బిజెపి సభ్యులు పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బందిపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వారి రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఆసుపత్రుల యాజమాన్యాలతో ఇప్పటికే చర్చించాం: మంత్రి**

ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లుల చెల్లింపులకు సంబంధించి ఇప్పటికే ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చించిందని మంత్రి దామోదర రాజనర్సింహా తెలిపారు. పెండింగ్ బిల్లులను 6 నుంచి 7 దఫాల్లో చెల్లిస్తామని ఆసుపత్రుల యాజమాన్యాలకు హామీ ఇచ్చామని, త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి అవుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం బిపి మందులు కూడా అందుబాటులో లేవని డాక్టర్ సంజయ్ పేర్కొనగా రాష్ట్రంలో ఏ ఆసుపత్రిలోనూ మందుల కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు. అదేవిధంగా అన్ని ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత క్రమంలో సమాకూర్చడంతో పాటు నిర్వహణకు సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి దామోదర రాజ నరసింహా స్పష్టం చేశారు.

# ఆకారం ఎక్కువగా ఉంటే అవగాహన ఉన్నట్టు కాదు

మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా

9వ షెడ్యూల్‌లోని అంశాలను కూడా సమీక్షించొచ్చు.. :మంత్రి వాకిటి శ్రీహరి

మంత్రికి అవగాహన లేదు :గంగుల కమలాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆకారం ఎక్కువగా ఉన్నవారికే అవగాహన ఉన్నట్టు కాదని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఒక మంత్రిని పట్టుకుని అవగాహన లేదనడం సరైంది కాదని సూచించారు. బిసి రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం పొరపాటు చేస్తుందని, దీనిపైన న్యాయపరంగా వెళ్లాలనే అంతర్గతంగా లీక్ ఇచ్చేలా మాట్లాడడం మంచిది కాదని సూచించారు. 'తెలంగాణ పురపాలిక చట్టం 2019' సవరణ బిల్లుపైన శాసనసభలో ఆదివారం జరిగిన చర్చలో బిఆర్‌ఎస్ సభ్యులు గంగుల కమలాకర్ మాట్లాడుతూ రిజర్వేషన్ల విషయంలో మంత్రికి అవగాహన లేదని పొన్నం ప్రభాకర్ ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలను అమలు చేయాలని, ఎంబిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, కార్పొరేషన్లు, మంత్రిపదవులను బిసిలకు ఇవ్వాలని సూచించారు. దీనిపైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్ష, వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రధాన ప్రతిపక్ష పదవులన్నీ ఒకే కుటుంబంలో పదవులు ఉన్నాయని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్ల విషయంలో అన్ని రాజకీయ పార్టీలన్నీ ఏక వాఖ్య తీర్మానంగా మద్దతు ఇవ్వాలని, మూడ్ ఆఫ్ హౌస్‌ను చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని సూచించారు. మతపరమైన రిజర్వేషన్లు లేవని, 42 శాతం పూర్తిగా బలహీనవర్గాల వారికే రిజర్వేషన్లు ఉంటాయని స్పష్టం చేశారు.

అనంతరం మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి జోక్యం చేసుకుని మాట్లాడుతూ షెడ్యూల్ 9లో ఉన్న అంశాలను కూడా సమీక్షిస్తామని సుప్రీం కోర్ట్ స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బిసిలు ఎంఎల్‌ఎలుగా రావాలంటే చాలా కష్టమని చెప్పారు.

# దేశాభివృద్ధిలో గ్రామాలే పట్టుగొమ్మలు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్




**ప్రజాపక్షం/తాండూరు :** దేశం అభివృద్ధి చెందాలంటే మన దేశం స్వరాజ్య దేశంగా ఎదగాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరు మండల జిన్‌గుర్తి గ్రామంలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సందీపని గురుకులం నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. అంతకు ముందు సందీపని గురుకుల ఆవరణలో మంత్రి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ దేశంలో ఎటువంటి మార్పుకైన గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కీలకమైందని, గ్రామీణ ప్రాంతాల నుండియే ఉద్యమం ఉండాలని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే దేశ వ్యవస్థ ఇతరులపై ఆధారపడకుండా దేశంలోనే సమృద్ధి అయ్యేలా స్వరాజ్యం ఏర్పాటు చేసుకోవాలని, అప్పుడే మన పరిపాలనలో మనం అభివృద్ధి చెందగలుగుతామని అన్నారు. మనదేశం స్వరాజ్య దేశంగా ఎదగాలని, మన దేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలంటే ఏకలవ్య గురుకులాల ఏర్పాటుతో సాధ్యమవుతుందన్నారు. రాబోయే వంద సంవత్సరాల దేశ స్వరాజ్యంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయ ఉత్సవాలు నిర్వహించాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందడం అభినందనీయమని కొనియాడారు. పాఠశాలలో యోగాను అమలు చేయాలని, దీనివల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతో జీవించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ ప్రభుత్వ పాఠశాలలో పూర్వవైభవానికి తీసుకువస్తున్నామన్నారు. కులాలకు అతీతంగా విద్యను అందించాలన్న సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి నియోజకవర్గంలో రూ.200కోట్ల నిధులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాడని అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను అధికమించడానికి ఉద్యోగ భరోసా నిమిత్తం ఏటిసి కేంద్రాలను ఏర్పాటు చేసి యువతకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, విశ్రాంత ఐఎఎస్ అధికారి రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటి చైర్మన్ సతీష్ చంద్ర, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు భాగయ్య, చైర్మన్ సి.వెంకటేశ్వరరావు, సందీపని గురుకులం చైర్మన్ మల్లారెడ్డి, ఎస్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్ వివిధ రాష్ట్రాల నుండి వచ్చేసిన ప్రొఫెసర్స్, డాక్టర్లు,నాయకులు పాల్గొన్నారు.

## కక్ష సాధింపుల కోసమే పి.సి.ఘోష్ కమిషన్ : ఎమ్మెల్యే హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయ కక్ష సాధింపుల కోసమే జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేశారని బిఆర్‌ఎస్ సభ్యులు తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం విచారణ మొత్తం రాజకీయ కక్ష సాధింపే తప్ప, వాస్తవాల పరిశోధన కాదన్నారు. 'కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల' బ్యారేజీలపైన జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ నివేదిక' పైన శాసనసభలో ఆదివారం స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ చర్చలో హరీశ్ రావు పాల్గొని మాట్లాడారు. మేడిగడ్డలోని ఏడో బ్లాకులోని రెండు పిల్లర్లు కుంగటం తప్పా, ఈ వ్యవస్థ అంతా అద్భుతంగా ఉందని, ఏడు బ్లాకుల్లో ఒక బ్లాకు మొత్తం తీసినా రూ 3 నుంచి రూ 4 వందల కోట్ల ఖర్చు మాత్రమే అవుతుందని, ఇలా చేయకుండా ఎందుకు రాజకీయ రాద్ధాంతం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. మేడిగడ్డలో మైనర్ లోపం ఏర్పడకముందు నుంచే, కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరంపై అనేక రకాల అబండాలను మోపిందని ఆరోపించారు. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ విధివిధానాలకు పూర్తిగా తిలోదకాలిచ్చిందని, జస్టిస్ పి.సి ఘోష్ కమిషన్ రిపోర్టు కోర్టు ముందు నిలబడబోదని, ఇదొక డొల్ల, చెత్త రిపోర్టు అని తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నీటి లభ్యత లేకపోవడం, మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోకపోవడం, చాప్రాల్ వైల్డ్ లైఫ్ ఉండటం కారణంగా అనేక కారణాలతో తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ముందుకు పోలేదని హరీశ్‌రావు వివరించారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్టు 1952 ప్రకారం 8 బి, 8సిని పాటించకుండా, నిబంధనలు అనుసరించలేదనే తాము కోర్టును ఆశ్రయించామని వివరించారు. నీటి లభ్యత విషయంలో కేంద్ర మంత్రి ఉమాభారతి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలోని మూడవ పేజీని ఘోష్ కమిషన్ చదవలేదని, అందుకే తప్పుడు రిపోర్ట్ ఇచ్చిందని ఆరోపించారు. 2009 నుంచి 2014 సంవత్సరం వరకు కూడా తమ్మిడిహట్టిని ఎందుకు పూర్తి చేయలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నప్పటికీ 'తమ్మిడిహట్టి' ప్రాజెక్టును ఎందుకు నిర్మించలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## 'స్థానికం'లో బిసి రిజర్వేషన్లకు అసెంబ్లీ తీర్మానం శుభపరిణామం



బిసి మహాసభలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడం మంచి పరిణామమని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. వచ్చే నెల సెప్టెంబర్‌లో జరిగే సిపిఐ జాతీయ మహాసభల్లో బిసిల విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్ల చట్టబద్ధతకు రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని తీర్మానిస్తామని తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నంద గోపాల్, జాతీయ ప్రధానకార్యదర్శి గుజ్జ కృష్ణ అధ్యక్షతన బిసి మహాసభ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపి ఆర్.కృష్ణయ్య, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, ఎంఎల్‌సి మధుసూదనాచారి హాజరయ్యారు. నారాయణ మాట్లాడుతూ పదేళ్లు సిఎంగా పనిచేసిన కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి బిసి బిల్లుకు మద్దతు ఇచ్చివుంటే బాగుండేదన్నారు. బిసి బిల్లుపై చట్టం చేసినప్పుడు అసెంబ్లీకి రాకుండా ఫాంహౌజ్‌లో పడుకోవడం సరికాదన్నారు. తక్షణమే కెసిఆర్ ఎంఎల్‌ఎ పదవికి రాజీనామా చేయాలన్నారు. తెలంగాణ బిడ్డ ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుపై కెసిఆర్ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కులగణన ప్రకారం 2029 ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రిజర్వేషన్ల పరిమితిని 50శాతం తొలగిస్తూ అసెంబ్లీలో చట్టం చేయడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రాష్ట్రంలో బిసిల కోసం ఆర్.కృష్ణయ్య పోరాడినట్టుగా అన్ని రాష్ట్రాల్లో ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ప్రధాని మోదీ జనగణనతోపాటు కులగణన కూడా నిర్వహిస్తామనటం అభినందనీయమన్నారు. సమావేశంలో సంఘం నేతలు నీలం వెంకటేశ్, డాక్టర్ పురుషోత్తం, వేముల రామకృష్ణ, దానకర్ణచారి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గోదారి దోబూచులాట

**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరి వరద దోబూచులాడుతోంది. ఆదివారం ఉదయం 9 గం.లకు 48 అడుగులకు చేరుకోవడంతో జిల్లా అధికారులు 2వ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. అక్కడ్నుంచి మధ్యాహ్నం 12 గం. వరకు నిలకడగా మారిన వరద ప్రవాహం అతి నెమ్మదిగా శాంతిస్తోంది. మధ్యాహ్నం 1 గం.కు 47.09 అడుగులకు చేరుకోవడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకోగా, మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గోదావరి పరివాహక ప్రాంతాల్లో పెద్దఎత్తున వర్షాలు పడుతుండటంతో నదికి వరద తాకిడి పెరిగింది. ఎగువన పడ్డ ప్రతీ వర్షపు చుక్క గోదావరిలోనే కలవాల్సి ఉంటుంది. అంతే కాకుండా గోదావరిపై ఉన్న ప్రాజెక్టులు సైతం నిండుకోవడంతో వాటి గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు ఇంద్రావతి, ప్రాణహిత నదులు పొంగిపొర్లుతూ కాళేశ్వరం వద్ద గోదావరిలో కలుస్తున్నాయి. పెనుగంగ, వార్ధా, వైన్‌గంగ నదుల కలయికతో ఏర్పడ్డ ప్రాణహిత నది గోదావరికి అతిపెద్ద ఉపనది. మరోపక్క ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో పడుతున్న వర్షాలకు ఆ నీరంతా తెలంగాణలోని చర్ల మండలంలో గల తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులోకి చేరుతున్నాయి. ప్రాజెక్టు వరద నీటితో నిండుకోవడంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువన ఉన్న గోదావరిలోనికి వదులుతుంటారు. దీంతో నదికి మరింత వరద తాకిడి పెరుగుతుంది.

**అప్రమత్తంగా అధికారులు...** గోదావరి వరదలను తట్టుకునేందుకు జిల్లా అధికార యంత్రాగం అప్రమత్తంగా ఉంది. జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. ముంపుప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అధికారులు ఇప్పటికే పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. అవసరాన్ని బట్టి కేంద్రాలను పెంచే అవకాశం ఉంది. ప్రజల కోసం మంచినీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా వంటి అన్ని మౌళిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సంబంధితశాఖలను ఆదేశించారు.

## నిండు కుండలా కిన్నెరసాని



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఎగువ ప్రాం తాలలో కురుస్తున్న వర్షాలకు వస్తున్న వరద నీటితో కిన్నెరసాని ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 407 అడుగులకుగాను 405.10 అడుగులకు చేరింది. దీనితో ప్రాజెక్టు అధికారులు రాత్రి పది గంటలకు ఒక గేటును ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 30 తులాల బంగారం, రూ.50 వేలకు పైగా నగదు చోరీ

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో దుండగులు చొరబడి 30 తులాల బంగారం, 50 వేల రూపాయలకు పైగా నగదును దోచుకెళ్లిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాఆద్ పట్టణం రాజంపేటలో నివాసముంటున్న బీరెల్లి సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి సుందిళ్ల లక్ష్మి నరసింహస్వామికి మొక్కులు చెల్లించేందుకు శనివారం బయలేదారు. ఇంటికి తాళం వేసి ఉన్నది గమనించిన దుండగులు రాత్రి సమయంలో చొరబడి బంగారం, నగదు దోచుకోవడంతో పాటు ఇంటోని సామాగ్రిని చిందరవందర చేశారు. ఆదివారం ఉదయం దైవదర్శనానికి వెళ్లి వచ్చిన సురేష్ కుటుంబ సభ్యులు ఇంటి వద్దకి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. గమనించిన కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లి చూసేసరికి సామాగ్రి పూర్తిగా చిందరవందరగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఉదయ్ కిరణ్ బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోస్టల్ సేవలపై నీలి నీడలు

రిజిష్టర్ పోస్టు స్థానే స్పీడ్ పోస్టులు

పోస్టు బాక్స్ (ఎర్రడబ్బా) ఎత్తివేత ప్రచారం

ఎలక్ట్రానిక్ సేవల వైపు చూపు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** దశాబ్దాల కాలంగా అన్నివర్గాల ప్రజలతో పెనవేసుకున్న పోస్టల్ (తంతితపాల) శాఖ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రయోగాలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా నేటి (సెప్టెంబర్ 1వ తేది) నుండి రిజిస్ట్రర్ పోస్టును రద్దు చేస్తూ దానిని స్పీడ్ పోస్టు విభాగంలో విలీనం చేయనున్నారు. అంతే కాకుండా రెడ్‌లెటర్ బాక్స్ (ఉత్తరాల ఎర్రబాక్స్)ను కూడా రద్దు చేస్తారనే ప్రచారం పెద్ద ఎత్తున సాగుతుండటంతో పోస్టల్ సేవలపై నీలినీడలు అలుముకున్నాయి. ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లు లేని రోజుల్లో సమాచారం చేరవేతకు ఉన్న ఏకైక దిక్కు తంతితపాలనే. కాగా మారుతున్న పరిస్థితులు దృష్ట్యా ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు దృష్టి సారించారు. రిజిష్టర్ పోస్టు ద్వారా సేవలు ఆలస్యం అవుతున్నాయనే ఉద్దేశ్యంతో స్పీడ్ పోస్టుతో విలీనం చేశారు. దీని ద్వారా ప్రజలకు వారి పోస్టు ఎక్కడి వరకు వచ్చింది. ఎక్కడుంది అనే దానిని యాప్ ద్వారా కూడా తెలుకునే వీలుంటుంది. ఇది పేద వర్గాలకు 25 శాతం నుండి 30 శాతం వరకు ఆర్థిక భారమే ఆయినప్పటికీ, చాలామంది స్పీడ్‌పోస్టు వైపు మొగ్గు చూపుతున్నారు. మారిన కాలానికి అనుగుణంగా శాఖ మార్పులు చేస్తోంది.

**రెడ్ పోస్టుబాక్స్ ఎత్తివేత? :** తంతితపాల శాఖలో 171ఏళ్ల చరిత్ర గల రెడ్ పోస్టుబాక్స్ (ఉత్తరాల ఎర్రడబ్బా) కనుమరుగు కానున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రజలతో వందలేళ్లుగా పెనవేసుకున్న ఈ లోహపు అనుబంధం ఇక కనిపించదూ అనే మాట వినబడగానే ఆ ఉత్తరాల ఎర్రడబ్బాతో ఏదో ఒక సందర్భంలో అనుబంధం ఉన్న పలువురి మనస్సు ఒకింత నొచ్చుకోక మానడం లేదు. భావోద్వేగాల నేస్తం పోస్టు డబ్బాను ఎత్తివేస్తున్నారనే వార్త ఎవరికైనా బాధే. ఈ ఎర్రడబ్బా వందలేళ్ల పాటు నిస్వార్థంగా, నిశబ్ధంగా సేవలు అందించిన నేస్తం. ఊహతెలిసిన నాటి నుండి వీధి చివరో, వీధిలో ఏదో ఒక ప్రదేశంలో ఎర్రడబ్బా కనిపించేది. ప్రేమలు, ఆత్మీయతతో కూడిన ఉత్తరాలు మోసుకొస్తూ, తీసుకెళుతూ అనుసంధానకర్తగా సేవలు అందించింది.

## అప్పుడు.. ఇప్పుడు కాంట్రాక్టర్లు వాళ్లే..

బిఆర్‌ఎస్, బిజెపి,కాంగ్రెస్ పార్టీలకు అందుతున్న 'ఎలక్టోరల్ బాండ్స్'

సిపిఐ, ఎంఐఎం ఎలక్టోరల్‌కు దూరం : అక్బరుద్దీన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసి మాట్లాడుతూ నీటి పారుదల శాఖలో వైఎస్ఆర్,కెసిఆర్,ఇప్పుడు కూడా అదే కాంట్రాక్టర్లు కొనసాగుతున్నారని, ఆ కాంట్రాక్టర్లే కాంగ్రెస్, బిజెపి, బిఆర్‌ఎస్‌కు 'ఎలక్టోరల్' బాండ్స్ ఇస్తారని తెలిపారు. కేవలం ఒక సిపిఐ, ఎంఐఎం పార్టీలకుమాత్రమే ఎలక్టోరల్ బాండ్స్ ఇవ్వరని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లపైన ఎందుకు ఆధారపడాల్సిన అవసరం ఉన్నదని, చిత్తశుద్ధి, అంకితబావంతో పనిచేసే వారికి కాంట్రాక్టర్ల డబ్బులు అవసరం లేదని తెలిపారు. ఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ నీటిపారుదల ప్రాజెక్టులు ఒక ఎటిఎంగా మార్చు కుంటారని, వాటికి కేవలం పాస్‌వర్డ్ మాత్రమే మారుతాయని ఆరోపించారు. మొబ లైజేషన్ అడ్వాన్సులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం వరకు కొనసాగు తోంద న్నారు. తుమ్మిడి హట్టి ప్రాజెక్ట్‌ను నిర్మించి ఉంటే బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు రీ డిజైన్ చేయాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఏం చేస్తారని, పునరుద్ధరి స్తారా? లేదా. పూర్తిగా తొలగిస్తారా? అని ప్రశ్నిం చారు. దొంగకు ఎటువంటి శిక్ష ఇవ్వాలనే విషయం కమిషన్ నివేదికలో పొందుపర్చలేదన్నారు.

## 'కాళేశ్వరం' నివేదికపై ఏం చేస్తారో ప్రభుత్వమే చెప్పాలి: మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జస్టిస్ పి.సిఘోష్ కాళేశ్వరం నివేదికపైన ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఏం చేస్తారో కాంగ్రెస్ ప్రభుత్వమే చెప్పాలని, తాము ఎందుకు చెబుతామని బిఆర్‌ఎస్‌ఎల్‌పి నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. 'కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల' బ్యారేజీలపైన జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ నివేదిక'పైన శాసనసభలో ఆదివారం స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ చర్చలో మహేశ్వర్ రెడ్డి పాల్గొని, మాట్లాడారు. కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్టుగా కనిపించడం లేదన్నారు. కమిషన్ మ్యాచ్‌ఫిక్సింగ్ తరహా ఉన్నదని, కేవలం కంటితుడుపు చర్యగానే ఉన్నదన్నారు. కెసిఆర్‌ను జైలులో పెట్టనప్పుడు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పైన జస్టిస్ పిసి ఘోష్ విచారణ ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావుపై ఎందుకు చర్యలు లేవని, ఆయన పదవీకాలాన్ని పొడిగించేందుకు ఎలా సిఫారసు చేస్తారని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిని కేసును నీరుగార్చే విధంగా ప్రభుత్వం వ్యవహారించిందని ఆరోపించారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్, కార్ రేస్ లాంటి పలు కేసులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఈ కేసులలో ఎందుకు అరెస్టులు జరగలేదన్నారు.

## రిజర్వేషన్ల పెంపుతో బిసిల్లో హర్షం

స్థానిక సంస్థలలో పెరుగనున్న ప్రాతినిధ్యం

గతంలో 22 శాతమే.. ఈ సారి 42 శాతం

ఎంపిపి, జెడ్పి చైర్మన్ పదవులలోనూ ప్రాతినిధ్యం




**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచడంతో బీసీల్లో హర్షం వ్యక్తం అవుతున్నది. ఈ రిజర్వేషన్ల పెంపుతో ఈసారి స్థానిక సంస్థల్లో బీసీలకు గరిష్ఠ ప్రాధాన్యం లభించనుంది. 2013లో జరిగిన లోకల్ బాడీ ఎన్నికల్లో 22 శాతంగా ఉన్న రిజర్వేషన్లు ప్రభుత్వం ఈసారి ఆర్డినెన్స్ ద్వారా 42శాతానికి పెంచుతోంది. దీంతో బీసీలకు స్థానికంలో ప్రాధాన్యం డబుల్ కానుంది. కులగణన నివేదక ప్రకారం రాష్ట్ర జనాభాలో 56.3 శాతం బీసీలు ఉన్నారని తేలింది. దీంతో కామారెడ్డి డిక్లరేషన్ తో పాటు బీసీ సంఘాల నేతల నెమాండ్ కు అను గుణంగా 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీంతో రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, మునిసి పల్ ఎన్నికల్లో ఇప్పుడున్న వాటికి అదనంగా బీసీలకు 20శాతం రిజర్వేషన్లను పెంచి 42 శాతం అమలు చేయనున్నారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36,16,855 మంది జనాభా ఉండగా, ఇందులో బీసీలు 14,28,043మంది (40 శాతం) ఉన్నట్లుగా గుర్తించారు. కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనలో 45 శాతా నికి పైగా ఉన్నట్లు సమాచారం. పదేళ్లలో బీసీల జనాభా నాలుగు నుంచి ఐదు శాతం పెరిగినట్లుగా అంచనా. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 40శాతం రిజర్వేషన్ కల్పిం చాలని బీసీ సంఘాలు పట్టుబడుతుంటంతో ఆర్డినెన్స్ ద్వారా బీసీల డిమాండ్ ను తీర్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

**2019లో జనరల్ స్థానాల్లో బిసిల హవా**

గత 2019 లోకల్ బాడీ ఎన్నికల్లో 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను గత ప్రభుత్వం 22 శాతానికి కుదించింది. 50శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదనే సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రిజర్వేషన్లను కుదించాల్సి వచ్చింది. అయినప్పటికీ అనేక మంది జనరల్ స్థానాల్లో విజయం సాధించి బీసీలు సత్తా చాటారు. అప్పట్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1888 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. వీటిలో జీసీలకు 212 సర్పంచ్ స్థానాలు రిజర్వుడు చేశారు. గిరిజనులు అత్యధికంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో బీసీలకు 22శాతం కాకుండా, అక్కడ జనాభా ఆధారంగా ఎస్టీలకు అధికంగా సీట్లు దక్కాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో బీసీల సీట్లకు కోత పడింది. అయినప్పటికీ విజర్వేషన్ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో సైతం బీసీలు పోటీ చేసి విజయం సాధించారు. మొత్తం 1988 స్థానాల్లో 122 సీట్లలో బీసీలు సర్పంచులుగా ఎన్నిక య్యారు. ములుగు జిల్లాలో 150 సర్పంచ్ స్థానాలకు ఎన్ని కలు జరిగితే బీసీలకు కేవలం ఆరు జీపీలే రిజర్వు అయ్యాయి. అయినప్పటికీ జనరల్ స్థానాల్లో పోటీ చేసి 29 మంది బీసీలు విజయం సాదించారు. మొత్తంగా 22శాతం రిజర్వే షన్ల కంటే అదనంగా 200 స్థానాల్లో బీసీలు జనరల్ స్థానాల్లో పాగా వేశారు. మొత్తంగా 25.5 శాతం సీట్లు బీసీల వరం అయ్యాయి. ఎంపీటీసీ స్థానాల్లోనూ బీసీలు జనరల్ స్థానాల్లో పాగా వేశారు. మొత్తం ఉమ్మడి ఉమ్మడి వరంగల్ జిల్లాలో 792 స్థానాలు ఉండగా, బీసీలకు 114 ఎంపీటీసీ స్థానాలు రిజర్వు అయ్యాయి. వీటితో పాటు జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి అదనంగా మరో 163 స్థానాల్లో విజయం సాధించారు. మొత్తం 277 స్థానాల్లో బీసీలు ఎంపీటీసీలుగా ఎంపికయ్యారు. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 198 ఎంపీటీసీ స్థానాలు కేవలం బీసీలకు 5 స్థానాలే రిజర్వేషన్ చేశారు. కానీ, మరో 32 జనరల్ స్థానాల్లో బీసీలు విజయం సాదించారు. ఫలితంగా ఆ జిల్లాలో మొత్తం 37మంది బీసీలు ఎంపీటీసీలుగా విజయం సాధించారు. మొత్తం 35శాతం ఎంపీటీసీ సీట్లను బీసీలు కైవసం చేసుకున్నారు.

**గతంలో 20 జెడ్‌పిటిసిల కైవసం**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 70 జడ్పీటీసీలు ఉండగా, 9 జడ్పీటీసీలే బీసీలకు రిజర్వు అయ్యాయి. అయితే జనరల్ స్థానాల్లో పోటీ చేసి మరో 11స్థానాల్లో బీసీలు విజయం సాదించారు. మొత్తంగా 20 మంది బీసీలు జడ్పీటీసీలుగా ఎన్నికయ్యారు. కోటా కంటే అదనంగా 29శాతం మంది బీసీలు జడ్పీటీసీలుగా విజయం సాధించారు. గిరిజన ప్రాబల్యం ప్రాంతం కావటంతో మహబూబాబాద్ జిల్లాల్లో బీసీలకు ఒక్క జడ్పీటీసీ స్థానం కూడా రిజర్వు కాలేదు. అయినప్పటికీ జనరల్ స్థానాల్లో పోటీ చేసి ఇద్దరు బీసీ అభ్యర్థులు విజయం సాదించారు. వరంగల్ జిల్లాలో 11జడ్పీటీసీ స్థానాలు ఉంటే బీసీలకు ఒకటే స్థానం రిజర్వు చేశారు. ఇక్కడ మరో నాలుగు జనరల్ స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. కాగా, ఉమ్మడి జిల్లాలో ఒకే ఒక జడ్పీ చైర్మన్ పదవి బీసీలకు దక్కింది. ములుగు జడ్పీ సీటు జనరల్ కు కేటాయించినప్పటికీ ఏటూరునాగారం జడ్పీటీసీగా గెలిచిన కుసుమ జగదీష్ కు చైర్మన్ పదవి దక్కింది. అయితే పూర్తికాలం పదవిలో కొనసాగలేదు. గుండెపోటుతో 2023 జూన్‌లో మృతి చెందారు.

**లోకల్ బాడీలో పెరుగనున్న బిసిల ప్రాతినిధ్యం**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల ను కల్పించేందుకు ఇప్పటికే కేబినెట్ ఆమోదం పొందిన ఆర్డినెన్స్ ను గవర్నర్ ఆమోదం కోసం పంపించింది. గవర్నర్ ఆమోద ముద్ర పడిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీంతో గతం కంటే 20శాతం అధికంగా సీట్లు రానున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 75 జడ్పీటీసీ, ఎంపీపీలు ఉన్నాయి. వీటిలో కనీసం 30 వరకు బీసీలకు రిజర్వుడు అయ్యే అవకాశం ఉంది. ఆరు జడ్పీ చైర్మన్లల్లో ఒకటి రెండు సీట్లు బీసీలకు రిజర్వు కోటాలో దక్కే చాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. 778మంది ఎంపీటీసీ స్థానాలు, 1,708 గ్రామ పంచాయతీల్లో మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో మినహా ఇతర జిల్లాల్లో భారీగా సీట్లు బీసీలకు రిజర్వు కానున్నాయి. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో స్థానిక సంస్థల్లో మొత్తం 2,550 పదవులు ఉండగా, అందులో ఈసారి అత్యధిక స్థానాలు బీసీలకు దక్కే అవకాశం ఉంది.

## సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం భారత్–చైనాలకు బీమా పాలసీ లాంటిది

విదేశాంగ కార్యదర్శి మిస్రి

**తియాన్‌జిన్:** సరిహద్దుల్లో శాంతి,స్థిరత్వం భారత్–చైనా మధ్య బీమా పాలసీ లాంటిదని విదేశాంగమంత్రిత్వశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి అన్నారు. షాంఘై సహకార సంస్థ సదస్సు ప్రారంభానికి ముందుగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో జరిగిన సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇదే విషయాన్ని ఆయనకు తెలియజేశారన్నారు. ద్వైపాక్షిక సంబంధాలను పునర్నిర్మించుకోవడంపై దృష్టి కేంద్రీకరించేందుకు మోదీ–జిన్‌పింగ్ మధ్య ముఖాముఖీ సమావేశం జరిగిందని ఆయన చెప్పారు. వీరిద్దరిమధ్యా జరిగిన సంభాషణ సారాంశాన్ని ఆయన వివరించారు. వారిద్దరూ అనేక విస్తారమైన అంశాలపై చర్చలు జరిపారు. సరిహద్దు ఉగ్రవాదం సవాలుగా మారిందని చర్చల్లో మోదీ చెప్పారు. ఈ బెడదవల్ల రెండు దేశాలపైనా ప్రభావం పడుతుందని, దీనికి మద్దతు ఇవ్వాలని కోరారు. చైనా ఈ విషయాన్ని అర్థం చేసుకుని సహకారం అందిస్తుందన్న సంకేతాలు వచ్చాయన్నారు. ఇరు దేశాలమధ్య తదుపరి ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు నాలుగు సలహాలు జిన్‌పింగ్ ఇచ్చారన్నారు.వ్యూహాత్మకమైన అనుసంధానం అభివృద్ధి చేసుకోవడం,పరస్పర విశ్వాసాన్ని లోతుగా పెంపొందించుకోవడం, పరస్పర ప్రయోజనాలు, సమాన ఫలితాలు పొందేవిధంగా సహకారం సాధించడం, ఒకరి సమస్యలను మరొకరు పంచుకోవడం అనేక నాలుగు సలహాలు జిన్‌పింగ్ ఇచ్చారన్నారు. మోదీ ఇందుకు సానుకూలంగా స్పందించారని చెప్పారు.

## ఎఫ్‌టిఎ అమలుతో బంధం బలోపేతం

జిన్‌పింగ్–ముయిజ్జు సమావేశంలో నిర్ణయం

**తియాన్‌జిన్:** ఉత్తర చైనా పురపాలక నగరం తియాన్‌జిన్‌లో ఎస్‌సిఓ (షాంఘై సహకార సంస్థ) సదస్సు సందర్భంగా వివిధ దేశాల నాయకులతో జిన్‌పింగ్ విడిగా సమావేశాలు జరిపారు. మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జుతో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆదివారం ముఖాముఖీ సమావేశంలో ద్వైపాక్షిక సంబంధాలను చర్చించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)ను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా సంబంధాలను మరింత పటిష్టం చేసుకోవాలని రెండు దేశాల నాయకులు నిర్ణయించారు. చైనా నిర్మిస్తున్న బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులో సహకారం సానుకూలంగా ముందుకు పురోగమిస్తోందని వారిద్దరూ అభిప్రాయపడ్డారు. ఈ సహకారాన్ని వివిధ రంగాలద్వారా మరింత విస్తరించుకోవాలని నిర్‌నయించారు. మత్స్యపరిశ్రమ, సముద్ర శాస్త్రవిజ్ఞాన పరిశోధన, పర్యావరణ పరిరక్షణ సహా ప్రకృతి వైపరీత్యాలను నియంత్రించేందుకు సహకారాన్ని ముందుకు తీసుకువెళ్ళాలని నాయకులు ఇద్దరూ నిర్ణయించారు. ముయిజ్జు రెండోసారి చైనాలో పర్యటిస్తున్నారు. గత ఏడాది జనవరిలో ఒకసారి స్వదేశంలో ఎన్నికల సందర్భంగా భారత్ వ్యతిరేక ప్రచారానంతరం చైనాలో పర్యటించారు. తొలుత భారత్‌తో జగడ వైఖరి అనుసరించినప్పటికీ ఆ తర్వాత ఆ దేశానికి భారత్ ఆర్థిక సహకారం చేయడంతో సఖ్యత పునరుద్ధరణ చర్యలు తీసుకున్నారు.

## బిసి బిల్లు ఆమోదం చరిత్రాత్మక విజయం

నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో

ఇందిరాచౌక్ వద్ద సంబరాలు



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:**పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించడంపై కరీంనగర్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేసిందని ఆయన అన్నారు. శాసనసభలో బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా సిటీకాంగ్రెస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో సంబరాలు జరిపారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బిసిలకు న్యాయం చేసే దిశగా కాంగ్రెస్ ముందుకు వెళ్తుంటే బిఆర్‌ఎస్, బిజెపి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని, గతంలో బిసి బిల్లు ఆర్డినెన్స్ అడ్డుకున్నాయని నరేందర్‌రెడ్డి ఆరోపించారు. బిసిలకు అసలైన న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, బిజెపి మాత్రం కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. బిసి బిలుల ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం తెలుపకుండా బిఆర్‌ఎస్ అడ్డుకుందని, దీంతో రాష్ట్రపతి దగ్గర అదే విధంగా పెండింగ్‌లో ఉందన్నారు. పంచాయతీరాజ్ చట్ట సవరణకు అసెంబ్లీ ఆమోదంతో బిసిలకు రిజర్వేషన్లు కల్పించడం సుగమం అయ్యిందని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ పనిచేసే ప్రభుత్వం కాళ్లల్లో కట్టెలు పెట్టకుండా బిసిలకు న్యాయం చేసే అంశంలో బిజెపి, బిఆర్ ఎస్ తమతో కలిసి రావాలని కోరారు. బిసిలపై చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్‌కు అండగా నిలవాలన్నారు. బిసిల నోటికాడి ముద్ద లాక్కునే ప్రయత్నం చేయొద్దని, భవిష్యత్తు తరాలు క్షమించవని అన్నారు. సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిపిన సంబరాల కార్యక్రమంలో కొరివి అరుణ్ కుమార్, సమద్ నవాబ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ ఖంరొద్దీన్, చర్ల పద్మ, కుర్ర పోచయ్య, శభాన మహమ్మద్, అస్థాపురం తిరుమల, నెల్లి నరేష్, పెద్దిగారి తిరుపతి, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, మిరాజ్, హెహెన్నా, చింతల కిషన్, చర్ల లింగయ్య భారీ, బషీర్, లింగమూర్తి, ఫహాద్, అజీం, తాళ్లపల్లి శ్రీకాంత్, అంజయ్య, సా యిరాం, ఖలీల్, శిల్ప, సిటీ కాంగ్రెస్ నాయకులు,పాల్గొన్నారు.

## కోర్టుల్లో ఏడువేల సిబిఐ కేసులు పెండింగ్

**న్యూఢిల్లీ:** సిబిఐ దర్యాప్తు చేసిన ఏడువేల అవినీతి కేసులు ఇంకా న్యాయస్థానాలవద్ద అపరిష్కృతంగా ఉండిపోయాయి. వీటిల్లో 379 కేసులు ఇరవైఏళ్ళకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి) వార్షిక తాజా నివేదిక తెలియజేసింది. వీటిల్లో 1,506 కేసులు పెండింగ్ పడి ఇంకా మూడు సంవత్సరాలు పూర్తికాలేదు. మరో 2,115 కంటే ఎక్కువ కేసులు గత ఏడాది డిసెంబరు 31 నాటికి ఐదు నుండి పదేళ్ళుగా పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా పది నుండి ఇరవైఏళ్ళు మించకుండా 2,281 అవినీతి కేసులు పెండింగ్‌లో కొనసాగుతున్నాయి. అదేవిధంగా 379 కంటే ఎక్కువ కేసులు ఇరవైఏళ్ళు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. 2024 డిసెంబరు 31 నాటికి 7,072 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వివిధ హైకోర్టులు, సుప్రీంకోర్టులో సిబిఐతోపాటు, నిందితులు వేసిన పిటిషన్లు, పునర్విచారణ పిటిషన్లు 13,100కు పైగా ఉన్నాయి. వీటిల్లో మళ్ళీ 606 కేసులు ఇరవైఏళ్ళకుపైగా అపరిష్కృతంగా పడి ఉన్నాయి. 1,227 కేసులే 15ఏళ్ళకు పైగా పెండింగ్‌లో ఉన్నాయిగానీ, ఇంకా ఇరవైఏళ్ళు కాలేదు. 2,989 కంటే ఎక్కువ కేసులు పదేళ్ళుపైగా పదిహేనేళ్ళకు తక్కువకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. మరో 4,059 కేసులు ఐదేళ్ళకంటే ఎక్కువకాలంగా పెండింగ్‌లో ఉండగా, 1,778 కేసులు రెండేళ్ళకంటే ఎక్కువకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి.

2024వ సంవత్సరంలో 644 కేసుల్లో తీర్పులు వెలువడ్డాయి. వీటిల్లో 3,92 కేసులలో నిందితులకు శిక్షలు పడ్డాయి. 154 మంది కేసుల నుండి విముక్తి చెందారు. 77 మందిపై కేసులను ఇతర కారణాలవల్ల కొట్టేశారు. గత ఏడాది తీర్పుల్లో 69.14 శాతం మందికి శిక్షలు పడ్డాయి. 2023లో 71.47 శాతం మందికి శిక్షలు పడ్డాయి. 2024 సంవత్సరం ఆఖరుకు 11,384 కేసులు వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిల్లో అవినీతితో సంబంధంలేని కేసులు కూడా ఉన్నాయి. 2024లో సిబిఐ 807 కేసులు నమోదు చేయగా, వీటిల్లో 674 రెగ్యులర్ కేసులున్నాయి. మరో 133 ప్రాథమిక విచారణలో ఉన్నాయి. 2024 లో సిబిఐ 1,005 కేసులలో దర్యాప్తు పూర్తిచేసింది. వీటిల్లో 1856 రెగ్యులర్ కేసులు ఉండగా, మరో 149 ప్రాథమిక విచారణలో ఉన్నాయి.

## బ్రిక్స్ దేశాలపై వివక్ష పాటించే ఆంక్షలకు రష్యా–చైనా వ్యతిరేకం : పుతిన్

**తియాన్‌జిన్:** 'బ్రిక్స్'(బ్రెజిల్,ఇండియా,రష్యా,చైనా,దక్షిణాఫ్రికా) దేశాల పట్ల వివక్ష చూపించే ధోరణితో విధించే ఆంక్షలను రష్యా–చైనా రెండు దేశాలు వ్యతిరేకిస్తాయని వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు.ప్రపంచ సవాళ్ళను పరిష్కరించగలస్థాయికి 'బ్రిక్స్'దేశాల కూటమి సామర్థ్యాన్ని పటిష్టం చేస్తామని అందుకు అనుగుణంగా కూటమి ఐక్యంగా నిలబడుతుందన్నారు. ఎస్‌సిఓ (షాంఘై సహకార సంస్థ)25వ వార్షికోత్సవ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన రష్యా అధ్యక్షుడు పుతిన్ చైనా ప్రభుత్వ వార్తాసంస్థ 'జిన్హువా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పైవిధంగా వ్యాఖ్యానించారు. కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకోసం అదనపు వనరుల సమీకరణకు తమ రెండు దేశాలు ప్రత్యేకదృష్టి సారించాయని అన్నారు. 'బ్రిక్స్' దేశాల సాంఘిక ఆర్థిక అభివృద్ధికి, బ్రిక్స్‌కు దూరంగా ఉన్న ఇతర దేశాల అభివృద్ధికి ఆటంకాలు కలిగించే వివక్షపూరితమైన ఆంక్షలకు వ్యతిరేకంగా రష్యా–చైనాలు ఉమ్మడి వైఖరి అనుసరిస్తాయని ఉద్ఘాటించారు. బ్రిక్స్ కూటమిలో ఉన్న అనేక దేశాలపై పదిశాతం సుంకాల భారం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరింపులు చేస్తున్న పూర్వరంగంలో పుతిన్ ఈ వాఖ్యలు చేశారు. బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, ఇండియా, రష్యా, చైనా, దక్షిణ ఆఫ్రికాతోపాటు సౌదీఅరేబియా, ఇరాన్, ఇథియోపియా, ఈజిప్టు, అర్జెంటైనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు కూడా కొత్తగా సభ్యత్వం తీసుకున్నాయి. అదేవిధంగా ఎస్‌సిఓ సదస్సు పది సభ్యదేశాలకూ కొత్త శక్తిని నింపుతుందని అన్నారు. సమకాలీన సవాళ్ళు, బెదిరింపులను ప్రతిఘటించి ఉమ్మడి భావాలు పంచుకునేవిధంగా సంఘీభావాన్ని పటిష్టం చేసుకోవడానికి తియాన్‌జిన్‌లో జరుగుతున్న ఈ సదస్సు ఎస్‌సిఓ శక్తిసామర్థ్యాలను ఇనుమడింపజేస్తుందన్నారు. ఎస్‌సిఓ సదస్సులో పాల్గొంటున్న భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా నిర్ణీత ప్రకారం సోమవారం పుతిన్‌తో సమావేశమవుతారు. ప్రపంచబ్యాంకుకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థక రష్యా,చైనాదేశాలు పూర్తి మద్దతుగా నిలబడతాయని పుతిన్ చెప్పారు. బాహాటత్వం, సమానత్వం అనే సూత్రాల ఆధారంగా సరికొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా అన్ని దేశాలకూ ప్రపంచ ద్రవ్య సంస్థల ద్వారా అవకాశాలు లభించాలన్నారు. ''సర్వమానవాళికీ ప్రయోజనం కలిగించే ప్రగతిని మేం కోరుకుంటున్నాం, రష్యా,చైనా దేశాలు రెండూ ఈ సమున్నతమైన లక్ష్యసాధన దిశగా కలిసి తమ కృషిని కొనసాగిస్తాయన్న విశ్వాసం నాకు ఉంది, రెండు దేశాల ప్రగతికి భరోసా కలిగించే కృషి చేస్తాం'' అన్నారు. చైనాలో నాలుగు రోజులు పర్యటనకు వెళ్ళిన పుతిన్ సెప్టెంబరు మూడో తేదీన జరిగే చైనా 80వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. రెండో ప్రపంచయుద్ధంలో జపాన్‌పై చైనా విజయం, ఫాసిజంపై విజయాలకు చిహ్నంగా ఈ వేడుకలు జరుగుతున్నాయి.

## 'ఆకేరు' ప్రళయానికి సాక్షిగా నిలిచిన రాకాసితండా

ఆ ఘోర కలికి ఏడాది

ఊహకందని విషాదం

ఇప్పటికీ కోలుకోని తండా


సాగుకు యోగ్యం కాని భూములు



**ప్రజాపక్షం/ఖమ్మం/తిరుమలాయపాలెం :** అది సెప్టెంబర్ ఒకటి 2024. ఆ రోజు కూడా సాయం సంధ్యవేళ సన్నగా చినుకులు మొదలయ్యాయి. రాత్రి 9.30కు ఆ చినుకులు చిలికి చిలికి గాలివాన అన్నట్లు భారీ వర్షం పడింది. భారీ వర్షమంటే వందేళ్ల చరిత్రలో కనీవిని ఎరుగని వాన. ఆకేరు పరీవాహక ప్రాంతంలో 49 సెంటీమీటర్ల రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. ఈ మేఘ విస్ఫోటనంతో వచ్చిన వరద ఆ పల్లెపై తన పంజాను విసిరింది. ఆ విషాద రాత్రికి సజీవ సాక్షిగా ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం రాకాసి తండా నిలిచింది. వివరాల్లోకి వెళితే... 2024 సెప్టెంబర్ ఒకటిన ఆకేరు పరీవాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి ఆకేరుకు రికార్డు స్థాయిలో వరద వచ్చి రాకాసితండాను చుట్టుముట్టింది. ప్రాణ నష్టం జరగలేదు కానీ ఊహకందని రీతిలో ఆస్తి నష్టం జరిగింది. ఆకేరు రెండు పక్కల అర్థ చంద్రాకారంలో గ్రామానికి ఉంటుంది. మరో పక్క ఆకేరు పాయ పడడంతో రాకాసితండా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని పాఠశాల భవనాలు ఎక్కి ప్రజలు ప్రాణాలు కాపాడుకున్నారు కానీ పశువులు, జీవాలు కొట్టుకొనిపోయాయి. పలు ఇండ్లు నేలమట్టమయ్యాయి. కొన్ని రేకులషెడ్లు గోడలతో సహా ఆనవాళ్లు లేకుండా పోయాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. రోడ్లు తెగిపోయాయి. సమీపంలో ఆకేరుపై ఉన్న వంతెనకు ఇరువైపులా రోడ్డుకు భారీ గండ్లు పడ్డాయి. ఆకేరు ఉప్పెన రాకాసితండాలోని పలువురిని ఓ దశాబ్దం పాటు కోలుకోలేనివిధంగా చేసింది. పశువులను కోల్పోయి, ఇంట్లో దాచుకున్న వ్యవసాయ ఉత్పత్తులు కొట్టుకుపోయి దయనీయ స్థితిలో అర్థించాల్సిన పరిస్థితికి ఆకేరు తీసుకొచ్చింది. ఆ ఘోర కలికి ఏడాది. ఆ రోజు గుర్తొచ్చినప్పుడల్లా గ్రామంలోని వారు వణికిపోతున్నారు. ఇప్పటికీ ఈ గ్రామానికి చెందిన వ్యవసాయ భూములు మేటలు పెట్టి కొన్నిచోట్ల కోతలకు గురై సాగుకుయోగ్యం కాకుండా ఉన్నాయి. ఆ ఊర్లో నిర్మించిన సిమెంట్ రోడ్లే వరదకు కొట్టుకుపోయాయంటే వరద బీభత్సం ఏవిధంగా ఉందో అవగతమవుతుంది. అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు అందించిన సహాయం, ప్రోత్సాహం ఇప్పటికీ ఈ ప్రాంత ప్రజలు గుర్తుచేసుకోవడం విశేషం. ఏది ఏమైనా ఆ ఘోర కలిని మరువలేకున్నారు.

**ఆకేరు మిగిల్చిన నష్టం అపారం :**

ఆకేరు నదిని పరీవాహక ప్రాంత రైతాంగం వరప్రదాయినిగా భావించే వారు. ఆకేరు నీటితో సమృద్ధిగా పంటలు పండించుకునేవారు. కానీ ఆ ఆకేరే తమను కోలుకోలేనిదెబ్బతీస్తుందన్న విషయాన్ని గ్రహించలేకపోయారు. ఆకేరు పరీవాహక ప్రాంతంలోని రైతులు ఇప్పటికీ సరైన రీతిలో పంటలు పండించుకోలేకపోతున్నారు. కస్నా తండా సహా పలు గ్రామాల రైతులు భూములను చదును చేసుకుని పంటలు పండించుకునేందుకు ఇప్పటికీ శ్రమిస్తున్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మిజోరాంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం

**ఐజ్వాల్ :** మిజోరాంలోని చాంఫాయి జిల్లాలో జరిగిన ఆపరేషన్‌లో అస్సాం రైఫిల్స్ భారీ మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, యుద్ధసామగ్రి దుకాణాలను స్వాధీనం చేసుకున్నట్లు పారామిలిటరీ దళం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు, పారామిలిటరీ దళం చాంఫాయి జిల్లాలోని సైకుంఫాయి గ్రామంలో సోదాలు నిర్వహించి ఆగస్టు 29న ఒక ఇంటిని చుట్టుముట్టిందని అది తెలిపింది. శోధన ఆపరేషన్ సమయంలో, బృందం ప్రాంగణంలో ఇంటి నుండి ఒక 12 బోర్ రైఫిల్, ఒక పిస్టల్, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. ఇంటికి సమీపంలోని అడవిలో బృందం తన శోధనను కొనసాగించింది. పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలు, ఇతర యుద్ధ సామాగ్రి దుకాణాలను కలిగి ఉన్న దాచిన నిల్వను వెలికితీసిందని తెలిపింది. ఇంటి యజమానిని కూడా అరెస్టు చేసినట్లు ఆ ప్రకటన తెలిపింది. తదుపరి దర్యాప్తు కోసం చాంఫాయి జిల్లాలోని డంగ్‌లాంగ్‌లోని రాష్ట్ర పోలీసులకు అప్పగించినట్లు తెలిపింది.

## నేడు పాట్నాలో ముగియనున్న 'ఓట్ అధికార్ యాత్ర'

110 అసెంబ్లీ స్థానాల్లో 16 రోజుల పాటు 1300 కి.మీ. సాగిన యాత్ర



**పాట్నా :** ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో బీహార్‌లో చేపట్టిన 'ఓట్ అధికార్ యాత్ర' నేటితో ముగియనుంది. రాష్ట్రంలో 110కి అసెంబ్లీ నియోజకవర్గాల గుండా దాదాపు 1300 కి.మీ. మేర ఆ యాత్ర కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఈ యాత్రను నాందిగా భావిస్తున్నారు. కాగా, యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం రాహుల్ గాంధీ, ఆర్‌జెడికి చెందిన తేజస్వీ యాదవ్, ఇతర మహాఘట్బంధన్ నాయకులు పాదయాత్ర నిర్వహించనున్నారు. రాహుల్ గాంధీ, తేజస్వీయాదవ్, సిపిఐ(ఎంఎల్)కు చెందిన దీపాంకర్ భట్టాచార్య, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీకి చెందిన ముఖేష్ సహానీ యాత్రలో ఓపెన్ జీపులో కలిసి ప్రయాణించారు. వారంతా తమ ఐక్యతను ప్రదర్శించారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల వరకు 'ఓటు చోరీ' అనే నినాదాన్ని తీసుకువెళ్లారు. రాష్ట్రంలోని 25 జిల్లాల గుండా యాత్ర సాగింది, 'ఓటు చోర్, గద్దీ చోర్' అనే నినాదాలు ప్రతిధ్వనించాయి. నాయకులు ప్రతిరోజు వివిధ ప్రదేశాలలో సమావేశాలనుద్దేశించి ప్రసంగించారు. 'బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ద్వారా ఓట్లను దొంగిలించడానికి ఎన్నికల కమిషన్, బిజెపి కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. ఓటరు అధికార్ యాత్ర పాట్నాలో గాంధీ మైదాన్ నుండి డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ విగ్రహం, అంబేద్కర్ పార్క్ వరకు జరిగే భారీ యాత్రతో ముగుస్తుంది. లక్షలాది మందిని తాకిన యాత్రకు తగిన పరాకాష్టను ఇస్తుందని అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె సి వేణుగోపాల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జీ, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ జీ, మొత్తం మహాఘట్బంధన్ చేపట్టిన ఓటరు అధికార్ యాత్రకు బీహార్ ప్రజలు అపూర్వమైన మద్దతు ఇచ్చారు' అని ఆయన అన్నారు. చారిత్రక అణచివేత, కష్టాలను చూసిన రాష్ట్రానికి, వారి ఏకైక నిజమైన శక్తి ఓటు హక్కు దొంగిలించబడటం ఊహించలేనిది అని వేణుగోపాల్ అన్నారు. 'వారి హృదయాలలో ఉన్న ప్రజాస్వామ్య ఓదార్పు అవసరం ఉంది, ఎస్ఐఆర్ పేరుతో ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసేందుకు నాశనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ యాత్ర ఆశాకిరణంగా మారిందన్నారు. యాత్రలో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ సిట్టింగ్ సిఎంలు, అలాగే అఖిలేష్ జీ, ప్రియాంక గాంధీ జీ వంటి ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అయితే దర్భంగా పట్టణంలో యాత్ర సందర్భంగా ఒక వ్యక్తి మోదీపై హిందీలో అసభ్య పదజాలం ఉపయోగిస్తున్నట్లు చూపించిన వీడియో తర్వాత యాత్ర వివాదంలో చిక్కుకుంది. ప్రధాని మోదీపై దుర్భాషను ఉపయోగించారని ఆరోపిస్తూ అధికార పార్టీ చేపట్టిన నిరసన ప్రదర్శన సందర్భంగా పాట్నాలో బిజెపి, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఘర్షణ పడ్డారు. పాట్నాలో యాత్ర ముగియడానికి ముందు ముందు దశ యాత్ర చివరి రోజున, రాహుల్ గాంధీ తన ఓటరు అధికార్ యాత్ర బీహార్‌లో ప్రారంభమైన 'విప్లవం' అని, ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా దొంగిలించకుండా చూసుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ యాత్ర యావత్ దేశానికి వ్యాపిస్తుందని నొక్కి చెప్పారు. యాత్రలో రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. ప్రధానమంత్రి మోదీ, బిజెపి-ఆర్ఎస్ఎస్ సూపర్ సంపన్నుల ప్రయోజనాలకు సేవ చేస్తున్నారని ఆరోపించారు. ఇకా రాహుల్‌గాంధీ చాలా పోట్ల, తన ట్రేడ్‌మార్క్ తెల్లటి టీషర్టు, కార్గో ప్యాంటు ధరించగా, లోతట్టు ప్రాంతాల నివాసితుల మాదిరిగానే తన మెడలో 'గామ్‌చా' తీసుకెళ్లడం కూడా ఒక అలవాటుగా చేసుకున్నారు.

## నా డిమాండ్ నెరవేరే వరకూ ముంబయి వీడను

మరాఠా కోటా ఉద్యమ నేత జరంగే



**ముంబయి :** ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో మరాఠా కోటా కోసం మనోజ్ జరంగే చేపట్టిన ఆందోళన ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. తన డిమాండ్ రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు అవుతుందని జరంగే పేర్కొన్నారు. ఈ వర్గం వారు ప్రస్తుత ఇడబ్ల్యుఎస్ కోటాను పొందాలని బిజెపికి చెందిన కొందరు మహారాష్ట్ర మంత్రులు కూడా అన్నారు. మరాఠాలకు 10 శాతం కోటా ఇవ్వాలని జరంగే డిమాండ్ చేస్తున్నారు. వారిని ఇతర వెనుకబడిన తరగతుల వర్గంలో చేర్చబడిన వ్యవసాయ కులమైన కున్బీలుగా గుర్తించాలని, దీని వల్ల వారు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యలో రిజర్వేషన్లకు అర్హులవుతున్నారని ఆయన కోరుతున్నారు. తన డిమాండ్లు నెరవేరే వరకు ముంబయిని విడిచి వెళ్లబోనని, 58 లక్షల మంది మరాఠాలు కున్బీలుగా ఉన్నట్లు ప్రభుత్వం వద్ద రికార్డులు ఉన్నాయి అని జరంగే అన్నారు. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి సందీప్ షిండే నేతృత్వంలోని ప్రతినిధి బృందం తనను కలిసిన తర్వాత తన వైఖరిని మార్చుకోవడానికి నిరాకరించిన జరంగే.. ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించకపోతే సోమవారం నుండి తాను నీరు కూడా తీసుకోవడం మానేస్తానని హెచ్చరించారు. కోటా డిమాండ్ నెరవేరే వరకు వెనక్కి వెళ్ళను, ఏదైనా సరే ఒబిసి కేటగిరీ కింద మరాఠాలకు రిజర్వేషన్ లభించాల్సిందేనన్నారు. కాగా, బిజెపికి చెందిన మహారాష్ట్ర మంత్రులు చంద్రకాంత్ పాటిల్, నితేష్ రాణేలు మరాఠా సమాజాన్ని ఒబిసిలుగా వర్గీకరించడం కంటే ప్రస్తుత ఇడబ్ల్యుఎస్ కోటా నుండి ప్రయోజనం పొందాలని సూచించారు. పాటిల్, రాణే ఇద్దరూ మరాఠా సమాజానికి చెందిన వారు కావడం గమనార్హం. జరంగే నిరసనకు ఎన్‌సిపి (ఎస్‌పి) ఎమ్మెల్యే రోహిత్ పవార్ నిధులు సమకూర్చారని రాణే ఆదివారం సోలాపూర్ జిల్లాలో విలేకరుల సమావేశంలో ఆరోపించారు. మరాఠాలు ఎప్పుడూ అంటరానితనాన్ని ఎదుర్కోలేదని, కులపరంగా వెనుకబడినవారు కాదని, కానీ సంవత్సరాలుగా తగ్గుతున్న భూస్వాములు వారిని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టారని చంద్రకాంత్ పాటిల్ అన్నారు.

## దసరా ఉత్సవాలకు బాను ముష్తాక్‌ను ఆహ్వానిస్తా : సిఎం సిద్ధరామయ్య



**మైసూరు :** ఈ సంవత్సరం మైసూరు దసరాను ప్రారంభించడానికి అంతర్జాతీయ బుకర్ బహుమతి గ్రహీత బాను ముష్తాక్‌ను ఆహ్వానించాలనే నిర్ణయాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదివారం సమర్థించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని వర్గాలకు లౌకిక, సాంస్కృతిక పండుగగా అభివర్ణించారు. 'దసరా ఒక సాంస్కృతిక పండుగ, ఇది 'నాద హబ్బా' (రాష్ట్ర పండుగ). ఒక నిర్దిష్ట మతానికి చెందిన వ్యక్తులు మాత్రమే దీనిని ప్రారంభించాలని ఏమీ లేదు. నాద హబ్బ అంటే అందరికీ పండుగ. హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు, బౌద్ధులు, జైనుల అందరికీ పండుగ' అని ఆయన ఆదివారం విలేకరులతో అన్నారు. దసరాపై ఉన్నత స్థాయి కమిటీ తనకు అధికారం ఇచ్చిందని, అంతర్జాతీయ బుకర్ బహుమతి గ్రహీత బాను ముష్తాక్ దీనిని ప్రారంభించాలని నేతాను నిర్ణయించుకున్నానన్నారు. అంతకుముందు కూడా, ముస్లిం సమాజానికి చెందిన కవి కె.ఎస్. నిస్సార్ అహ్మద్‌ను దసరాను ప్రారంభించడానికి ఆహ్వానించారని గుర్తుచేశారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించే వారిని చరిత్ర తెలియని మతవాదులు అని, ఈ పండుగ హైదర్ అలీ, టిప్పు సుల్తాన్, దివాన్ మీర్జా ఇస్మాయిల్ హయాంలో జరుపుకున్నారని సిద్ధరామయ్య ఎత్తి చూపారు. 'ఇది లౌకిక పండుగ, కాబట్టి అంతర్జాతీయ బుకర్ బహుమతి గ్రహీతను ఆహ్వానించాలని నిర్ణయించుకున్నాను. కొంతమంది మత పెద్దలు దీనికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. వారికి తెలియకపోతే వారు చరిత్ర నేర్చుకోవాలి' అని ఆయన అన్నారు. ఈ అంశాన్ని బిజెపి రాజకీయం చేస్తోందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు.

## ఈ నెలలో అధిక వర్షపాతం

వరదలు పోటెత్తడం, కొండచరియలు విరిగిపడతాయని ఐఎంటి హెచ్చరిక

**న్యూఢిల్లీ :** భారత్‌లో సెప్టెంబర్ నెలలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. ఇప్పటికే దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాల వల్ల సంభవించిన అనేక విపత్తులను ఎదుర్కోవడం మనం చూశామని పేర్కొంది. సెప్టెంబర్ 2025లో నెలవారీ సగటు వర్షపాతం దీర్ఘకాలిక సగటు 167.9 మి.మీ.లో 109 శాతం కంటే ఎక్కువగా ఉంటుందని ఐఎండి అంచనా వేసింది. చాలా ప్రాంతాలలో సాధారణం నుండి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని, అయితే ఈశాన్య, తూర్పు ప్రాంతాలలోని కొన్ని ప్రాంతాలు, అలాగే తీవ్ర దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలోని అనేక ప్రాంతాలు, వాయువ్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. సెప్టెంబర్‌లో భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలకు దారితీస్తాయని, దక్షిణ హర్యానా, ఢిల్లీ, ఉత్తర రాజస్థాన్‌లో సాధారణ జీవితానికి అంతరాయం కలిగించే అవకాశం ఉందని ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర, హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్‌లోని మహానది నది ఎగువ పరీవాహక ప్రాంతాలలో కూడా భారీ వర్షాలు కురుస్తాయని ఆయన అన్నారు.

### ఆగస్టులో వాయువ్యభారతంలో 265 మి.మీ. వర్షపాతం

వాయువ్య భారతదేశంలో ఆగస్టులో 265 మి.మీ వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణశాఖ అంచనా వేసింది. ఇది 2001 తర్వాత ఈ నెలలో అత్యధికం. 1901 తర్వాత 13వ అత్యధికం. వర్షాకాలం మూడు



నెలల్లో ఇప్పటివరకు ఈ ప్రాంతంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. జూన్‌లో వర్షపాతం సాధారణం కంటే 42 శాతం ఎక్కువగా 111 మి.మీ., జులైలో వర్షపాతం సాధారణం కంటే 13 శాతం ఎక్కువగా 237.4 మి.మీ. నమోదైంది. ఆగస్టులో వర్షపాతం సాధారణం కంటే 197.1 మి.మీ., 34.5 శాతం ఎక్కువగా 265 మి.మీ., నమోదైందని ఐఎండి తెలిపింది. జూన్ 1, ఆగస్టు 31 మధ్య వాయువ్య భారతదేశంలో 614.2 మి.మీ. వర్షపాతం నమోదైంది, ఇది సాధారణం కంటే 484.9 మి.మీ. దాదాపు 27 శాతం ఎక్కువ. దశాబ్దాలలో ఎన్నడూ లేని విధంగా పంజాబ్‌లో అత్యంత దారుణమైన వరదలు సంభవించాయి. నదులు ఉప్పొంగడం, కాలువలు తెగిపోయి వేల హెక్టార్ల వ్యవసాయ భూములు మునిగిపోయాయి. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. హిమాలయ రాష్ట్రాలలో మేఘాల విస్ఫోటనం ఆకస్మిక వరదలు కొండచరియలు విరిగిపడటానికి కారణం కాగా, విస్తృత నష్టాన్ని కలిగించాయి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో వంతెనలు, రోడ్లు కొట్టుకుపోయినట్లు నివేదికలు రాగా, జమ్ముకశ్మీర్‌లో పదేపదే మేఘాల వేస్ఫోటనం, కొండచరియలు విరిగిపడ్డాయి. పశ్చిమ దేశాలలో తరచుగా జరిగే అవాంతరాల కారణంగా రుతుపవనాల పరిస్థితులు అధికంగా ఉండటం వల్ల ఈ ప్రాంతంలో వర్షపాతం పెరిగిందని ఐఎండి పేర్కొంది.

## అమిత్‌షాపై అనుచిత వ్యాఖ్యలు... టిఎంసి ఎంపి మహువాపై కేసు



**న్యూఢిల్లీ :** కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు టిఎంసి ఎంపి మహువా మొయిత్రాపై కేసు నమోదైంది. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను నిరోధించడంలో విఫలమయ్యారంటూ అమిత్ షాపై మహువా మొయిత్రా ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యల నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు మహువాపై రాయ్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంపి వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, రాజ్యాంగ విరుద్ధమని ఫిర్యాదుదారు పేర్కొన్నాడు. 1971 సమయంలో రాయ్‌పూర్‌లోని మానా క్యాంప్ ప్రాంతంలో అనేక మంది బంగ్లాదేశీ శరణార్థులు స్థిరపడ్డారని, మహువా వ్యాఖ్యలు వారిలో భయాందోళనలు రేకెత్తించాయని తెలిపాడు. అంతకుముందు పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ కొత్వాలీ పోలీస్ స్టేషన్‌లోనూ ఆమెపై ఫిర్యాదు దాఖలైంది. కాగా బంగ్లాదేశ్ నుంచి చొరబాట్ల విషయంలో మహువా మొయిత్రా ఇటీవల కేంద్రంపై విరుచుకుపడ్డారు. సరిహద్దు భద్రత విషయంలో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటోందని విమర్శించారు. బిజెపి నేతలు పదేపదే చొరబాటుదార్ల గురించి మాట్లాడుతున్నారని, దేశ సరిహద్దులను పరిరక్షించే బాధ్యతను ఐదు భద్రతాదళాలు నిర్వర్తిస్తున్నాయని తెలిపారు. అవన్నీ కేంద్ర హోంశాఖ పరిధిలోనే పనిచేస్తున్నాయని అన్నారు. 'కేంద్ర హోం శాఖ, హోంమంత్రి సరిహద్దులను రక్షించలేకపోయినప్పుడు, చొరబాటుదార్లు దేశ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రధాని స్వయంగా చెప్పినప్పుడు, ఆ తప్పు ఎవరిది..?' అని మహువా ప్రశ్నించారు. ఈ క్రమంలోనే అమిత్ షాను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## బహిరంగ ప్రదేశాల్లో వాహనం ఉపయోగించకుంటే... మోటారు వాహన పన్ను విధించొద్దు

సుప్రీంకోర్టు తీర్పు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** మోటారు వాహన పన్ను ప్రకృతిలో పరిహారాత్మకమైనది అని, ఒక వాహనాన్ని 'బహిరంగ ప్రదేశం'(పబ్లిక్ ప్లేస్)లో ఉపయోగించకపోతే, లేదా ఉపయోగం కోసం వినియోగించకపోతే, దాని యజమానిపై ఆ కాలానికి మోటారు వాహన పన్ను భారం పడకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2024 డిసెంబర్‌లో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం తన తీర్పును వెలువరించింది. 'మోటారు వాహనాల పన్ను ప్రకృతిలో పరిహారాత్మకమైనది. దీనికి తుది వినియోగంతో ప్రత్యక్ష సంబంధం ఉంది. 'రోడ్లు, జాతీయరహదారి వంటి ప్రజామౌలిక సదుపాయాలను వినియోగిస్తున్న వ్యక్తి నుండి మోటారు వాహనపన్ను విధించడానికి గల హేతబద్ధత, అటువంటి వినియోగానికి చెల్లించాల్సి ఉంది' అని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ మోటారు వాహన పన్నుచట్టం1963లోని సెక్షన్ 3ను ఈసందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ప్రస్తావించింది. ఈ నిబంధనలో లెజిస్లేచర్ ఉద్దేశపూర్వకంగానే 'పబ్లిక్ ప్లేస్' అనే వ్యక్తీకరణను ఉపయోగించింది. ఈ చట్టంలోని సెక్షన్ 3 మోటారు వాహనాల చట్టంలోని పన్ను విధించడాన్ని వివరిస్తుంది. 'ఒకవేళ మోటార్ వాహనాన్ని బహిరంగ ప్రదేశంలో ఉపయోగించకపోతే, బహిరంగప్రదేశంలో ఉపయోగించడానికి ఉంచకపోతే సంబంధిత వ్యక్తి ప్రజా మౌలిక సదుపాయాల ప్రయోజనాలను పొందడం లేదు కాబట్టి, ఆకాలానికి మోటారు వాహన పన్ను భారం పడకూడదు' అని ఆగస్టు 29న వెలువరించిన సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించింది. చట్టంలోని సెక్షన్ 3 అనేది మోటారు వాహనాలపై పన్ను విధించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఇచ్చే చార్జింగ్ నిబంధన అని పేర్కొంది. 'సెక్షన్ 3కింద పన్ను విధించదగిన ఈవెంట్ అంటే రాష్ట్రంలోని బహిరంగ ప్రదేశంలో వాహనాన్ని ఉపయోగించడం లేదా ఉపయోగించడం కోసం ఉంచడం' అని జస్టిస్ మనోజ్ మిశ్రా,జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం తెలిపింది. 'కాబటి పన్నుఅనేది పబ్లిక్ ప్లేస్‌లో మీ వాహనం ఉంచే ఉద్దేశాన్ని బట్టి ఉంటుంది. అందులో ఒక వాహనాన్ని వాస్తవానికి బహిరంగప్రదేశంలో ఉపయోగించినట్లయితే లేదా దానిని పబ్లిక్ ప్లేస్‌లో ఉపయోగించడానికి ఉద్దేశించిన విధంగా ఉంచినట్లయితే అప్పుడు పన్ను బాధ్యత పెరుగుతుంది' అని బెంచ్ వివరించింది. 'రాష్ట్రీయ ఇస్పాట్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) ప్రాంగణం ఒక మూసివేసిన ప్రాంతం. అప్పుడు పబ్లిక్‌ప్లేస్‌లో ఉపయోగించడానికి వాహనాలను ఉపయోగించడం లేదా ఉంచడం అనే ప్రశ్న తలెత్తదు. మోటార్ వాహనాలను ఆర్ఐఎన్ఎల్ నిషేధిత ప్రాంతంలో మాత్రమే ఉపయోగించారు లేదా ఉపయోగం కోసం ఉంచారు. అది 'పబ్లిక్ ప్లేస్' కాదు. కాబట్టి ఆ వాహనాలను ఆర్ఐఎన్ఎల్ నిషేధిత ప్రాంగణంలో ఉపయోగించిన లేదా ఉపయోగం కోసం ఉంచిన కాలానికి ఆ వాహనాలకు పన్ను విధించబడవు' అని అప్పీల్‌ను అనుమతిస్తూ ధర్మాసనం తెలిపింది. 1985 నుండి లాజిస్టిక్ వ్యాపారంలో నిమగ్నమై ఉన్న ఒక సంస్థ దాఖలు చేసిన అప్పీల్‌పై ధర్మాసనం తన తీర్పును వెలువరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లోని సెంట్రల్ డిస్పాచ్ యార్డ్‌లో ఐరన్ అండ్ స్టీల్ పదార్థాల నిర్వహణ, నిల్వకోసం 2020 నవంబర్‌లో ఈ సంస్థకు కాంట్రాక్టు లభించిందని, ఇది కార్పొరేట్ సంస్థ ఆర్ఐఎన్ఎల్ అని పేర్కొన్నది. సెంట్రల్ డిస్పాచ్‌యార్డు ప్రాంగణంలో కంపెనీ 36 మోటారు వాహనాలను మోహరించిందని ధర్మాసనం తెలిపింది. సెంట్రల్ డిస్పాచ్ యార్డు కాంపౌండ్ గోడలు, ప్రవేశం, నిష్క్రమణ ద్వారాలతో చుట్టుముట్టబడిందని, అక్కడ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సిఐఎస్ఎఫ్) సిబ్బంది మోహరించబడతారని, ఎవరికీ దానిలోకి ప్రవేశించే హక్కులేదని సంస్థ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆసంస్థ తమ వాహనాలను సెంట్రల్ డిస్పాచ్ ప్రాంగణంలో పరిమితం చేసి ఉపయోగిస్తుంటే మోటార్ వాహన పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రా ప్రాక్ అథారిటీని అభ్యర్థించడంతో ఈసమస్య తలెత్తింది. రూ.22లక్షల 71వేల700 మొత్తాన్ని కంపెనీకి తిరిగి చెల్లించాలని సింగిల్ జడ్జి రాష్ట్ర అధికారులను ఆదేశించారు. ఆతర్వాత అధికారులు ఆ ఉత్తర్వును డివిజన్ బెంచ్‌ముందు సవాల్ చేశారు. ద్విసభ్య ధర్మాసనం సింగిల్ జడ్జి ఉత్తర్వులను పక్కనపెట్టింది.

## స్వదేశీ ఉత్పత్తుల పట్ల ప్రజలు గర్వపడాలి

మన్ కీ బాత్' 125వ ప్రసారంలో ప్రధాని మోదీ ఉద్బోధ




**న్యూఢిల్లీ :** రాబోయే వారాలలో పండుగ సీజన్ గరిష్ఠస్థాయికి చేరుకుంటున్నందున స్వదేశీ ఉత్పత్తుల పట్ల ప్రజలు గర్వపడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం పిలుపునిచ్చారు. 'స్థానికం కోసం స్వరం' అనే మంత్రాన్ని 'ఆత్మనిర్భర్ భారత్' మార్గం అభివృద్ధి చెందిన భారతదేశానికి సోపానం అవుతుందని నొక్కిచెప్పారు. జీవితంలో అవసరమైన ప్రతీదీ స్వదేశీది అయ్యి ఉండాలన్నారు. ప్రధాని మోదీ 'మన్‌కీ భారత్' కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ వస్తువులపై 50శాతం సుంకం విధించిన తర్వాత అమెరికాతో సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో దేశం స్వావలంభన చెందాల్సిన అవసరాన్ని ఆయన పదేపదే నొక్కిచెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో గణేష్ ఉత్సవం, దుర్గాపూజ, దీపావళి పండుగ జరుపుకుంటున్న తరుణంలో ప్రజలు ఎన్నటికీ స్వదేశీ ఉత్పత్తులను మర్చిపోరాదని హితవు చెప్పారు. బహుమతులు కొనుగోలు, వస్త్రాలు, డెకార్ వస్తువులు ఏదైనా కావచ్చు కానీ స్వదేశీ ఉత్పత్తుల కొనుగోళ్లు మర్చిపోరాదని ప్రజలకు పిలుపునిచ్చారు. 'ఇది స్వదేశీ అని సగర్వంగా చెప్పండి. గర్వంతో ఇది స్వదేశీ అని చెప్పండి. ఈ భావనతోనే మనం ప్రతీఒక్కరం ముందుకు వెళ్లాలి. కేవలం 'స్థానికం కోసం స్వరం' ఆత్మనిర్భర్ భారత్ అనే బాటలో నడిచినప్పుడే అభివృద్ధి చెందిన భారతదేశం అనే లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం' అని ప్రధాని మోదీ చెప్పారు. ఈ నెల ప్రారంభంలో కెనడాలోని మిస్సిసాగాలో 51 ఫీట్ల పొడవైన దేవుడి విగ్రహాన్నిప్రారంభించగా, భారతీయ సంస్కృతి పట్ల ప్రేమ ఇప్పుడు ప్రపంచంలోని ప్రతీ మూలకూ చేరుకుంటోందని ప్రధానమంత్రి మోదీ తన నెలవారీ మన్‌కీబాత్ (125వ) ప్రసంగంలో వివరించారు. ఈ నెలలో అత్యంత చల్లని ప్రాంతం అయిన రష్యాలోని వ్లాడివోస్టాక్‌లో ఒక ఒక ప్రత్యేకమైన గొప్ప ఎగ్జిబిషన్ జరిగింది. ఇందులో రష్యన్ బాలలు అద్భుతమైన పెయింటింగ్స్ వేశారు. వేర్వేరు ఇతివృత్తాలతో రూపొందించిన రామాయణంలోని చిత్రాలను ప్రదర్శించారని మోదీ గుర్తుచేశారు. ప్రపంచంలో భారతీయ సంస్కృతి పట్ల పెరుగుతున్న అవగాహన అవగాహనలో భాగంగా హృదయానికి హత్తుకునేలా చూడడానికి ఇది దోహదపడుతుందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీవర్షాలు, కొండచరియలు విరిగిపడటం, వరదలపై ఆయన తన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు దేశాన్ని పరీక్షిస్తున్నాయన్నారు. భారీ వరదల కారణంగా అనేక రాష్ట్రాలలో ప్రాణాలు కోల్పోవడం, వేల సంఖ్యలో నిరాశ్రయులవడం బాధాకరమన్నారు. పంటపొలాలు మునిగిపోయాయని, వరదలకు బ్రిడ్జిలు నేలమట్టం అయ్యాయని, రోడ్లు కొట్టుకుపోయాయని, ప్రజల జీవితాలు గాలిల్లో దీపాల్లా ప్రమాదకరంగా మారాయని, ఈసంఘటనలు ప్రతీ భారతీయుడినీ బాధించాయని ప్రధానమంత్రి చెప్పారు. అయితే ఇలాంటి విపత్కర పరిస్థితులలో జాతీయ, రాష్ట్ర అత్యవసర దళాలు ప్రజలకు సహాయం చేయడానికి రాత్రింబగళ్లు శ్రమించాయని తెలియజేశారు. థర్మల్ కెమెరాలు, లైఫ్ డిటెక్టర్లు, స్నీఫర్ డాగ్స్, డ్రోన్ నిఘాను సహాయక, పునరావస చర్యల్లో భాగంగా మోహరించినట్లు మోదీ చెప్పారు.ఈ సంక్షోభ సమయంలో భద్రతా దళాలు, స్థానిక జనాభా, సామాజిక కార్యకర్తలు, వైద్యులు, పరిపాలనా యంత్రాంగం సాధ్యమైన ప్రతీ ప్రయత్నం చేసినట్లు వివరిస్తూ వారి సేవలను ప్రశంసించారు. జమ్ము కశ్మీర్‌కు చెందిన మొహిసిన్ అలీ బంగారు పతకాన్ని గెలుచుకున్నాడని, ఈ ప్రాంతం యువత దేశానికి అత్యంత సామర్థ్యాలు కలిగి ఉన్నందున వారు దేశానికి గొప్ప విజయాన్ని అందించగలరన్న విశ్వాసం వ్యక్తంచేశారు.

### 'మోదీ మన్ కీ బాత్' ప్రసంగంలో 'తెలంగాణ' ప్రత్యేక ప్రస్తావన...

మోదీ తన ప్రసంగంలో తెలంగాణ రాష్ట్రం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. హైదరాబాద్‌ను నిజాం పాలన నుంచి విముక్తి చేసే ఆపరేషన్‌కు సంబంధించి భారతదేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రసంగించిన ఆడియో బైట్‌ను కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సందర్భంగా ప్లే చేశారు. వచ్చే నెల సెప్టెంబర్‌లో మనం హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని జరుపుకుంటాం. 'ఆపరేషన్ పోలో' లో పాల్గొన్న వారందరి ధైర్యాన్ని మనం గుర్తుంచుకునే నెల ఇది' అని మోదీ పేర్కొన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత త్రివర్ణపతాకాన్ని ఎగురవేసినందుకు లేదా 'వందేమాతరం' అని నినాదాలు చేసినందుకు కూడా నిజాం దళాలు, వారి ప్రైవేట్ మిలీషియా రజాకార్లు ప్రజలను చంపారని, దీంతో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆపరేషన్‌ను ప్రారంభించారని గుర్తుచేశారు.

## మణిపూర్‌లో టీవీ జర్నలిస్టుపై కాల్పులు

**ఇంఫాల్/గౌహతి :** మణిపూర్‌లోని సేనాపతి జిల్లాలో పూల ఉత్సవాన్ని కవర్ చేయడానికి వెళ్లిన టీవీ జర్నలిస్టుపై కాల్పులు జరిగాయని పోలీసులు ఆదివారం తెలిపారు. నాగాలాండ్‌కు చెందిన హార్న్‌బిల్ టీవీ జర్నలిస్ట్ దీప్ సైకియాకు తుపాకీ గాయాలు అయ్యాయని వారు తెలిపారు. సైకియా జిన్నియా పూల ఉత్సవాన్ని కవర్ చేస్తున్న నాగ ప్రాబల్య జిల్లాలోని లై గ్రామంలో శనివారం సాయంత్రం ఈ సంఘటన జరిగిందని వారు తెలిపారు. గన్‌మ్యాన్‌ను స్థానికులు ఎయిర్ గన్‌తో పాటు పట్టుకుని పోలీసులకు అప్పగించారని అధికారులు తెలిపారు. జర్నలిస్టుపై దాడి వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు. దిమాపూర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన సైకియా మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని కవర్ చేసిన తర్వాత తిరిగి వస్తున్న ఐదుగురు వ్యక్తులు, ఉపశమనం కోసం మా వాహనం నుండి దిగగా అకస్మాత్తుగా, నా కుడి కాలుపై కాల్పులు జరిగాయి, కొన్ని సెకన్ల వ్యవధిలో, రెండవ బుల్లెట్ నా కుడి చంకను తాకింది. ఆ ఐదుగురిలో నాపై మాత్రమే రెండుసార్లు కాల్పులు జరిగాయని ఆయన అన్నారు. దాడిని ఖండిస్తూ, నాగా జర్నలిస్ట్స్ యూనియన్ మణిపూర్ (ఎన్‌యుజెఎం) ఆదివారం తన సొంత నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. హార్న్‌బిల్ టీవీ ఎడిటర్ డ్జుథోనో మెక్రో ఈ దాడిని ఖండించారు, దీనిని పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలపై దాడిగా అభివర్ణించారు.

## ఎస్ఐఆర్ తరువాత 'ఓటరు' కార్డులు

**న్యూఢిల్లీ :** బిహార్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణ పూర్తయిన తర్వాత రాష్ట్రంలోని ఓటర్లకు కొత్త ఓటరు గుర్తింపు కార్డులను జారీ చేయాలని ఎన్నికల సంఘం యోచిస్తోందని అధికారులు తెలిపారు. కొత్త కార్డులను ఎప్పుడు జారీ చేస్తారనే దానిపై పోల్ అథారిటీ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని వారు తెలిపారు. ప్రతి బిహార్ ఓటరుకు కొత్త ఓటరు కార్డును జారీ చేయాలనే ప్రణాళిక ఉన్నప్పటికీ, ఈ ప్రక్రియ ఎప్పుడు, ఎలా జరుగుతుందనే దానిపై తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదని అధికారులు తెలిపారు. ఆగస్టు 1న ప్రచురించబడిన బిహార్ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం, రాష్ట్రంలో 7.24 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. తుది ఓటర్ల జాబితా సెప్టెంబర్ 30న ప్రచురించబడనుండగా, రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నవంబర్‌లో జరిగే అవకాశం ఉంది. ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం నవంబర్ 22న ముగుస్తుంది. ముసాయిదా జాబితాలలో తమ పేర్లు లేకపోవడంతో దాదాపు 30,000 మంది ఓటర్ల జాబితాలో చేర్చాలని దరఖాస్తులు దాఖలు చేశారు. ఓటింగ్ రోజున పోలింగ్ కేంద్రాలలో రద్దీని తగ్గించడానికి పోలింగ్ కేంద్రాలకు ఓటర్ల సంఖ్యను 1500 నుండి గరిష్టంగా 1200 కు తగ్గించిన మొదటి రాష్ట్రంగా బిహార్ నిలిచింది. హేతుబద్ధీకరణ కారణంగా, రాష్ట్రంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 77,000 నుండి 90,000కు పెరిగింది.




# 'అక్షరాల' ఉద్యమకారిణి గౌరీ లంకేశ్



మతవాదుల గుండెల్లో దడపుట్టించిన పేరు... దమన నీతిని ఎండగట్టిన పేరు గౌరీ లంకేశ్ (29 జనవరి 1962 – 5 సెప్టెంబరు 2017). ఆమె ఓ విప్లవాత్మక స్ఫూర్తి ప్రదాయని. ప్రజా స్వేచ్ఛను ప్రతినిధి చేసిన నిర్భయ పాత్రికేయురాలు.. ఉద్యమ కారిణి. ప్రగతిశీల భావజాలాన్ని, మానవ హక్కులను, లౌకిక విలువలను పరిరక్షించేందుకు తన శ్వాసను అర్పించిన వినూత్న మహిళా నాయకుల్లో ఆమె పేరే ముందు ఉంటుంది. కర్నాటకలోని బెంగళూరులో జన్మించిన ఆమె గళం దక్షిణ భారతదేశంలోనే కాక, దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య, లౌకిక ఉద్యమాలలో ప్రతిధ్వనించింది. తండ్రి పి.లంకేశ్ ప్రముఖ వామపక్ష కవి, రచయిత, జర్నలిస్టు. చిన్నప్పటి నుంచి సాగిన పాత్రికేయ ముద్ర ఆమెలోని తిరుగుబాటును మరింత జాగృతం చేసింది. తండ్రి లంకేశ్ తనపేరుతోనే 'లంకేశ్' అనే పత్రికను నడిపారు. ఈ కారణంగానే గౌరీ లంకేశ్ చిన్నప్పటినుంచే జర్నలిజంపై ఆసక్తి కనబరిచింది. పలు ఇంగ్లీష్, కన్నడ పత్రికల్లో పనిచేస్తూ ప్రజా సమస్యలపై కథనాలను అందించింది. ప్రముఖ పాత్రికేయురాలిగా ఎదిగింది. మితవాదులు, హిందూత్వవాదులపై లౌకిక కోణంలో విమర్శలు చేసే పాత్రికేయురాలిగా ఆమె పేరు జర్నలిజంలో మారుమోగింది. కొంతకాలం 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో పనిచేసిన గౌరీ లంకేశ్, అనంతరం తన తండ్రి స్థాపించిన 'లంకేశ్ పత్రికే' వార్తాపత్రికను సోదరుడు ఇంద్రజిత్‌తో కలిసి కొన్నేళ్లు నడిపింది. ఆ తర్వాత తన సొంత వార్తా పత్రిక 'గౌరీ లంకేశ్ పత్రికే'తో పాటు పలు ప్రచురణలను ప్రారంభించింది. ధైర్యశాలిగా, ముక్కుసూటిగా మాట్లాడే పాత్రికేయురాలిగా ఆమె ప్రసిద్ధి చెందింది. చాలా మంది ప్రశ్నించడానికి జంకుతున్న అనేకానేక సమస్యలపై ఆమె గళం విప్పింది. ధైర్యంతో సమాజాన్ని కదిలించే ఆమె మాటలు, నిజాయితీకి తావిచ్చే ఆమె అక్షరాలు మహిళల అభ్యుదయానికి, స్వేచ్ఛకు కొత్త నిర్వచనం ఇచ్చాయి. అపోర్థాలకు, మూఢనమ్మకాలకు, మతవాదపు కుట్రలకు ఆమె లోపలే శక్తికలనాన్ని కోరింది. గౌరీ లంకేశ్ యువత, కుటుంబం, దళిత స్వాభిమాన ఉద్యమాలకు కొత్త ఊపిరిని అందించింది. శ్రమజీవుల అలజడులకు ఉత్సాహాన్నిచ్చింది. ఉద్యమ ఉద్యానవనాలలో వికసించిన పుష్పం ఆమె. దళిత హక్కుల కోసం పరితపించిన హృదయం ఆమెది. సమాజంలో జరుగుతున్న మతపరమైన విభజన, సామాన్యులు, మసిళలు, మైనారిటీ వర్గాలపై పెరుగుతున్న హింసపై ఆమె గొంతు విప్లవనినాదమైంది. దళిత, గిరిజన, అణగారిన వారి గళాల శబ్దాలను ఆమె తిరుగుబాటు జ్వాలగా మలిచింది. తన స్వయంకృషితో, జర్నలిజంపైనే కాక, ప్రజా ఉద్యమాల్లో పోరాట పిడికిలి అయింది. ఆమె రాసిన ప్రతి పదం ఒక ప్రతిచర్యకు పునాదులు వేసింది. ఆమె మాట్లాడిన ప్రతి అక్షరం భావోద్వేగభరితమై, ఆలోచింప చేసింది. కర్నాటకలో జరిగిన ఎన్నో సామాజిక ఉద్యమాల్లో ఆమె ముందు వరుసలో నిలిచింది. గౌరి లంకేశ్ మూఢాచారాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని సాగించింది. సమాజంలోని అసమానతలు, దురాచారాల నిర్మూలనకు నడుం కట్టిన పోరులకు, వారు సాగించిన ఆందోళనలకూ లంకేశ్ పత్రికతో ప్రచారం కల్పించింది. లెక్కకు మించిన ప్రజా ఉద్యమాలతో మమేకమైంది. ఎంగిలాకులపై పొర్లు దండాలు పెట్టించే దుష్ట ఆచారానికి వ్యతిరేకంగా సాగిన పోరాటానికి మద్దతిచ్చింది. బాబాబుడాన్ గిరి దత్త పీఠం వివాదంలో సంఘపరివార్ శక్తుల దూకుడును అడ్డగడుగునా అడ్డుకునేందుకు నిరంతరం కృషి చేసింది. మత సామరస్య సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేసింది. ప్రజాందోళనల్లో పాల్గొనే యువ కార్యకర్తలకు అండగా నిలిచింది. దళిత యువజన కార్యకర్త జిగ్నేశ మేవాని, అఖిల భారత విద్యార్థి సమాఖ్య నాయకుడు కన్నయ్యలాల్‌ను తన దత్త పుత్రలని ప్రకటించింది. అణగారిన వర్గాల కోసం పోరాడే వారిపై ఎనలేని ప్రేమాభిమానాల్ని ప్రదర్శించింది. పత్రికారచనతోపాటు ప్రజాందోళనల క్రియాశీల కార్యకర్త, నేతగానూ జోడుగుర్రాల స్వారీని అప్రతిహతంగా సాగించి రెండు రంగాల్లోనూ చెరగని ముద్ర వేసింది. మూఢనమ్మకాలను తీవ్రంగా వ్యతిరేకించే గౌరి లంకేశ్, దేవాలయాల్లో జరిగే మూఢనమ్మకాలను విమర్శిస్తూ ఎన్నో కథనాలు ప్రచురించారు. దీంతో ఓ వర్గం నుండి ఆమెకు వ్యతిరేకత తప్పలేదు. స్వేచ్ఛను కోరుకోవడం... సమానత్వం గురించి మాట్లాడడం.. హక్కులపై నినదించడం.. న్యాయమైన వాటా కోసం పోరాడటం నచ్చని మత ఛాందసవాదుల తూటాలకు ఆమె బలికావాల్సి వచ్చింది. 2017 సెప్టెంబరు 5న బెంగళూరు నగరంలోని స్వయంభూత నగర వీధిలో దారుణ హత్యకు గురైంది. ఆమె హత్య భారత రాజకీయ, సామాజిక, న్యాయ వ్యవస్థపై తీవ్రమైన ప్రభావాలు సృష్టించింది. ఈ హత్య భారతదేశంలోని స్వాతంత్ర్య, మీడియా స్వేచ్ఛ, నిరంతర దాడులపై ప్రశ్నలు రేకెత్తించింది. గౌరీ లంకేశ్ హత్యపై దేశ వ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు, నిరసనలు జరిగాయి. ప్రజా మాధ్యమాలు, ఉద్యమాలు ఆమె మరణాన్ని ప్రజాస్వామ్య హక్కులపై పడిన దాడిగా అభివర్ణించాయి. పోలీసులు దర్యాప్తు ప్రారంభించి హత్యకు సంబంధించి తీవ్రవాద బృందాల భాగస్వామ్యం ఉంటుందని గుర్తించారు. మోహన్ నాయక్, దినేష్ మహేశ్వరిసహా కీలక నిందితులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, న్యాయ వ్యవస్థలో కేసుల పరిష్కారం కూడా సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణపై ప్రజల విశ్వాసాన్ని పరీక్షకు గురిచేస్తున్నదని మానవ హక్కుల సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు విమర్శిస్తున్నారు. దోషులకు వెంటనే శిక్ష పడకపోతే, ఇలాంటి ఘటనలు నిత్యం చోటు చేసుకుంటునే ఉంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గౌరీ లంకేశ్ హత్య కొన్ని కీలక అంశాలను తెరపైకి తెచ్చింది. మీడియా స్వేచ్ఛపై జరుగుతున్న దాడులను గుర్తు చేస్తున్నది. విమర్శలను సహించలేని తత్వం.. ప్రశ్నించే గొంతుకలను నొక్కివేసే వైనం మరోసారి బహిర్గతమయ్యాయి. ఆమె భారతదేశ ప్రజాస్వామ్యాన్ని, విలువల పునాదులను ప్రశ్నించింది. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని, ప్రజాస్వామ్య, మానవహక్కుల ఉద్యమాలు మరింత బలపడుతున్నాయి. గౌరీ లంకేశ్ హత్య భారతదేశంలో రాజకీయ, సామాజిక హక్కుల పరిరక్షణలో వినూత్న మలుపులను తీసుకువచ్చింది. అది న్యాయవేత్తల, మీడియా, ప్రజాస్వామ్య ఉద్యమాలకు కారణమైంది. ఆమె హత్యతో వెలిగిన తిర్గుగుమాటు జ్వాల ఇంకా దేశపు వీధుల్లో మెరుస్తోంది. 'భయం లేని బతుకే నిజమైన ప్రజాస్వామ్య శబ్దం' అన్న గౌరీ లంకేశ్ మాటలు ఇప్పుడు దేశమంతటా ప్రతిధ్వనిస్తున్నాయి. మానవ హక్కుల కార్యకర్తలు, యువత, రచయితల నడకలో ఆమె ఆత్మ స్పందిస్తోంది. ప్రజా స్వేచ్ఛకు, విప్లవానికి ఆమె మారుపేరు. ఆలే జీవితం అన్యాయాన్ని నిలదీసింది. చీకటిని చీల్చేసింది. మాటలకు పదును పెంచింది. ప్రతి అణగారిన వర్గానికీ ఆమె కాంతి కిరణమై వెలుగుదారి చూపిస్తున్నది. గౌరీ లంకేశ్ ఇప్పుడు భౌతికంగా మన మధ్య లేదు. అయితేనేం, మతోన్మాదానికి, మూఢనమ్మకాల చీకటికి, సంప్రదాయ పాలకుల మొండితనానికి ఆమె కలం నుంచి జాలువారిన రచనలు వెన్నులో వణుకు పుట్టిస్తునే ఉన్నాయి.


– డా॥ లక్ష్మీ ప్రసూన

> ప్రశ్నించే గుణాన్ని... పోరాడే తత్వాన్ని అణువణువునా రగిల్చే గౌరీ లంకేశ్ మత మౌఢులకు ఓ అగ్నిజ్వాల. ప్రజాస్వామ్య వాదులకు అనువిందు చేసే హరివిల్లు. ఆమె ప్రతి మాట బంధనాల గోడల్ని ధ్వంసం చేసే రణన్నినాదం... ప్రగతికి మార్గం చూపే కాంతి దీపం.. ఉద్యమాల నెగడ్లను వెలిగించే జ్వాలాకణం. ఆమె నిబద్ధతకు, న్యాయదీక్షకు, అద్వితీయ స్వేచ్ఛకు నిలువెత్తు రూపం. ఆమె ప్రతీ అడుగు ఓ విప్లవ కథ. ప్రతీ మాటలో భవిష్యత్తునునడిపించే ఉద్యమ బావుటా. గౌరీ శంకర్ ప్రతి రచనా ఓ విప్లవ రాగం. ప్రగతిశీల ఆలోచనలకు, ప్రజా ఉద్యమాలకు రెక్కలు తొడిగే మంత్రదండం. ఆమె శ్వాసే ఓ నినాదం.. ఆమె జీవితం, కొత్త యుగానికి దారి చూపే కాంతిపుంజం. తరతరాలుగా సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత ఛాందస భావాల సంకెళ్లు తెగిపడాలంటే, గౌరీ లంకేశ్ భావజాలం ప్రతి గుండెల్లోనూ మారుమోగాలి.




## చదవాల్సిన పుస్తకం

### తెలంగాణ సాయుధ పోరాటం అనుభవాలు – జ్ఞాపకాలు




చారిత్రిక ఘటనలను, హింసకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలను, దోపిడీని ప్రతిఘటించే ఉద్యమాలను గురించి విషయ సేకరణ చేయడం, ఆ వివరాలను గ్రంథస్థం చేయడం ఆనవాయితీ. ఆయా రచనలను తప్పు పట్టలేంగానీ, అందులో పూర్తి వాస్తవాలు ప్రతిబింబిస్తాయని అనుకోవడానికి వీల్లేదు. రచయిత స్వయంగా ఆయా సందర్భాల్లో అక్కడ ఉండడు కాబట్టి, ఇతరులు ఇచ్చిన సమాచారాన్ని మాత్రమే పొందుపరచగలుగుతాడు. అయి తే, ఒక ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తే, తన అనుభవాలను గ్రంథ స్థం చేస్తే... ప్రత్యక్షంగా ఆనాటి పరిస్థితులు, ఉద్యమ తీరుతెన్నులు పాఠకుల కళ్ల ముందు కదలాడతాయి. తెలంగాణ సాయుధ పోరాటంపై చాలా పుస్తకాలు వచ్చి ఉండవచ్చు.. ఎంతో మంది ఎన్నో రకాలుగా వివరించి ఉండవచ్చు... కానీ, కామ్రేడ్ దొడ్డా నరసయ్య రాసిన 'తెలంగాణ సాయుధ పోరాటం.. అనుభవాలు–జ్ఞాపకాలు' పుస్తకం వాటన్నిటికీ మించినది. విలక్షణమైనది. ఎందుకంటే, కామ్రేడ్ నరసయ్య స్వయంగా తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. నిజానికి ఈ పోరాటానికి ముందే, 1940 దశకంలో తన స్వగ్రామమైన చిలుకూరులో, నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ ప్రాంతంలో ఫ్యూడల్ ప్రభువుల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్మించారు. నాటి యువతను, రైతాంగాన్ని సంఘటిత పరిచి, పోరాటపథంలో నడిపించారు. ఆ తర్వాత తెలంగాణ సాయుధ పోరాటంలో నల్లగొండ జిల్లా దళం డిప్యూటీ కమాండర్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆయన తన అనుభవాలను ఐదు భాగాల్లో మనకు వివరిస్తారు. చిలుకూరు మహాసభ నుంచి భువనగిరి మహాసభ వరకు (1940–44) అనుభవాల హారం మొదటి భాగంలో పాఠకులను పలకరిస్తుంది. రెండో భాగంలో, భువనగిరి మహాసభ నుంచి మల్లారెడ్డి గూడెం కాల్పుల వరకు (194446 డిసెంబర్) చోటు చేసుకున్న పరిణామాలు వివరించారు. ఇక మూడో భాగంలో భారత దేశానికి స్వాతంత్ర్య ప్రకటన... నైజాం వ్యతిరేక పోరాటం (1947–48) వివరాలు ఉన్నాయి. ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ ఉద్యమం నిలబడదు. అందుకే ప్రజల భాగస్వామ్యాన్ని ఆయన నాలుగో భాగంగా అద్భుతంగా ఆవిష్కరించారు. ఐదో భాగంలో సైన్యం ప్రవేశం, ఆరో భాగంలో విస్తృతమైన ఉద్యమ రూపాలను కళ్లకుకట్టినట్టు వివరించారు. తెలంగాణ చరిత్రను, నాటి సాయధ పోరాట పంథాను, చోటు చేసుకున్న కీలక పరిణామాలను ప్రతి తెలంగాణవాసి తప్పక తెలుసుకోవాలి. ఈ వివరాలను సంక్షిప్తంగానేగానీ, సమర్థవంతంగా అందించిన కామ్రేడ్ నరసయ్య ధన్యుడు. ఆయన స్వీయ అనుభవాలతో కూడిన ఈ రచన తప్పక చదవాల్సిన పుస్తకాల జాబితాలో ఉండితీరుతుంది.

#### పుస్తకం పేరు


తెలంగాణ సాయుధ పోరాటం..
అనుభవాలు – జ్ఞాపకాలు
రచయిత : దొడ్డా నరసయ్య
వెల: రూ.80


ప్రతులకు

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).




# కొత్త పదాలు కాదు.. 'కొత్త భాషలే' సృష్టించాడు!







విలియమ్ షేక్స్‌పియర్ వంటి కొందరు రచయితలు కొత్తకొత్త పదాలు సృష్టించారు. అయితే, జెఆర్ఆర్ టోల్కీన్‌గా సుప్రసిద్ధుడైన జాన్ రోనాల్డ్ రూయెల్ టోల్కీన్ (1892 జనవరి 2–1973 సెప్టెంబర్ 3) మాత్రం ఏకంగా కొత్త భాషలే సృష్టించాడు. అంతేగాక, భారత పురాణాల్లో విశ్వామిత్రులు 'త్రిశంకు స్వర్గం' సృష్టించిన రీతిలోనే అతను తన రచనల్లో ఒక కొత్త కల్పిత లోకాన్ని సృష్టించాడు. ఆధునిక ఫాంటసీ సాహిత్యానికి పితామహుడు అంటూ ఎవరైనా ఉంటే, టోల్కీన్ పేరునే పేర్కోవాలి. అతని రచనలను ప్రపంచ సాహిత్యంలో ఒక మహత్తరమైన మైలురాయిగా అభివర్ణిస్తారు. ఆయన రచయితగా, అనేక భాషలు, జాతులు, సంస్కృతులు, దేవతా తత్వం, చరిత్రలు, పురాణాలను సమగ్రంగా మిళితం చేసిన అద్భుతమైన విశ్వాన్ని నిర్మించాడు. 'ది హాబిట్' (1937), 'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్' (1954–55), 'ది సిల్మారిల్లియన్' (1977, మరణానంతరం ప్రచురణ) వంటి గ్రంథాల ద్వారా ఆయన మానవకల్పన శక్తికి అసాధారణమైన దిశనిచ్చాడు. దక్షిణాఫ్రికాలోని బ్లూమ్‌ఫాంటైన్‌లో జన్మించిన టోల్కీన్ చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయాడు. తల్లి మేబెల్ ప్రభావం అతనిని విలక్షణమైన వ్యక్తిగా తీర్చిదిద్దింది. కానీ 1904లో తల్లిని కూడా కోల్పోవడంతో చిన్న వయసులోనే అతను ఒంటరితనాన్ని ఎదుర్కొన్నాడు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ఎక్సెటర్ కాలేజ్‌లో చదువుకున్న టోల్కీన్, క్లాసిక్స్, ప్రాచీన భాషలు, ఫిలోలజీ (భాషల చరిత్ర, నిర్మాణాల అధ్యయనం)లలో ప్రావీణ్యం సాధించాడు. భాషల పట్ల ఈ మక్కువ తరువాత అతని సాహిత్యానికి బలమైన పునాదిగా నిలిచింది. టోల్కీన్ జీవితంలో ప్రథమ ప్రపంచ యుద్ధం ఒక భయానక మలుపు. 1916లో ఆయన ఫ్రాన్స్‌లోని సోమ్ యుద్ధరంగానికి బలవంతంగా వెళ్లాల్సి వచ్చింది. అక్కడ అతను యుద్ధభీకరత, మానవ నష్టాలు, నైతిక పతనాన్ని ప్రత్యక్షంగా చూశాడు. యుద్ధంలో తన సన్నిహిత స్నేహితులను కోల్పోయాడు. ఈ అనుభవాలు టోల్కీన్ సాహిత్యంలో ప్రతిఫలించాయి. 'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్'లో పేర్కొన్న మోర్డోర్‌లోని చీకటి, నిర్జీవ ప్రదేశాలు, నిత్యమైన యుద్ధాలు, చెడును ఎదుర్కొనే చిన్న మనిషి ధైర్యం వంటి అంశాలన్నీ స్వీయ అనుభవాలే. యు ద్ధపు నిరాశను ఆయన సాహిత్యంలో నేరుగా ప్రతిబింబించకుండా, దానిని ఒక పెద్ద పౌరాణిక యుద్ధ గాథగా పరివర్తన చేసి, తాను చెప్పదలచుకున్న అంశాలను పరోక్షంగా పేర్కొన్నాడు. టోల్కీన్ కేవలం కథలు రాయలేదు.. భాషలకే ప్రాణం పోశాడు. అతను క్వెన్యా (Quenya), సిందరిన్ (Sindarin), బ్లాక్ స్పీచ్ (black speech) వంటి అనేక కల్పిత భాషలను రూపొందించాడు. భాషల సృష్టి ఆయనకు హాబీ అనుకుంటే పొరపాటే. అది ఆయన తత్వం. ఆయన కు కథలు భాషలకు అనుబంధమై పుట్టాయి. 'భాషల పుట్టు కే సాహిత్యానికి పునాది. భాషల ద్వారానే కథలను సృష్టించగలుగుతాం' అంటాడు టోల్కీన్. అంటే, మొదట భాష పు డుతుంది, ఆ తర్వాత ఆ భాషకు చెందిన ప్రజలు, వారి పురాణాలు, వారి చరిత్ర పుడతాయి. ఇది సాహిత్య ప్రపంచంలో అరుదైన పద్ధతి. ఈ కారణంగానే అతను సృష్టించిన 'మిడిల్ ఎర్త్' అత్యంత వాస్తవమైనదిగా అనిపిస్తుంది. అక్కడ అతను వినూత్నమైన సంస్కృతిని, వంశవృక్షాలను, భాషా వైవిధ్యాలను వివరిస్తాడు. తద్వారా, పాఠకులు అక్కడ ఒక కొత్త లోకం ఉందనే అభిప్రాయం బలంగా ఏర్పడుతుంది. టోల్కీన్ రచనా నైపుణ్యం కూడా ప్రేక్షకులు అంతగా ప్రభావితం కావడానికి మరో కారణం. అతను రాసిన మరో పుస్తకం 'ది హాబిట్' (1937). దీనిని బాలసాహిత్యంగా పేర్కోవాలి. కానీ, ఈ పుస్తకమే ఫాంటసీ సాహిత్యానికి బలమైన పునాదులు వేసింది. బిల్బో బ్యాగిన్స్ అనే చిన్న హాబిట్ ఒక సాహసగాథలో చిక్కుకోవడం, చివరికి అందులో నుంచి బయటపడడం ఈ పుస్తకం సారాంశం. ధైర్యం, మాయ, దురాశ, విశ్వాసం వంటి భావాల చుట్టూ కథ తిరుగుతుంది. మూడు భాగాలుగా వచ్చిన 'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్' (1954–55) (ఫాంటసీ సాహిత్యంలో అపూర్వమైన క్లాసిక్‌గా నిలుస్తుంది. చిన్న ఫ్రోడో బ్యాగిన్స్ ఒక మాయా ఉంగరా న్ని నాశనం చేయడానికి చేసిన యాత్ర, స్నేహం, త్యాగం, చెడు శక్తులపై పోరాటం వంటి ఉద్వేగభరితమైన అంశాలు, మలుపులు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. టోల్కీన్ మరణానంతరం ప్రచురితమైన 'ది వంటి అనేకానేక మలుపులు తిరుగుతుంది. గడచిన చరిత్రనే చెప్పున్నాడేమో అని పాఠకులను భ్రమింప చేసే ఈ పుస్తకం కూడా ఒక క్లాసిక్‌గానే సాహితీ లోకంలో నిలిచిపోతుంది. టోల్కీన్ ఒక కేథలిక్ క్రైస్తవుడు. కానీ ఆయన సాహిత్యం నేరుగా మత బోధనలతో ముడిపడలేదు. ఆయన సృష్టించిన విశ్వం మతరహితమైనది. అతని నవలల్లో మంచి ఎప్పుడూ చెడుతో పోరాడుతునే ఉంటుంది. చివరికి గెలుస్తుంది. ఈ క్రమంలోనే త్యాగం, వినయం, స్నేహం, ఆశ వంటి అనేక భావోద్వేగాలతో సమ్మిళితమవుతుంది. ఆ పుస్తకాల్లో కీలక పాత్రలన్నీ ప్రలోభాలపై విజయం సాధిస్తాయి. మానవత్వాన్ని ప్రదర్శిస్తాయి. చెడు ను అన్ని రకాలుగానూ వ్యతిరేకిస్తాయి. ఒక రకంగా టోల్కీ న్ రచనలు పాఠకులను నైతిక విలువల మార్గంలో నడిపిస్తాయి. టోల్కీన్ వారసత్వం పుస్తకాలకే పరిమితం కాదు. పీటర్ జాక్సన్ దర్శకత్వంలో వచ్చిన 'ది లార్డ్ ఆఫ్ ది రిం గ్స్', 'ది హాబిట్' వంటి చిత్రమాలికలు ఆయన విశ్వాన్ని కొత్త తరాలకు పరిచయం చేశాయి. 'మిడిల్ ఎర్త్' ఇప్పుడు ఒక సాంస్కృతిక చిహ్నంగా వెలుగొందుతున్నది.

# ఉర్దూ సాహిత్య కాంతి కిరణం జహీర్



సయ్యద్ సజ్జాద్ జహీర్... భారతపాకిస్థానీ ఉర్దూ రాజకీయ రచయిత. మేధావి. విప్లవకారుడు. నాయకుడు. ఉర్దూ సాహిత్యంలో ఉద్యమ కిరణంగా విశిష్టస్థానం సంపాదించాడు. బాల్యం, విద్యసజ్జాద్ జహీర్ 1905 నవంబర్ 5న లక్నోలో జన్మించాడు. ఆయన తండ్రి సిర్ వజీర్ హసన్, అలహాబాద్ హైకోర్టులో న్యాయమూర్తి. జహీర్ లక్నో విశ్వవిద్యాలయం నుంచి బిఎ పట్టా పొందిన తర్వాత, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం కొనసాగించాడు. ఆ సమయంలోనే క్షయవ్యాధితో బాధపడ్డాడు. స్విట్జర్లాండ్‌లో చికిత్స పొందాడు. తిరిగి ఇంగ్లాండ్ వచ్చిన తర్వాత, కమ్యూనిస్టు నాయకుడు షాపుర్జీ సక్లత్వాలా ప్రభావంతో మార్క్సిస్టు పంథాను అనుసరించడం మొదలుపెట్టాడు. 1930లో, 'భారత్' అనే పత్రికను ఇంగ్లాండ్‌లో ప్రారంభించాడు. ఆక్స్‌ఫర్డ్ నుంచి 1931లో గ్రాడ్యుయేట్ పూర్తిచేశాడు. సమకాలీన మేధావులతో పరిచయం ఆయన వ్యక్తిత్వాన్ని మరింత ప్రభావితం చేసింది. ప్రజాప్రగతిశీల సంఘ ఉద్యమాన్ని 1932లో మొదలుపెట్టాడు. ఆ సమయనే 'అంగారే' అనే కథల సంకలనం ప్రచురించాడు. ఇది మతపరమైన వర్గాల్లో సంచలనం చర్చనీయాంశమైంది. ఆ పుస్తకాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. అనంతరం కమ్యూనిస్ట్ పార్టీ మద్దతుతో 1936లో లక్నో వేదికగా 'ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్' స్థాపించి, మొదటి సమావేశం నిర్వహించాడు. తన జీవిత కాలంలో 'చింగారి' మొదలైన పత్రికలు ప్రచురించడంతోపాటు, మార్క్సిస్టు ఆచార్యునిగా పలు ఉద్యమాలకు తోడ్పాటునిచ్చాడు. ప్రముఖ ఉర్దూ రచయితలు ఈ ఉద్యమంలో భాగమయ్యాడు. 1936లో, ఉత్తరప్రదేశ్ కమ్యూనిస్ట్ పార్టీ కార్యదర్శిగా, కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించాడు. మూడేళ్ల తర్వాత, 1939లో ఆ శాఖ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించాడు. రెండవ ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకించినందుకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాడు. 1942లో జైలు నుంచి విడుదలయ్యాక 'క్వామీ జంగ్', 'నయా జమానా' పత్రికలకు సంపాదకునిగా పనిచేశాడు ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఐపిటిఎ), ఆల్ ఇండియా కిసాన్ సభ ఏర్పాటులోనూ ఆయన కీలక పాత్ర పోషించాడు. దేశ విభజన తర్వాత, పాకిస్తాన్ వెళ్లాడు. అక్కడ 'కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ పాకిస్తాన్'ను ప్రారంభించాడు. 1951లో, 'రావల్పిండి కుట్ర కేసు'లో ఫైజ్ అహ్మద్ ఫైజ్‌తో పాటు అరెస్టు అయ్యాడు. నాలుగేళ్ల జైలు జీవితం తర్వాత, విడుదలై, జవహర్‌లాల్ నెహ్రూ ద్వారా భారత పౌరసత్వం పొందాడు. తిరిగి భారత్ వచ్చి ప్రజా, సాహిత్య ఉద్యమాలలో భాగమయ్యారు. జహీర్ రచనలు సామాజిక సమస్యలను, మేధావి భావజాలాన్ని ప్రతిబింబిస్తాయి. 'లండన్ కి ఏక్ రాత్', 'సుకూష్ఏజిందాన్', 'రోష్నా యి', 'జిక్రెహాఫిజ్', 'పిఘ్లా నీలమ్' తదితర ప్రముఖ రచనలు చేశాడు. ఆయన చాలా పత్రికలకు, ప్రథమ ఉర్దూ మార్క్సిస్ట్ పత్రిక 'చింగారి'కి సంపాదకునిగా పనిచేశాడు. ప్రచురణ, అనువాదం రంగంలో నిష్ణాతుడిగా పేరు సంపాదించాడు. ఆయన 1973 సెప్టెంబర్ 11న కజాఖ్‌స్తాన్‌లో సాహిత్య సమావేశానికి వెళ్లి, అక్కడే గుండెపోటుతో మరణించాడు. జహీర్ బహుప్రజాస్వామ్య సాహిత్యోద్యమ ఆద్యుల్లో ఒకడు. ఉర్దూ సాహిత్యంలో మార్క్సిస్ట్ ఆలోచనా విధానాలను ప్రవేశపెట్టిన ప్రముఖుడు. పలు ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న రచయిత, ఆయన తన రచనల ద్వారా భారత వాస్తవికత, సామాజిక సమస్యలు, ప్రజా సమస్యలను వెలికితీశాడు. ఆంగ్ల, ఉర్దూ, ఇతర యూరోపియన్ భాషల్లో సాహిత్యాన్ని చదవడం వల్ల ఏర్పడిన విశాల దృష్టి ఆయన రచనల్లో తొణికిసలాడుతుంది.



ఈ వారం కవితలు

## కార్వాన్ ప్రభాకర్‌కు జోహార్లు



జోహార్లు జోహార్లు కామ్రేడ్
వాయిల్ల ప్రభాకర్ జోహార్లు
ఉద్యమాల వందనాలు మీకు
మా కార్వాన్ ప్రభాకరా..

పేద ప్రజల
పక్షమందు
పోరు నడిపిన వీరుడా
ఎర్ర జెండా దారిలో
నడిచిన
కమ్యూనిస్టు యోధుడా


విద్యార్థి యువజన ఉద్యమాల
శ్రామిక జన హక్కుల పోరులోన
సమర శంఖమూదిన మా కామ్రేడ్
వాయిల్ల ప్రభాకరా వందనాలు మీకు

మైనార్టీ.. మెజార్టీ ముసుగులేసి
మత విద్వేషాలను రెచ్చగొట్టె
మతోన్మాదులపై పోరుజేసిన
వీరుడా
మా కామ్రేడ్ వాయిల్ల
ప్రభాకరా

జోహార్లు జోహార్లు
జోహార్లు
మా కమ్యూనిష్టు యోధుడా
జోహార్లు మీకు! మా వాయిల్ల
ప్రభాకరా జోహార్లు మీకు!

– బొమ్మగాని నాగభూషణం
9849622633

## కకావికలం



దేశమంతా విస్తారమైన వర్షాలతో
అంబరమంతా గంభీరం
నదీనదాలు వాగులు, వంకలు
పొంగి పొరలి అవని బీభత్సం

జమ్ము కాశ్మీర్ మన భూతల స్వర్గం
వరద బురదలతో జనం హస్తవ్యస్తం
వైష్ణవీ మాతచెంత
కొండ చెరియలు విరిగి పడి కల్లోలం
భక్తుల ప్రాణాలను హరించిన వరుణుడి వైనం

ఉత్తర తెలంగాణ జల ప్రళయం
వరదలతో అలుముకున్న విలయం
గ్రామాలనే చుట్టు ముట్టిన జల దిగ్బందం
హృదయ విదారకమైన వలపోతల విలాపం

పంటపొలాలు మునిగి అపార నష్టం
రైతుల గుండెలలో నీటి విస్ఫోటం
బీదా బిక్కీ జనుల ఆవాసాలు నేలమట్టం
విగత జీవుల బంధువుల అరణ్య రోదనం

గండ్లు పడిన రహదారులు సమూలం
నడి జలాశయములో చిక్కన కర్షక ఆక్రందనం
గురుకుల విద్యార్థుల దీన వదనం

ములుగుతూ, ముక్కుతూ వణుకుతున్న వృద్ధాప్యం
ఆర్థిక సాయానికై భాదిత ఎదిరి చూపులు
ప్రభుత పర్యవేక్షణ కై నిరీక్షణలు
సానుభూతి పవనాలకై ఎదురు తెన్నులు
ప్రకృతి వైపరీత్యానికి జనం బెంబేలు

నమిలకొండ నాగేశ్వర్ రావు
8688553470

## పోస్ట్ బాక్స్

ఒకప్పటి అందరి ఆత్మీయ నేస్తం
సమానత్వానికి అదో నిదర్శనం
బంధాల్ని చేస్తోంది బలోపేతం
పలు కబుర్లను చేతుల్లోకి చేర్చుతూ..
మా అందరి ఆత్మీయ మిత్రుడైంది !
ఉత్తరాలతో కడుపు నింపుకునే..
ఊరి పోస్ట్ బాక్స్ నేడు తుప్పుపట్టి..
నిరాదరణ ఊబిలోకి జారిపోయి..
గత వైభవం చరిత్రలో చేరిపోయి..
కొరియర్ వ్యాపార కోరల్లో చిక్కి పోయి..
డిజిటల్ కొరడా దెబ్బలు తుంటూ..
ఈమెయిల్స్ వరదలో కొట్టుకుపోతూ..
వాట్సప్ వాగుడు వైరస్ సోకి..
ఉత్తరాలు రాసే కళ మసకబారుతూ..
ఉత్తరాల రాకకు ఎదురు చూస్తూ..
పోస్టు డబ్బా కడుపు మాడిపోతూ..
ఒడువని దుఃఖాన్ని దిగమింగుకుని..
దీనంగా చూస్తోంది ఆ ఎర్ర డబ్బా !



మధుపాళీ

## భారీగా గుడుంబా ముడిసరుకు స్వాధీనం



ప్రజాపక్షం/దేవరకొండ : గుడుంబా తయారికీ ఉపయోగించే ముడిసరుకును తనిఖీలో భాగంగా దేవరకొండ ఎక్సైజ్ పోలీసులు పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. 6 వేల కిలోల నల్లబెల్లం, 200 బస్తాల పట్టికను తరలిస్తున్న డీసిఎంను కొండమల్లేపల్లి వద్ద శనివారం రాత్రి సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సి.ఐ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ ముడిసరుకును కర్ణాటక బీదర్ నుండి తీసుకొచ్చి దేవరకొండ డివిజన్‌లోని మారుమూల గ్రామాల్లో విక యించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

## ఎన్‌జి కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు

ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఉన్న ఖాళీ అధ్యాపక పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 2 సాయంత్రం 4గంటలలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవా లని, సెప్టెంబర్ 3 ఉదయం 10గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయాని వెల్లడించారు. తెలుగు 2, వాణిజ్యశాస్త్రం 2, జంతుశాస్త్రం, ఆర్థిక శాస్త్రం ఒకటి, కంప్యూటర్ సైన్స్ 2 ఖాళీలున్నట్లు తెలిపారు.ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. డెమో, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఓసి, బీసీలు సంబంధిత పోస్ట్ గ్రాడ్యుయేషన్ సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులు, ఎస్‌సి,ఎస్‌టి అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులు కల్గి ఉండాలని అన్నారు. పిహెచ్‌డి, నెట్, సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు.



## బిసిలకు 42శాతం రిజర్వేషన్లు హర్షణీయం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : పంచాయితీ రాజ్ చట్టం 2018 ని సవరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, తెలంగాణ రైతు కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసి బిల్లు ఆమోదానికి అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెడితే బిజెపి, బిఆర్‌ఎస్‌లు అడ్డుపడ్డ విషయం ప్రజలందరూ చూశారన్నారు. బిసిల పట్ల ఆ పార్టీలకు ఎంత ప్రేమ ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. బిసిల ఓటు బ్యాంక్‌తో అధికారంలోకి వచ్చిన నాయకులు బిసి బిల్లును ఎలాగైన అడ్డుకునేందుకు కుట్రలు, కుతంత్రాలు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ, పెద్దగట్టు దేవస్థాన చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, మాజీ కౌన్సిలర్లు గండూరి రమేష్, అనంతుల యాదగిరి, వేములకొండ పద్మ, నాయకులు రుద్రంగి రవి, వాసు, ఊట్కూరి దివ్య పాల్గొన్నారు.

## వర్గీకరణతో మాలలకు అన్యాయం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ చేయడంతో మాలలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని మాల సంఘాల జేఏసీ చైర్మన్ గోల్డ్ సైదులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలలు భుజాలపై వేసుకొని కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.ఎస్‌సి వర్గీకరణ చేసిన రాష్ట్ర ప్రభుత్వం రోస్టర్ పాయింట్ విధానంలో తక్కువ ఇచ్చి లాస్ట్ కు ఇవ్వడం వల్ల విద్యా ఉద్యోగాలకు దూరమైపోయిన పరిస్థితులు కనబడుతున్నాయన్నా రు,. దీనికి చట్టసభల్లో మాల ప్రతినిధులు కచ్చితంగా మాట్లాడి మాలలకు న్యాయం చేయవలసిన బాధ్యత వారిపై ఉన్నదన్నా రు.మాదిగ సోదరులు చట్టసభల్లో ఉన్నప్పుడు వారి మార్పును చూపిస్తూ వర్గీకరణ గురించి కొట్లాడిన సందర్భాలు చాలా ఉన్నాయని మరి మాలలకు ఎందుకు ఆ సోయి రావడం లేదనేది అర్థం కావడం లేదని మాదిగ సోదరులు చట్టసభల్లో మాట్లాడి వాళ్ళ హక్కులను కావాలని కొట్లాడినప్పుడు మాల సోదరులకు సోయి ఎందుకు వస్తలేదన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థలలో మాలలు కాంగ్రెస్ పార్టీకి గట్టి బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అద్దంకి రవి,కూన యాదయ్య రచయిత గాయకులు పాల్గొన్నారు.

## కుమ్మర సంఘం పట్టణ,మండల నూతన కమిటీల ఎన్నిక



ప్రజాపక్షం/నార్కట్ పల్లి: ప్రభుత్వం నుండి కుమ్మరలకు రావలసిన హక్కులను సాధించుట కొరకు ఐక్యత కావాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర కార్యదర్శి రాధారపు భిక్షపతి అన్నారు.తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నార్కట్ పల్లి పట్టణ శాఖ,మండల శాఖల సమావేశం జివిఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుమ్మరులు సంఘం పటిష్టత చాలా అవసరమని అన్నారు. అనంతరం పట్టణ,మండల శాఖ ఎన్నికలు నిర్వహించగా పట్టణ అధ్యక్షులుగా రాధారపు దేవయ్య,ప్రధాన కార్యదర్శిగా మిడిదొడ్డి నాగరాజు, పదిమంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా నిమ్మన గోటి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా మాసంపల్లి సైదులు మరియు 15 మంది కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధరి వెంకటేశ్వర్లు, జిల్లా గౌరవ సలహాదారులు నిమ్మన గోటి లింగయ్య, జిల్లా నాయకులు తాడూరు చంద్రం, కంభంపాటి సతీష్,రాధారపు రమేష్, బొడ్డుపల్లి సైదులు, మండలం లోని కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాములు నాయక్ మృతి బాధాకరం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహ్ రెడ్డి



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ పట్టణానికి చెందిన సీనియర్ వైద్యులు నేనావత్ రాములు నాయక్ మృతి అత్యంత బాధాకరం, అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాములు నాయక్ దేవరకొండ ప్రాంత ప్రజలకు అందించిన వైద్యసేవలు మరువలేనివని, ప్రజల పట్ల చూపిన సేవా భావం, మానవత్వం ఎప్పటికి గుర్తుండిపోతాయి అని ఆయన అన్నారు. వారి అకాల మరణం తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహ్ రెడ్డి అన్నారు. ఆదివారం నాడు సాయి వెంకటేశ్వర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో రాములు నాయక్ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు వారితో పాటు నివాళులర్పించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, నాయకులు ఏషామోని మల్లేష్, లింగంపల్లి వెంకటయ్య, వి.బక్కయ్య ఉన్నారు.



## సాగర్‌లో 'సండే' సందడి...

ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతూ ఉండడం అందులో గణేష్ నిమజ్జనం కూడా తోడవడంతో ఆదివారం సాగర్ అందాలను తిలకించడానికి వచ్చిన పర్యాటకులతో సాగర్ పరిసర ప్రాంతాలు పర్యాటకులతో సందడి చేసింది. దీనితో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు పర్యాటకులతో అత్యంత రద్దీగా మారటం గమనార్హం. సెలవు రోజు వాహనాల రద్దీ పెరగడంతో స్థానికంగా ఉన్న లాంచీ స్టేషన్, ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం, కొత్త , పాత వంతెనల వద్ద పర్యటకులతో కిక్కిరిసిపోయింది.పర్యాటకుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ టూరిజం శాఖ నాగార్జున కొండకు లాంచీలను మూడు ట్రిప్పులు నడిపారు. ఇంకా పర్యాటకుల రద్దీ తగ్గకపోవడంతో పర్యాటకుల అభ్యర్థల మేరకు రిజర్వాయర్ లో రెండు జాలి ట్రిప్పులను నడిపారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లిన పర్యాటకులు అక్కడి మ్యూజియంలోని విశేషాలు, బుద్ధుని అవశేషాలు, మాన్యుమెంట్స్ తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడి నుంచి సాయంత్రం వేళలో ఎత్తిపోతల, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శించారు.

## 'స్ప్రెడ్ ఇండియా' పేరిట పటేల్ శ్రీధర్ రెడ్డి సేవలు మరువలేనివి



ప్రజాపక్షం/సూర్యాపేట : స్ప్రెడ్ ఇండియా ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా నిరక్షరాస్యత నిర్మూలనలో భాగంగా గత 25 సంవత్సరాలుగా విశేష సేవలు చేసిన సంస్థ చైర్మన్ పటేల్ శ్రీధర్ రెడ్డికి గౌరవ పురస్కారం లభించండం అభినందనీయమని లోక కవి, రచయిత అందెశ్రీ, తెలంగాణ పర్యాటక అభివృద్ధి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభకు వారు ముఖ్య అతిదులుగా హాజరై మాట్లాడారు. సూర్యాపేట నియోజకవర్గంలో 44 పాఠశాలల్లో 10వ తరగతి ఫలితాలలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఏడు సంవత్సరాల పాటు రూ.2వేల నుండి రూ.3వేల వరకు స్కాలర్‌షిప్‌లు అందించి వారి ఉన్నత చదువులకు బంగారుబాటు వేయడం హర్షణీయమన్నారు. అలాగే పాఠశాలలకు కంప్యూటర్లు, గ్రీన్‌బోర్డులు, డెస్కుబెంచీలు, సైన్స్ ల్యాబరేటరీ, గ్రంథాలయానికి పుస్తకాలు, కళావేదికలు, వంటగది, టాయిలెట్స్ చేయడంలాంటి ఎన్నో మహోన్నత కార్యక్రమాలు చేపట్టిన పటేల్ శ్రీధర్ రెడ్డి అందరికి ఆదర్శమన్నారు. పుట్టిన గడ్డను మర్చిపోకుండా ఆమెరికాలో ఉంటూ కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థలో ఉండడాన్ని గమనించి రూ.45లక్షల వ్యయంతో నిర్మించి తన దాతృత్వాన్ని చాటుకున్న గొప్ప మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పెద్దిరెడ్డి గణేష్, గండూరి శంకర్, డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్, తోట శ్యాంప్రసాద్, గొల్లమూడి అనీష్‌బాబు, చిగుళ్ల సాయిరెడ్డి, పటేల్ నర్సింహారెడ్డి, ఇరిగి కోటేశ్వరి పాల్గొన్నారు.

## శోభాయాత్ర, నిమజ్జనానికి పటిష్ఠ బందోబస్తు

జిల్లా ఎస్‌పి కె నరసింహ



ప్రజాపక్షం/సూర్యాపేట : 5వ రోజు తరువాత వినాయక నిమర్జనాల కోసం మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో వినాయక శోభాయాత్ర, నిమర్జనం కోసం పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. ఆదివారం జిల్లాలోని పోలీసు అధికారులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు విలేకరుల సమావేశంలో తెలిపారు. పోలీసులు నిమర్జనాలు ఎక్కడ చేయాలనేది నిర్వాహకులకు ముందుగా అవగాహన కల్పించామన్నారు. స్థానిక రెవెన్యూ పంచాయితీరాజ్ ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి నిమర్జనం ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. త్రాగునీటి కోసం వినియోగించే వనరుల్లో నిమర్జనాలు చేయవద్దని ఉత్సవ కమిటిలకు తెలిపారు. శోభాయాత్రలు నిర్వహిస్తూ దూరప్రాంతాలకు వెళ్ళకుండా స్థానికంగా ఉన్న చెరువులు, కుంటల నందు నిమర్జనాలు చేసుకోవడం మంచిదన్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, పాలేరు, సాగర్ కెనాల్‌ల నందు నిమర్జనాలకు అనుమతిలేదన్నారు. అధిక వర్షాల వల్ల చెరువులు, కుంటలు, వాగులు నిండి ఉన్నాయని లోతైన నీరు ఉన్నదని లోపలికి వెళ్ళకుండా ఒడ్డున ఉండి నిమర్జనాలు చేసుకోవాలని సూచించారు. ప్రతి నిమర్జన స్థలాల్లో పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఎవరైన మహిళలపట్ల అసభ్యకర ప్రవర్తన చోటుచేసుకున్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ చేయనున్నట్లు చెప్పారు. మద్యం సేవించి హంగామా చేసే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ తీగలతో ప్రమాదాలు జరగకుండా ఎలక్ట్రిసిటి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ర్యాలీ మార్గాన్ని పరిశీలించుకోవాలని, అవసరమైతే విద్యుత్ సరఫరా నిలిపివేసే చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

## గుడిసెలో పుట్టిన బిడ్డగా పింఛన్‌దారుల పక్షాన పోరాటం

ఈనెల 3న హైదరాబాద్‌లో జరిగే మహాగర్జనకు తరలిరావాలి: మంద కృష్ణ మాదిగ పిలుపు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంగ్లాలో పుట్టి వచ్చిన నాయకుడు,ప్రతిపక్ష నేత కేసిఆర్ గడీల నుండి పుట్టి వచ్చిన నాయకుడు,అందుకే పెన్షన్ దారుల పక్షాన వాళ్లు నిలబడడం లేదు తాను గుడిసెలో పుట్టిన బిడ్డగా పెన్షన్ దారుల పక్షాన పోరాటం చేయడానికి ముందుకు వచ్చానని పెన్షన్ దారుల ఆశాజ్యోతి,పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ తెలిపారు. వికలాంగుల పెన్షన్ రూ 6 వేలకు పెంచాలని వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలతో పాటు మొత్తం చేయూత పెన్షన్లన్నీ నాలుగువేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ పట్టణంలోని ఎస్‌బిఆర్ ఫంక్షన్ హాల్ లో చేయూత పెన్షన్ దార్ల సన్నాహక సభను నిర్వహించడం జరిగింది.ఈ సభకు విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కొత్త వెంకన్న యాదవ్ అధ్యక్షత వహించారు.ఈ సభలో మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూత పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి పదవి చేపట్టి 20 నెలలు గడుస్తున్న ఒక్క రూపాయి పెన్షన్ కూడా పెన్షన్ పెంచకూండ దారుణంగా మోసం చేయడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి పెన్షన్ పెంచకుండా ద్రోహం చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు కనీసం మాట్లాడకుండా పెన్షన్ దారులను మోసం చేస్తున్నాయని అన్నారు.సెప్టెంబర్ 3న హైదరాబాద్ లో జరిగే చేయూత పెన్షన్ దారుల మహాగర్జనకు ప్రతి గ్రామం నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ జాతీయ నేత గద్దం కాశీం,జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుముల జలంధర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెరిక శ్రీనివాస్,ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్,ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ, దాసరి లక్ష్మమ్మ రెడ్డి మాస్ ఇంద్ర చౌదరి, అహ్మద్ ఖాన్, గుద్దేటి సైదులు పాల్గొన్నారు.



## జీవన తాత్వికత తెలిసిన కవి మునాసు వెంకట్

'దాపు' పుస్తకావిష్కరణలో ప్రజాకవి ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ప్రకృతితో మమేకమై జీవన తాత్వికతను తన కవిత్వంలో నేర్పుగా ఆవిష్కరించగల కవి మునాసు వెంకట్ అని ప్రజా కవి ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. సృజన సాహితీ ఆధ్వర్యంలో ఆదివా రం గుత్తా సుఖేందర్ రెడ్డి నివాసంలో నల్లగొండకు చెందిన ప్రముఖ కవి మునాసు వెంకట్ రచించిన దాపు కవితా సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న మాట్లాడుతూ అస్తిత్వ ఉద్యమాలలో దళిత బహుజన కవిత్వాన్ని సుసంపన్నం చేసిన కవుల్లో మునాసు వెంకట్ ముందు వరుసలో ఉంటాన్నారని అభిప్రాయపడ్డారు. దాపు కవిత్వ పుస్తకాన్ని విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ఆవిష్కరించారు. డాక్టర్ బెల్లి యాదయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ విమర్శకులు అంబటి సురేంద్ర రాజు మాట్లాడుతూ అట్టడుగు వర్గ జీవితాలతో అంతర్జాతీయ స్థాయి కవిత్వం రాసిన వారు మునాసు వెంకట్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కవి గాయక సిద్ధార్థ, బైరెడ్డి కృష్ణారెడ్డి, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య,భానుశ్రీ కొత్వాల్, పెరుమాళ్ళ ఆనంద్, అంబటి వెంకన్న, తుల శ్రీనివాస్, మేరెడ్డి యాదగిరి రెడ్డి, శీలం భద్రయ్య, బోధనం నర్సిరెడ్డి, పగడాల నాగేందర్, భూతం ముత్యాలు,డాక్టర్ సాగర్ల సత్తయ్య, కస్తూరి ప్రభాకర్ పాల్గొన్నారు

## ప్రతి గ్రామంలో గ్రంథాలయం



ప్రజాపక్షం/చందంపేట: నల్లగొండ జిల్లా చందంపేట మండలం ప్రతి గ్రామంలో గ్రంథాలయం అనేది ఉండాలి అని హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద ఆదివారం పోలేపల్లి గ్రామంలో నిర్వహించిన మన ఊరు మన గ్రంథాలయంను ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చదువు అనేది సమాజంలో మనిషికి ఒక భాగం, ముఖ్యంగా గ్రామాల నుండి పెద్ద పెద్ద చదువులు చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండి రాష్ట్రంలో ఉన్న గ్రామాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయడంలో భాగస్వాములు కావాలని, గ్రంథాలయాల ఏర్పాటు వలన పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు ఇక్కడే దొరుకుతాయని, తద్వారా ఉద్యోగాలు సాధించవచ్చు అని అన్నారు. రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, హైకోర్టు బార్‌అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ జగన్, హైకోర్టు జి.పి వెంకటరెడ్డి, అర్జున్ కుమార్, కిరణ్ కుమార్, కొమ్ము ప్రవీణ్, హైకోర్టు ఏజిపి వేణుగోపాల్, జడ్జి అనిత పాల్గొన్నారు.

## ఉచితంగా కళ్ళ అద్దాల పంపిణీ

ప్రజాపక్షం/చండూరు: మండల పరిధిలోని ఇడికూడ గ్రామానికి చెందిన పలువురు కంచిచూపుతో బాధపడుతున్న వారు ఇటీవల బంగారిగడ్డలో ఎంఎల్‌ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యుల సౌజన్యంతో నిర్వహించిన ఉచితంగా కంటి వైద్య శిబిరంలో కంటిచూపు సమస్య ఉన్న వారికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోడు అవసరం ఉన్న వారికి కళ్లజోడు అద్దాలను పంపగా గ్రామ కాంగ్రేస్ నాయకులు కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కడారి లక్ష్మ ణ్ యాదవ్, మహమ్మద్ ఘని, పంతంగి వీరయ్య, పంతంగి గిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కోతుల గుంపులతో బెంబేలెత్తుతున్న ప్రజలు



ప్రజాపక్షం/నందికొండ: మున్సిపాలిటీలో కోతుల సంచారం విపరీతంగా పెరిగిపోయింది. ఇంటి నుంచి కాలు బయటపెడితే ఎక్కడ రక్కి కరుస్తాయో తెలియని పరిస్థితి నెలకొన్నది. కోతులు, దాడిలో గాయపడి ప్రభుత్వాసుపత్రులకు చికిత్స కోసం వస్తున్న కేసులు అనేకం నమోదవుతున్నాయి. ఏడాది కాలంలో కోతుల దాడిలో గాయపడినవారి సంఖ్య చూస్తే గుండెలు గుబేలుమంటాయి. ఏడాది కాలంలో కొన్ని వందల సంఖ్యలో తీవ్ర గాయాల పాలై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న వారు కొందరైతే బాధితుల సంఖ్య చాలా వరకు ఉంది.కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో ఆదమరచి తలుపులు తీసి ఉన్నాయంటే చాలు ఇంట్లోదూరి సామగ్రి చిందరవందర చేసి చేతికందినవి తీసుకుని పరారవుతున్నాయి. రోడ్డుపైన చేతిలో సంచి, కవర్‌తో కనిపించినవారి పనయినట్లే మీదపడి గాయపర్చి చేతి సంచి ని ఎత్తుకెళ్తాయి. చిన్నపిల్లలు పాఠశాలకు వెళ్లే సమయంలో కోతులు దారిలో కాపు కాచి లంచ్ బ్యాగులను ఎత్తుకెళ్లటం పుస్తకాలతో ఉన్న స్కూల్ బ్యాగ్ ను చించి వేయడం గమనార్హం దీనితో పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూలుకు పంపించాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు.కోతుల దాడితో కిందపడి గాయపడిన సంఘటనలు స్థానికంగా తరుచూ జరుగుతున్నాయి. కొన్ని నెలలుగా కోతుల సమస్య తీవ్రంగా ఉందని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా కనీ సం పట్టించుకోవడం లేదన్న విమర్శలువస్తున్నాయి.ఇప్పటికైనా స్థానిక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కోతుల బెడద నుంచి కాపాడటానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు తమ గోడును వెళ్ళబోస్తున్నారు.

## కప్పల నరసింహ మృతి సిపిఐకి తీరని లోటు

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం: సిపిఐ నాయకుడు కప్పల నరసింహ మృతి పార్టీకి తీరని లోటు అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం లు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల జనగాం గ్రామ సిపిఐ శాఖ కార్యదర్శి కప్పల నరసింహ అకస్మాత్తుగా ఆదివారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న పల్లా వెంకట్ రెడ్డి, నెల్లికంటి సత్యం లు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరసింహ అనారోగ్యంతో ఉన్నా పార్టీ కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ ప్రజాసంఘాల నాయకులను సమన్వయపరుస్తూ గ్రామస్థాయిలో తనదైన శైలిలో ఉద్యమాలు నిర్వహించేవారని గుర్తు చేశారు. పార్టీకి ఆయన అందించిన సేవలు మరువలేనివి అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. పార్టీ ఎల్లప్పుడూ నరసింహ కుటుంబానికి అండగా ఉంటదని అన్నారు.సోమవారం జనగాం గ్రామంలో అంతిమ యాత్ర జరుగుతుందని ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా, సిపిఐ కమ్యూనిస్టు పార్టీ నాయకులు హాజరవుతారని సిపిఐ జనగాం శాఖ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య,సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, మండల సిపిఐ కార్యవర్గ సభ్యులు మంచాల జంగయ్య, మంచాల సైదులు, బైకని రాజు, నరేష్, వంశి, గీత పనివారల సంఘం నాయకులు, యువజన సంఘం నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. నరసింహ మరణం జనగాం శాఖకు సిపిఐ పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య అన్నారు.

## ఆలయానికి సిసి కెమెరాలు అందజేత

ప్రజాపక్షం/కొత్తపల్లి: మండల పరిధిలోని భూనీడ్ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో గతంలో తరుచుగా జరిగిన దొంగతనాలను గుర్తించలేకపోవడం వల్ల నిందితులను పట్టుకోవడం పోలీసులకు కష్టతరంగా మారింది. దాంతో నేరాల నియంత్రణకు దృష్టిలో పెట్టుకొని ఇక ముందు అలా జరగకుండా అదే గ్రామానికి చెందిన మానేంబాయి వెంకట్ రెడ్డి ఆలయ ప్రాంగణంలో అన్ని వైపుల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. సందర్భంగా యస్సై విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏవరైనా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే సాంఘిక, అవాంచనీయ చర్యల నియంత్రణకు చాలా సులభంగా ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో ప్రధాన రహదారుల కూడళ్ళలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టయితే నేరాలను నియంత్రించే అవకాశం సులభంగా ఉంటుందని యస్సై తెలిపారు. సీసీ కేమేరా ఏర్పాటు చేసినా మానేంబాయి వెంకట్‌రెడ్డికి ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, యస్సై విజయ్‌కుమార్ ఆయనకు అభినందనలు తెలిపారు.

## కలిసికట్టుగా కృషి చేయాలి

ప్రజాపక్షం/నర్వ : మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నర్వ మండల బీజేపీ అధ్యక్షులు అజిత్ సింహారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థుల ఇన్‌చార్జీల నమోదు, భవిష్యత్తు ఎన్నికల జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి సీనియర్ నాయకులు మండల స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సభలో బిజెపి నాయకులు మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉందే కోడ్ గ్రామ వార్డు మెంబర్ కృష్ణయ్య తో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. జిల్లా కౌన్సిల్ సభ్యురాలు లలితమ్మ, జిల్లా నాయకులు కురువ సత్యం, గ్రామ మాజీ సర్పంచ్ డాక్టర్. వెంకటేశ్వర్ రావు, సంధ్య ఆంజనేయులు, ఉందే కోడ్ సర్పంచ్ జగన్నాథం, మాజీ ఎంపీటీసీ నీరజ్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, నర్వ మండల ప్రధాన కార్యదర్శి విజయరామ్, మండల కోశాధికారి రాంపురం యాదవ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి రాంపురం నరసింహులు, హోటల్ హనుమంత్ రెడ్డి, రామ్ రెడ్డి,సాకలి బొజ్జన్న పాల్గొన్నారు.



## పేకాట స్థావరంపై దాడి

ప్రజాపక్షం/కృష్ణ : ఆదివారం కృష్ణ మండల కేంద్రంలోని చేగుంట గ్రామ శివారులో విశ్వనాథ్ పాటిల్ వ్యవసాయ భూమిలో తెలుగు వెంకటేష్, విజయ్ కుమార్, షేక్ అహ్మద్, పిరంగి తిప్పన్నా, శివప్పరాయచూరు వ్యక్తులు పేకాట ఆడుతుండగా కృష్ణ ఎస్సై, సిబ్బంది కలిసి దాడి చేసి వారి నుండి పేక ముక్కలు, రూ.14,200 స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నవీద్ తెలిపారు.

## నెరవేరిన ఎనిమిది గ్రామాల ప్రజల కల



ప్రజాపక్షం/బిజినేపల్లి : కొన్ని దశాబ్దాలుగా ఎదురుచూస్తూ ఉన్న లింగసానిపల్లి బ్రిడ్జిని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ దృష్టికి తీసుకుపోవడంతో తక్షణమే రూ.3కోట్ల 50లక్షలవ్యయంతో నిర్మించడంతో లింగసానిపల్లి, వసంతాపూర్, కుమ్మెర, తుమ్మల్‌సూగుర్‌లాంటి గ్రామాల సౌకర్యార్థం బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలు నేడు ఆనందంతో మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి తాడూరు, బిజినేపల్లి మాజీసర్పంచులు, ఎంపిటిసిలు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా మండల బిజెపి నాయకులు పులేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు వస్తుంటాయి పోతుంటాయికాని చేసే పనులు మాత్రం శాశ్వతంగా చేసినవారు చేసినవారి యొక్క పేరుమాత్రం ఎప్పటికి నిలిచి ఉంటుందన్నారు. అదేవిధంగా మాజీ ఎంపిపి పుప్పాలశ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మాటలుకాదు చేతలు ముఖ్యమని నిరూపించిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అని ఈసందర్భంగా రైతులకు, విద్యార్థులు, ప్రజలకు తెలియజేశారు.ఈబ్రిడ్జి నిర్మాణంతో దశాబ్దాలుగా ఎదురుచూసిన ఈబ్రిడ్జి మాగ్రామాలకు ఊపిరిపోసిందన్నారు.

## ఆర్థికసాయం అందజేత



ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ : కల్వకుర్తి మండలపరిధిలోని తాండ్ర గ్రామానికి చెందిన లస్కర్ శ్రీను రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో అతనితో కలిసి పదోతరగతి వరకు విద్యనభ్యసించిన స్నేహితులు ఆదివారం మృతుని కుటుంబ సభ్యులకు రూ.60వేల ఆర్థికసాయం అందజేశారు. లస్కర్ శ్రీను రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో అతని ఇద్దరు కుమార్తెల పేర్లపై రూ.30వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం జరిగిందని తెలిపారు. వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బండిసుదర్శన్, రవి, జూనియర్ అసిస్టెంట్ రాజు, గంగాపురం రాజు, శేఖర్, రమణమ్మ, నాజియా పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



ప్రజాపక్షం/కల్వకుర్తి : మండలంలోని జిల్లెల గ్రామానికి చెందిన నాపరాములమ్మ, చిక్కండపద్మ అనారోగ్యంతో మరణించారు. ఈవిషయం జిల్లెల గ్రామ బిఆర్ఎస్‌పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టుచైర్మన్, బిఆర్ఎస్‌పార్టీ రాష్ట్రనాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తక్షణ ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు ఎముక జంగయ్య, మాజీ ఉపసర్పంచ్, గౌడసంఘం అధ్యక్షుడు పందుగౌడ్, మాజీ వార్డు మెంబర్ ఆంజనేయులు, బిఆర్ఎస్‌పార్టీ సీనియర్ నాయకులు ముత్యాలరమేష్, స్కూల్ కమిటీ మాజీచైర్మన్ ఆనంద్, నరేష్, విష్ణు, మల్లయ్య, వెంకటయ్య, ఆంజనేయులు, యాదయ్య, ఈదమయ్య పాల్గొన్నారు.

## మంటప నిర్వాహకులు భద్రతాపరమైన సూచనలు పాటించాలి

ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి



ప్రజాపక్షం/మక్తల్ : మక్తల్ మండల కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజల భద్రత దృష్ట్యా పోలీసులు విగ్రహాల వద్ద పాయింట్ బుక్స్‌ను తనిఖీ చేశారు. మండప నిర్వాహకులు ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, లైటింగ్, అగ్నిమాపక పరికరాలు, క్రమబద్ధమైన క్యూలైన్ సౌకర్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ... గణేష్ మండప నిర్వాహకులు మంటపం వద్ద తప్పనిసరిగా ఉండాలని, పాయింట్ బుక్‌లో ప్రతి రోజూ విధులు నిర్వహించే సిబ్బంది వివరాలు నమోదు చేయాలని, పోలీసులు తనిఖీ కి వచ్చినప్పుడు సహకరించాలని, ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ తీసుకోవాలని, కరెంట్ వైరుతో జాగ్రత్తగా ఉండాలని, భక్తులు దర్శనానికి వచ్చే సమయంలో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, డీజేలు వాడరాదని, రాత్రి 10 తర్వాత సౌండ్ బాక్స్‌లు బంద్ చేయాలని, గణేష్ ఉత్సవాలను, శాంతియుతంగా నిర్వహించుకోవాలని, అత్యసవర సమయంలో డయల్ 100కి సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

# పల్లెబాట బాగుపడేనా?

పదేళ్లుగా ఎదురుచూపులే మిగిలాయి

రూ.10కోట్ల 30లక్షల నిధులు మంజూరైనా ఫలితంలేదు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : పల్లెల్లో ఎన్నికలపండుగ వస్తున్న పట్నంనుంచి పల్లెబాట బాగుపడలేదని నల్లవెల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పలుమార్లు అధికారులకు తమ ఇబ్బందులు మొర పెట్టుకున్న కాంట్రాక్టర్ కమిటి కాలేదని కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. నందివడ్డెమాన్ నల్లవెల్లి గ్రామంనుండి నిత్యం పాడి, కూరగాయల సాగు రైతులు, ఇతర పనులు చేసేవారు నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి నిత్యం వచ్చి వెళుతూ ఉంటారు. 15నిమిషాల్లో గమ్యం చేరుకునే దూరం ఉన్న రోడ్డు సరిగ్గాలేని కారణంగా అరగంట ఆలస్యం అవుతుందని వాపోతున్నారు. 10సంవత్సరాలకుపైగా ఈ రోడ్డు బాగు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న ఫలితంలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోడ్డుకై ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి చొరవతీసుకొని రూ.10కోట్ల 30లక్షల నిధులు విడుదల చేసి సంవత్సరం అవుతున్న అధికారులు టెండర్లువేసి నిర్మాణం చేపట్టడంలో అలసత్వం వహిస్తున్నారని నల్లవెల్లి, నందివడ్డెమాన్, అల్లిపూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె ఎన్నికలురానున్న తరుణంలో ఇప్పటికైనా నాయకులు దృష్టిసారించి రోడ్డువేయాలని డిమాండ్ చేశారు.

# యూరియా లీల.. రైతన్న గోల



మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి

ప్రజాపక్షం/మక్తల్ : యూరియా కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులపై మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తెల్లవారుజామున 3 గంటలకే రైతులు యూరియా కోసం లైన్లలో నిలబడాల్సి వస్తుందని, 14 ఎకరాలున్న రైతుకు ఒక బస్తా యూరియా ఏ మాత్రం సరిపోతుందని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. తన నియోజకవర్గం అభివృద్ధి కోసమే ఇకపై నిరంతరంగా పోరాడుతానని, రాజకీయాలు పక్కన పెడుతున్నానని ఆయన తెలిపారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ యూరియా కొరతపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేంద్రంలో తమ ప్రభుత్వం లేదని సమాధానం ఇస్తున్నారని చెప్పారు. అయితే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ కేంద్రంలో బీజేపీ అధికారంలోనే ఉన్నప్పటికీ యూరియా కొరత రాలేదని గుర్తు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు కష్టాలు తెలిసిన వ్యక్తి కాబట్టే కొరత లేకుండా చూసుకున్నారని అన్నారు. స్థానిక నాయకులు తమ బంధువులకు ఫర్టిలైజర్ షాపులు పెట్టిస్తున్నారని, యూరియాను బ్లాక్ లో అమ్ముకుండా రైతులకు నేరుగా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల తరపున తాను యూరియా అడిగితే రియల్ ఎస్టేట్ బ్రోకర్లతో తన పై వ్యంగ్యంగా మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రాజకీయాలను పక్కన పెట్టి రైతులకు సరిపడా యూరియా అందించాలని కోరారు. వ్యవసాయ అధికారులు వెంటనే స్థానిక షాపులను తనిఖీ చేసి బ్లాక్ దందాను అరికట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా భూసేకరణ విషయంలోనూ రైతులకు సరైన ధర చెల్లించి భూములు సేకరించాలని రాంమోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# గణనాథునికి ఎస్పీ దంపతుల ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్టించిన వినాయక మండపంలో ఆదివారం గణనాథుడి సహస్ర పుష్ప అర్చన పూజ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సతీ సమేతంగా పాల్గొని ఘనంగా పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతలు పుకార్లపై అప్రమత్తంగా ఉండాలని అపోహాలకు గురి కావద్దన్నారు. ఇదేరీతిలో నిమజ్జనం రోజు వరకు ప్రతి ఒక్కరు పోలీసు వారికి సహకరించాలని ఎటువంటి అటంకాలు లేకుండా నవరాత్రులు, నిమజ్జన శోభయాత్ర నిర్వహించుకోవాలని కాలనీ వాసులకు జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ పూజ కార్యక్రమంలో ఎస్పీ సతీమణి తెలంగాణ రాష్ట్ర బాలల పరిరక్షణ సమితి సభ్యురాలు, బండి అపర్ణ, వినాయక మండప నిర్వాహకులు కాలనీ వాసులు, ఎస్పీ సీసీ మధు, సూరా రవీందర్, పురుషోత్తం శెట్టి, నరేంద్రచారి, భాస్కర్ నాయక్, గట్టయ్య, వెంకటరెడ్డి, నర్సింహరెడ్డి, రవికుమార్ రెడ్డి, వెంకటస్వామి, రామకృష్ణ, కాలనీ మహిళలు అశ్విని, ప్రసన్న, మంజుల, పల్లవి, నేహ, మానస, లలిత, సరస్వతి, భారతి, సూర్యకళ, సరిత తదితరులు పాల్గొన్నారు.

# జడ్చర్లలో 'మావోడి పెళ్లి' షార్ట్ ఫిలిం షూటింగ్



ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల మండల కేంద్రంలో ఆల్వాన్ పల్లి శివాలయంలో ఎస్ఆర్ఎఫ్ క్రియేషన్స్ బ్యానర్‌పై, నిర్మాత షరీఫ్ నిర్మిస్తున్న మావోడి పెళ్లి షార్ట్ ఫిలిం, జహీర్ డైరెక్షన్లో షూటింగ్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ షార్ట్ ఫిలింలో, వెంకీ రొంపెల్లి, విజయలక్ష్మి హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. డిఓపి, శంకర్ ఎమ్మెన్, మేకప్ మెన్, యనమల్ల రమేష్, సెకండ్ కెమెరామెన్, రవితేజ, గేయ రచయిత బూరుగుపల్లి కృష్ణ యాదవ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. షార్ట్ ఫిలిం షూటింగ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి, కృష్ణ యాదవ్ మాట్లాడుతూ సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా టాలెంటు ఉన్న యువతి యువకులు షార్ట్ ఫిలింల ద్వారా తమ ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని గ్రామీణ స్థాయి కళాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన అభిలాషించారు. షార్ట్ ఫిలింల ద్వారా, మన సంస్కృతి సంప్రదాయాలను, మానవ విలువలను చాటి చెప్పాలని దర్శకనిర్మాత నటీనటులను కోరారు.

# శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ ఉప కేంద్ర భవనం

చినుకు పడితే చిత్తడే



ప్రజాపక్షం/వీపనగండ్ల: మండల కేంద్రంలో సుమారు 38 సంవత్సరాల క్రితం నిర్మించిన 33/11 కె.వి. విద్యుత్ ఉప కేంద్ర భవనం శిథిలా వ్యవస్థకు చేరుకుంది. గత కొన్ని సంవత్సరాలుగా భవనానికి మరమ్మతులు జరగకపోవడం, భవనానికి తగిన సంరక్షణ లేకపోవడంతో గోడలు పగుళ్లు ఏర్పడి, భవన పై కప్పు సిమెంట్ రేకులతో నిర్మించడంతో కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు అంతా లోపలికి వచ్చి మడుగుల మారి కష్టమవుతోందని ఆపరేటర్లు వాపోతున్నారు. విద్యుత్ ఉప కేంద్ర భవనాన్ని 1987లో నిర్మించగా అప్పట్లో భవనంపై కప్పును సిమెంట్ రేకులతో నిర్మించారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ సిమెంట్ రేకుల నాణ్యత తగ్గిపోవడంతో ముసురు వర్షాలు, భారీ వర్షాలు కురిసేటప్పుడు వర్షపు నీరంతా లోపలికి వచ్చి చేరుతుండటంతో కూర్చోవటానికి కూడా ఇబ్బందిగా ఉంటుందని రాత్రి వేళలో జాగరణ చేయాల్సి వస్తుందని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం గది తలుపులు, కిటికిలు కూడా పూర్తిగా పాడైపోవటంతో విషపురుగులు లోపలికి వస్తున్నాయని, శిథిల వ్యవస్థలో భవనం ఎప్పుడు కూలుతుందోనని భయం భయంగా గడుపుతున్నామని వాపోయారు. నూతన భవన నిర్మాణం కోసం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోయిందని అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చర్యలు తీసుకొని భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం చేపట్టాలని విద్యుత్ సిబ్బంది కోరుతున్నారు.

# బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాపక్షం/కొత్తకోట: కొత్తకోట పట్టణంలోని బాలికల ఉన్నంత పాఠశాల ఆవరణలో గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ చీఫ్ ఎగ్జామినేర్‌గా నిర్వహించారు. ఈ బెల్టు గ్రేడింగ్ టెస్ట్‌లో 41 మంది విద్యార్థి విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబర్చి బెల్ట్ సర్టిఫికెట్లు సాధించారు. వీరిలో ఎల్లో బెల్ట్ 8, ఆరెంజ్ 10, గ్రీన్ 5, బ్లూ 2, మెరూన్ 8, జూనియర్ బ్రౌన్ 8 విద్యార్థులు సాధించారు. సాధించిన విద్యార్థులకు గాడ్స్ ఆన్ వారియర్స్ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు సుధీర్ రెడ్డి, రాంప్రసాద్, చందు, ఆంజనేయులు, లక్ష్మీ కాంత్ యాదవ్ , పి. రాములు సాగర్ పాల్గొని విద్యార్థులను ప్రతిభా కనబర్చి వారికి బెల్టు సర్టిఫికెట్ అందించి వారిని అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ చిన్న వయసులోనే విద్యార్థులు కరాటే నేర్చుకోవడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఎంతో ధృఢత్వం కలిగి ఉంటారని చిరుగా ఉంటారని తెలియజేశారు. కొత్తకోట ఈ కరాటే సంస్థ గత 30 సంవత్సరాల నుంచి కొత్తకోటలో ఎంతోమంది విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో కాకుండా ఎస్‌జిఎఫ్ఐ, రాష్ట్ర స్థాయిలలో అనేక విభాగాలలో జిల్లాకు ఎన్నో పథకాలు సాధించాలని ఈ సందర్భంగా వారు శిక్షణ ఇచ్చినటువంటి మాస్టర్ అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ కరాటే మాస్టర్ జి.హరీష్ యాదవ్, జాఫర్ సాదిక్, ఇంతియాజ్, ఎస్.కె.బాబా, అజ్మీర్, ఎస్కే, గౌస్ బాషా, కార్తికేయ యాదవ్, హర్షవర్ధన్, వెంకట్‌లు పాల్గొన్నారు.



## సింగిల్ విండో డైరెక్టర్ ఆకస్మిక మృతి

ప్రజాపక్షం/అడ్డాకుల : అడ్డాకుల మండలం కందూరు గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకలు వి.బి రాజు అకాల మరణం చెందారు. స్థానిక నాయకుల ద్వార సమాచారం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు ఆలవెంకటేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి, ఆయన అకస్మిక మృతి పట్ల తీవ్ర విచార వ్యక్తం చేశారు. నేడు కందూరు గ్రామంలో వార స్వగృహానికి స్థానిక నాయకులతో కలిసి వెళ్లి వి.బి రాజు పార్థివదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం శోకతప్తు లైన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో మండల సింగిల్ విండో చైర్మన్ మద్దూరి జితేందన్ రెడ్డి, అడ్డాకుల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు టి. శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు మద్దూరి చంద్రమోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీకాంత్, మండల మాజీ కోఆప్షన్ ఖజా గోరి, రమేష్ గౌడ్, చక్రపాణి రెడ్డి, సంజీవ రెడ్డి, బొడ్డు రమేష్, విజయ్ కుమార్ రెడ్డి, కదిరె శ్రీనివాస్ యాదవ్. జాజాల రాజేశ్వర్ రెడ్డి, కొండన్న, రమేష్, యువకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత గుట్కాలు పట్టివేత





ప్రజాపక్షం/మద్దూర్ : మద్దూర్ టౌన్‌లో సిఆర్ కిరాణషాప్‌లో అక్రమంగా ప్రభుత్వ నిషేధిత గుట్కాలు నిల్వ ఉంచి ప్రజలకు అమ్ముతున్నందున పక్కా సమాచారంతో మద్దూర్ యస్సై విజయ్‌కుమార్ దాడులు నిర్వహించారు. కిరాణా షాపులో రూ.15,1235 విలువగల అంబర్ జర్ధ, గుట్కా ప్యాకెట్లను పట్టుకొని పోలిస్‌స్టేషన్‌కు తరలించారు. షాప్ ఓనర్ విష్ణుపై కేసు నమోదు చేయడం జరిగిందని యస్సై తెలిపారు. ప్రభుత్వ నిషేధిత అంబర్ జర్ధ గుట్కా ప్యాకెట్లను ఎవరైనా అక్రమంగా నిల్వ ఉంచిన, రవాణా చేసిన, ప్రజలకు అమ్మిన అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని యస్సై హెచ్చరించారు.

## ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



ప్రజాపక్షం/నారాయణపేట్ : నారాయణపేట్ జిల్లా ఉట్కూర్ మండలం బిజ్వార్ గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ పడమటి ఆంజనేయ స్వామి గర్భగుడి పునర్నిర్మాణానికి బిజ్వార్ గ్రామ రైతులు గుయ్యాలి నాగిరెడ్డి 1,11,111, ఉప్పు మారుతి 51,111, మీదిగేరి గణేష్ 50,000, మరికల్ కుర్వ శ్రీనివాస్ 51,000 రూపాయల విరాళాలయ ఆలజ అధ్యక్షులు దొరోల్ల కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డికి అందజేశారు. రాజకీయాలకు అతీతంగా అందరూ ఐక్యమాత్యంతో ఆలయ పూర్తి చేయుటకు కృషి చేయాలని తెలిపారు. చుట్టూ పక్కల గ్రామాల భక్తులు కూడా గర్భగుడి పునర్నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి సభ్యులు రాజప్ప, నాగరాజు చారి, గోవింద్ రెడ్డి, వెంకప్ప గౌడ్, రఘువేంద్ర, పత్తి ఆంజనేయులు, వెంకటప్ప, అశోక్, రామలింగం గౌడ్, హనుమంతు, గుయ్యాలి గోపాల్ రెడ్డి, తులసీదాస్, రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: జిల్లాలో వినాయక చవితి సందర్భంగా నేడు దాదాపు 500 వరకు గణపతి విగ్రహాల నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారి డి.జానకి, ఐపీఎస్ టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని పోలీసు అధికారి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్‌హెచ్‌ఓలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమం శాంతియుతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేలా ప్రతి విభాగం అధిక అప్రమత్తతతో పనిచేయాలని సూచించారు. ప్రతి నిమజ్జన ఘాట్ వద్ద పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేయాలి. గణపతి నిమజ్జనానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్ అమలు చేయాలని తెలిపారు. రాత్రి వేళల్లో కూడా పర్యవేక్షణ కోసం స్పాట్‌లైట్లు, శక్తివంతమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పోలీసులు, హోంగార్డులు స్పెషల్ పార్టీలు విధుల్లోకి దింపబడ్డారు. ట్రాఫిక్ పోలీసులు కూడా ప్రత్యేక చర్యలు చేపట్టి వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డైవర్లను అమలు చేస్తున్నారు.

## సేవతోనే సమాజంలో మంచిగుర్తింపు



ప్రజాపక్షం/వెల్దండ : సమాజంలో ప్రజాసేవతోనే మంచి గుర్తింపు లభిస్తుందని కొట్రసేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు పొనుగోటి రవీందర్‌రావు అన్నారు. ఇటీవలే మండలపరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన కొండపల్లి జమ్ములు అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన ఆదివారం సేవా సమితికిట్టును అందజేశారు. ఈసందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ ప్రతినిత్యం నిరుపేదప్రజలకు సేవచేయడం ద్వారా ఆత్మకు ఎంతో సంతృప్తినిస్తుందని అన్నారు. అదేవిధంగా సేవాసమితిద్వారా నిరుపేద ప్రజలకు ప్రతినిత్యం కిట్టు అందజేయడం జరుగుతుందన్నారు. అందజేసిన వారిలో సేవాసమితి సభ్యులు షాంపూరి వెంకటయ్య, బోగరాజు అర్జున్, ఎల్లయ్య, దశరథం, జంగయ్య, కొండపల్లి జంగయ్య పాల్గొన్నారు.

# క్రీడ

## సెమీఫైనల్లో ఓటమి..

### మళ్లీ కాంస్యంతోనే సరిపెట్టుకున్న సాత్విక్-చిరాగ్




ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్‌లో సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి ద్వయం రెండో పతకంతో మెరిసింది. మూడేళ్ల క్రితం ఈ టోర్నీలో కంచు మోత మోగించిన ఈ ద్వయం ఈసారి కూడా అదే మెడల్‌తో మురిసిపోయింది. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో చైనా షట్లర్ల చేతిలో సాత్విక్ చిరాగ్ జోడీ పోరాడి ఓడింది. మూడు సెట్లలోనూ హోరాహోరీగా తలపడినప్పటికీ చెన్ బొ యాంగ్, లీ యూ జంట పైచేయి సాధించింది. దాంతో, మరోసారి కాంస్యంతోనే సరి పెట్టుకుంది మాజీ నంబర్ వన్ జంట.

వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో అద్భుతంగా ఆడిన సాత్విక్ – చిరాగ్ ద్వయం ఫైనల్ చేరిన మొదటి భారత డబుల్స్ జంటగా చరిత్ర సృష్టించాలనుకుంది. కానీ, చైనా గోడను బద్ధలు కొట్టలేకపోయింది. 67 నిమిషాల పాటు ఉత్కంఠ రేపిన పోరులో తొలి సెట్‌ను చైనా జోడీ చెన్ బొ యాంగ్ లీయూ 21–19తో గెలు పొందింది. అయితే.. రెండో సెట్‌లో సాత్విక్ – చిరాగ్ పుంజుకొని 21–18తో ప్రత్య ర్ధికి షాకిచ్చారు. నిర్ణయాత్మక మూడో సెట్‌లో భారత స్టార్లు తడబడ్డారు. చైనా జంటను నిలువరించలేక 12–21తో సెట్‌తో పాటు చరిత్ర లిఖించే అవకాశాన్ని చేజార్చుకున్నారు. 'మేము గొప్పగా ఆడలేకపోయాం. మ్యాచ్‌లో మాకు శుభారంభం లభించలేదు. మూడో గేమ్‌లో ప్రత్యర్థికి తేలికగా పాయింట్లు ఇచ్చాం. మేము మరింత స్మార్ట్‌గా ఆడి ఉండాల్సింది. కానీ, చైనా షట్లర్లు సూపర్‌గా ఆడారు. ఆట ఆరంభం నుంచి మూడో గేమ్ వరకూ వాళ్లు మాకంటే మెరుగ్గా సర్వ్ చేశారు. తొందరపడకుండా సర్వ్ చేయడం.. ప్రశాంతంగా ఉండడం.. ఇలా ఆటలో మేము కొన్ని మార్పులు చేసుకోవాల్సింది' అని చిరాగ్ తమ ఓటమిపై స్పందించాడు.

## రన్నరప్‌గా తెలంగాణ..

### ఛాంపియన్లుగా ఉత్తరప్రదేశ్, కర్నాటక..!










అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ నేషనల్ చాంపియన్‌షిప్ 2025 పోటీలు ముగిశాయి. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో పోరాడి ఓడిన తెలంగాణ పురుషుల జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం హైదరాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగిన ఫైనల్లో కర్ణాటక టీమ్ విజేతగా నిలవగా, మహిళల విభాగంలో ఉత్తరప్రదేశ్ బృందం ఛాంపియన్‌గా అవతరించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన పురుషుల ఫైనల్లో కర్ణాటక జట్టు తెలంగాణను 19–12 తేడాతో ఓడించింది. మహిళల విభాగం ఫైనల్లో ఉత్తరప్రదేశ్ జట్టు చెలరేగి ఆడి కర్ణాటకపై 20–0 భారీ విజయం సాధించింది. పురుషుల విభాగం కాంస్య పతక పోరులో కేరళ 28–6 తేడాతో ఉత్తరప్రదేశ్‌పై గెలిచింది, అలాగే మహిళల విభాగంలో మహారాష్ట్ర 6–0 తేడాతో కేరళ జట్టును మట్టికరిపించింది.

'టోర్నమెంట్ విజయవంతంగా ముగియడం పట్ల ఆర్గనైజేషన్ కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. వాలెడిక్టరీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ టోర్నమెంట్ క్రీడాకారుల్లో పెరుగుతున్న పోటీ తత్వాన్ని, క్రీడా స్ఫూర్తికి నిదర్శనం. అంతేకాదు ఈ ఆట మరింత విస్తరించడమే కాకుండా దేశవ్యాప్తంగా కొత్త ప్రతిభావంతులకు స్ఫూర్తిగా నిలుస్తుంది' అని అన్నారు.

**కేరళను ఓడించి..**

పురుషుల సెమీఫైనల్స్‌లో తెలంగాణ 20–19తో కేరళను ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. రెండో సెమీస్‌లో కర్ణాటక జట్టు 31–12తో ఉత్తరప్రదేశ్‌ను చిత్తు చేసింది. మహిళల విభాగం సెమీస్ ఫలితాల విషయాని కొస్తే.. ఉత్తరప్రదేశ్ 16–0తో మహారాష్ట్రను దారుణంగా ఓడించగా.. కర్ణాటక 16–0తో కేరళను ఇంటికి పంపింది.

## ఉత్కంఠ పోరులో జపాన్‌పై విజయం..

### సూపర్ 4కు చేరువైన టీమిండియా




స్వదేశంలో జరుగుతున్న హాకీ ఆసియా కప్‌లో భారత జట్టు జోరు కొనసాగిస్తోంది. తొలి పోరులో చైనాను చిత్తు చేసిన టీమిండియా ఈసారి జపాన్‌కు చెక్ పెట్టింది. ఆదివారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మన్దీప్ సింగ్ అద్భుతంగా రాణించడంతో 3–2తో గెలుపొందింది. వరుసగా రెండు విజయాలతో భారత్ సూపర్ 4కు చేరువైంది. గ్రూప్ ఏలో అగ్రస్థానంలో ఉన్న హర్మన్‌ప్రీత్ సేన సోమవారం కజకిస్థాన్‌తో తలపడనుంది. ఆరంభ మ్యాచ్‌లో చైనాపై గెలిచినా.. మెరుగైన ప్రదర్శన చేయలేదు భారత ఆటగాళ్లు జపాన్‌పై మాత్రం టాప్ గేర్‌లో ఆడారు. ఆట మొదలైన నాలుగో నిమిషంలోనే మనుదీప్ సింగ్ తొలి గోల్ అందించాడు. ఆ తర్వాతి 60 సెకన్లలోనే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. మూడో అర్ధ భాగంలో జపాన్ గోల్‌తో ఖాతా తెరిచింది. అయితే.. మరోసారి సారథి హర్మన్‌ప్రీత్ గోల్ చేయగా భారత్ 3–1తో స్పష్టమైన ఆధిక్యంలోకి వెళ్లింది. మరికాసేపట్లో ఆట ముగుస్తుందనగా జపాన్ గోల్ చేసినా ఫలితం లేకపోయింది. ప్రత్యర్థి ఆటగాళ్లు మరో గోల్‌కు ప్రయత్నించినా.. ఢిఫెండర్లు అద్భుతంగా రాణించి వాళ్లకు చెక్ పెట్టారు.

ఫోకస్

ఆరోగ్యం

## కేన్సర్‌కు వ్యాక్సిన్



కేన్సర్ వ్యాక్సిన్ ప్రయోగాత్మక క్లినికల్ ట్రయల్ విజయవంతమైంది. ముఖ్యంగా ప్యాన్‌క్రియాటిక్, కొలొరెక్టర్ కేన్సర్లను అరికట్టడానికి ఈ ప్రయోగం నిర్వహించారు. ఇవి అత్యంత ప్రమాదకరమైన, చికిత్సకు తొందరగా లొంగని కేన్సర్లు. ఈ రకం కేన్సర్లను నిరోధించడానికి బయోఎన్‌టెక్, జెనెటెక్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ ఎంఆర్ఎన్ఎ ఆధారిత వ్యాక్సిన్, శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థను పెంచుతుంది. కేన్సర్ కణాలను గుర్తించి, అత్యద్భుత ఖచ్చితత్వంతో నాశనం చేయగలిగేలా, రోగ నిరోధక శక్తికి శిక్షణ ఇస్తుంది.




ఫేజ్ I ట్రయల్‌లో 84శాతం మంది పేషెంట్లు బలమైన రోగ నిరోధక ప్రతిస్పందనలు చూపించారని తాజా నివేదిక స్పష్టం చేస్తున్నది. ఒకసారి చికిత్స పొందిన వారికి, రెండు సంవత్సరాలు దాటిన తర్వాత కేన్సర్ లక్షణాలు మళ్లీ కనిపించలేదు. ఈ వ్యాక్సిన్ ప్రతి రోగికి వారి కేన్సర్ కణాల ఆధారంగా ఆర్ఎన్ఎ కోడ్‌ను రూపొందిస్తుంది. ఈ ప్రయోగం, వ్యక్తిగతీకరించిన కేన్సర్ చికిత్స వైపు వేసిన గొప్ప అడుగు. ఈ సంచలనాత్మక పరిణామం మృత్యు ముఖంలో ఉన్న టెర్మినల్ కేన్సర్ రోగులకు కొత్త ఆశను కలిగిస్తున్నది. భవిష్యత్తులో కొవిడ్ 19 వంటి మహమ్మారికి కూడా ఎంఆర్ఎన్ఎ వ్యాక్సిన్ టెక్నాలజీని విస్తృతంగా వాడే అవకాశం ఉందని నిర్ధారించింది.

మెసెంజర్ రిబోన్యూక్లియిక్ యాసిడ్ (ఎంఆర్ఎన్ఎ) వ్యాక్సిన్లు శరీరంలోని కణాలను ఒక నిర్దిష్ట ప్రోటీన్‌ను ఉత్పత్తి చేయమని సూచిస్తాయి. 'విదేశీ' కణాలను గుర్తించి, వాటిపై దాడిచేసేలా రోగ నిరోధక శక్తిని ప్రేరేపిస్తుంది. ఫలితంగా శరీరం బలమైన రక్షణాత్మక ప్రతిస్పందనను అభివృద్ధి చేస్తుంది. ఇప్పటికే కొవిడ్19 సమయంలో మోడర్నా, ఫైజర్ వంటి కంపెనీలు ఉపయోగించిన ఎంఆర్ఎన్ఎ టెక్నాలజీకి విస్తృత రూపంగా కేన్సర్‌కు వ్యాక్సిన్‌ను అభివృద్ధించవచ్చు. పరిశోధనలో ప్రధాన ఫలితాలను పరిశీలిస్తే 'టి' సెల్ (శరీరంలోని ప్రధాన యాంటీక్యాన్సర్ రక్షణ కణాలు) క్రియాశీలత పెరిగినట్టు స్పష్టమవుతున్నది. ఈ వ్యాక్సిన్ ప్రత్యేకంగా 'టి' సెల్స్‌ను బలంగా ఉద్దీపన చేస్తుంది.

సాధారణంగా, ట్యూమర్లు శరీర రక్షణ వ్యవస్థను తప్పించుకోవడంలో నైపుణ్యం సాధిస్తాయి. ఈ వ్యాక్సిన్ ట్యూమర్లకు వ్యతిరేకంగా సైటోటాక్సిక్ సిడి8+ 'టి' సెల్‌ను మరింత క్రియాశీలకంగా మారుస్తుంది. దీంతో ట్యూమర్ కణాలను నేరుగా నాశనం చేస్తాయి. వ్యాక్సిన్ ప్రభావంతో శరీరంలో టైప్ I ఇంటర్‌ఫెరాన్లు ఉత్పత్తి అవుతాయి.

ఇవి ఇమ్యూన్ సిస్టమ్‌కు 'అలర్ట్ సిగ్నల్స్'గా పని చేస్తాయి. ఫలితంగా, రోగనిరోధక వ్యవస్థ దాడి మోడ్‌లోకి మారి ట్యూమర్లను గుర్తించి ధ్వంసం చేస్తుంది. సాధారణ చికిత్సలకు (కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ, రేడియేషన్ మొదలైనవి) స్పందించని డ్రగ్‌రెసిస్టెంట్ ట్యూమర్లు కూడా ఈ వ్యాక్సిన్‌తో తగ్గిపోయాయని పరిశోధకులు గుర్తించారు. ఎలుకలపై జరిపిన ప్రయోగాలు విజయవంతమైన తర్వాత, వీటిని మనుషులపై ప్రయోగించారు. అక్కడ కూడా సానుకూల ఫలితాలు రావడంతో, ఇప్పుడు వ్యాక్సిన్ ఫార్ములేషన్‌ను మరింత మెరుగు పరచే ప్రయోగాల్లో పరిశోధకులు నిమగ్నమయ్యారు. 2026లో మొదటి దశ పూర్తిస్థాయి హ్యూమన్ క్లినికల్ ట్రయల్స్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. వ్యాక్సిన్ సురక్షితమా, సమర్థవంతమా, దుష్ప్రభావాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలపై అప్పుడు స్పష్టత వస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే, ఒక్కో కేన్సర్ రకానికి వేర్వేరు ట్రీట్మెంట్లు అవసరం కాకుండా, ఈ ఒక్క వ్యాక్సిన్ వివిధ రకాల ట్యూమర్లపై పనిచేస్తుంది. ఈ పద్ధతి త్వరలో ఊపిరితిత్తులు, కాలేయం, మెదడు కేన్సర్లు సహా పలురకాల కేన్సర్‌లకు కూడా వర్తించవచ్చని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. వారి అంచనాలు నిజమైతే, కేన్సర్‌తో పటు పలు ఇతర రుగ్మతలను శాశ్వతంగా దూరం చేసే రోజు ఎంతో దూరంలో లేదు.

## నాన్‌స్టిక్ పాన్‌తో జాగ్రత్త

చాలా మంది ఇళ్లలో నాన్‌స్టిక్ పాన్‌ను విరివిగా ఉపయోగిస్తున్నారు. అయితే, వీటి వాడకంలో జాగ్రత్తగా ఉండాలని న్యూకాసిల్ విశ్వవిద్యాలయ పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వారు విడుదల చేసిన తాజా అధ్యయన నివేదికను అనుసరించి, నాన్‌స్టిక్ టెఫ్లాన్ పాన్‌పై ఒక్క స్క్రాచ్ ఉండే ప్రతిదానిలో 9,000 వరకు సూక్ష్మ ప్లాస్టిక్, నానోప్లాస్టిక్ కణాలు మీ ఆహారంలోకి విడుదలయ్యే అవకాశముందని గుర్తించింది. ఈ సూక్ష్మ, కనిపించని ముక్కలు తెలియకుండానే తినేస్తుంటాం. వీటిలో కొన్ని జీర్ణక్రియలోనుంచి రక్తస్రావం, అవయవాలలోకి ప్రవేశించి వాటి ప్రభావాలు చూపుతాయి. ఈ కణాలు హార్మోన్ల వికృతి, ఇన్ఫ్లమేషన్, కొన్ని సమయాల్లో కేన్సర్ ప్రమాదాలకు సంబంధించి ఉండవచ్చని ఈ నివేదిక పేర్కొంది. పిటిఎఫ్ఇ లేదా టెఫ్లాన్ వంటి పదార్థాలతో తయారైన నాన్‌స్టిక్ కోటింగ్‌లు వేడి లేదా గోర్ల వల్ల గీతలు పడతాయి. అయినప్పటికీ, ఆ పాన్‌లను వాడడం చాలా సహజం. అయితే, అలాంటి పాన్లను కొనసాగిస్తూ వాడటం వల్ల వివిధ రకాల ఆరోగ్య సమస్యలు పెరుగుతాయని తాజా అధ్యయనం పేర్కొంది. ప్రమాదాన్ని తగ్గించుకోవాలంటే, దెబ్బతిన్న నాన్‌స్టిక్ వంట పరికరాలను కాస్ట్ ఐరన్, స్టెయిన్లెస్ స్టీల్ లేదా సిరామిక్ వంటి భద్రమైన ప్రత్యామ్నాయాలతో మార్చుకోవడం మంచిది. వుడ్ లేదా సిలికాన్ వంట పరికరాలు వాడటం ద్వారా పాన్ ఉపరితలం రక్షించుకోవచ్చు. సౌకర్యం కోసం ఆరోగ్యాన్ని పణంగా పెట్టడం మంచిది కాదు. వండే ఆహారంలో నాణ్యత మాత్రమేకాదు... దానిని ఎందులో వండుతున్నారన్నది కూడా కీలకమే.



ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## పీడిత, తాడిత ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులే

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/కారేపల్లి:** పీడిత, తాడిత ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని భాగ్యనగర్ తండా గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు మండల కార్యవర్గ సభ్యులు గుగులోత్ మంగు మృతి చెందారు. మంగు సంస్కరణ సభ భాగ్యనగర్ తండాలో సిపిఐ మండల కార్యదర్శి పాపినేని సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. సంస్కరణ సభకు హాజరై దండి సురేష్ మాట్లాడుతూ మంగు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. మంగు నిబద్ధత గల కార్యకర్తని క్రమశిక్షణ కలిగి పార్టీ కోసం పరితపించాడన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌లో కూడా కీలక పాత్ర పోషించాడన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులు భౌతికంగా మరణించిన వారి ఆలోచనలు సజీవంగా ఉంటాయన్నారు. సంస్కరణ సభలో సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ ఎర్రబాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి లతాదేవి, రావి శివరామకృష్ణ, శంకర్, బంధం నాగయ్య, జిల్లా సమితి సభ్యులు ఉంగరాల సుధాకర్, గుగ్గులోతు రామ్ చందర్, బస శ్రీనివాసరావు, పాటి అనంతరాములు, రాయల రామారావు, పోతనబోయిన రవి, సహదేవ్, అమ్మ భాగ్యనగర్ తండా శాఖ కార్యదర్శి బావుసింగ్, కౌలియా హరిసింగ్, రవి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సూర్యం సేవలు చిరస్మరణీయం

### రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** సిపిఐ సీనియర్ నాయకుడు పసుమర్తి సూర్యం పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, సిపిఐ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు అన్నారు.మండల పరిధిలోని తనికెళ్లలో ఆదివారం పసుమర్తి సూర్యం వర్ధంతిని సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు కొణపర్తి విష్ణుమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సూర్యం సర్పంచ్‌గా, తనికెళ్ల కో–ఆపరేటీవ్ సొసైటీ అధ్యక్షుడిగా, గ్రైన్ బ్యాంక్ చైర్మన్‌గా, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శిగా, రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడిగా కొనసాగారని తెలిపారు. ఎన్నికల్లో పార్టీని గెలిపించడంలో క్రియాశీలక పాత్ర పోషించేవాడని కొనియాడారు. సూర్యం కుమారులు తన తండ్రి పేరు నిలబెట్టేందుకు గ్రామంలో వారికున్న భూమిని సబ్ స్టేషన్ నిర్మాణానికి వితరణ చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో గడల సీతారామయ్య, కవిడ వీరభద్రం, ఎస్‌టియు నాయకులు లేడిబోయిన గోపాల్ రావు, నాయకులు మేకల మల్లిఖార్జున్, పెద మళ్ల రత్తమయ్య, బాసా నాగరాజు, గుమ్మిడెల్లి సైదారావు, బాణోత్ వీరయ్య, పొట్లపల్లి సతీరాములు, పెదమళ్ల అంజయ్య, పిన్నం పుల్లయ్య, సూర్యం కుటుంబ సభ్యులు పసుమర్తి శంకర్‌రావు పాల్గొన్నారు.

## జాతీయ ఆరోగ్య మిషన్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి




### సంఘం(ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజేష్ డిమాండ్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జాతీయ ఆరోగ్య మిషన్లో పనిచేస్తున్న సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్(ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా మహాసభలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 21 నెలలు గడుస్తున్నా ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు సవరించి పెంచకుండా నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. అనేక పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను ఎన్‌డిఎ ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసి, కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి జాతీయ ఆరోగ్య మిషన్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ ఆల్ క్యాడర్స్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎన్.సురేష్ నాయక్, మధుకర్, నాయకులు చిరంజీవి, ముస్తక్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ నూతన కమిటీని రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎల్.సురేష్ నాయకత్వంలో ఎన్నుకున్నారు. ఎన్‌హెచ్ఎం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా భోగే ఉపేందర్ (ఎఐటియుసి), జిల్లా అధ్యక్షుడిగా ఎ.చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బుడిపెల్లి మధుకర్, సహాయ కార్యదర్శిగా ముస్తాక్, కోశాధికారి సిహెచ్ నాగేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## అమరుల ఆశయ సాధనకు కృషి

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** అమరుల ఆశయాలను కొనసాగించి కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి కోరారు. ఆదివారం మోటకొండూర్ మండలంలోని ఆరేగూడెంలో గాదగాని మల్లయ్య 20వ వర్ధంతి సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణతో కలిసి పాల్గొని మల్లయ్య స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్ధంతి సభకు సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి పిట్టల కర్ణాకర్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ మాట్లాడుతూ గాదగాని మల్లయ్య సిపిఐ గ్రామ శాఖను స్థాపించి ఇల్లులేని నిరుపేదలకు ఇండ్ల స్థలాల కోసం కొట్లాడి ఇండ్ల స్థలాలు ఇప్పించడంలో ముఖ్య పాత్ర పోషించారన్నారు. పాఠశాల, హనుమాన్ టెంపుల్ స్థలంలో పెత్తందారుల ఆక్రమణలకు గురైతే కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మల్లయ్య ముఖ్య పాత్ర పోషించి పోరాటాలు చేసి పెత్తందార్ల ఆక్రమణల నుండి విడిపించిన నాయకుడన్నారు. మల్లయ్యతో పాటు బోళ్ల గౌరయ్య, గాజుల అంజయ్య, రాజమల్లులాంటి వారు నిరుపేదలకు భూమిలేని పేదలకు, భూమి ఇయ్యాలని పోరాటం చేస్తూ మోటకొండూరులో కూడా రెడ్డిగంటి శేషయ్య, రేగు సిద్దయ్యలతో కలిసి మాలుగడ్డ భూమిని పేదలకు పంచడంలో ముఖ్యపాత్ర పోషించాడన్నారు. మల్లయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లుతామన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మండల కార్యవర్గ సభ్యులు బోల్ల శీను, బీరకాయల మల్లేష్, మంచాల రాధమ్మ, ఎఐవైఎఫ్ నాయకులు సునీల్, గాదగాని మల్లేష్, నల్ల ప్రదీప్ రెడ్డి, మారబోయిన దేవరాజు, పేర బోయిన రవి, మారమైన జాంగిర్, నల్ల యుద్ధవ రెడ్డి, బిసా పాండు, గాదగాని కరుణాకర్, ఎఐఎస్ఎఫ్ నాయకులు గాధగాని మణికంఠ, మంచాల సుదర్శన్, మంచాల సుగుణ, దూసెట్టి అండాలు, బండి అనసూయ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఎఐటియుసితోనే కార్మిక సమస్యల పరిష్కారం

### యూనియన్ జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి మహేష్

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** ఎఐటియుసి పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని యూనియన్ జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి వెన్న మహేష్ పేర్కొన్నారు. ఆదివారం మహేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎఐటియుసి చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై సాయి ఈశ్వరి ఆధ్వర్యంలో పలు యూనియన్ల నాయకులు టిఆర్‌నగర్ వనిత, పద్మరాణి, తాటిపల్లి సెక్టార్ చెందిన నాయకురాళ్లు ఎఐటియుసిలో చేరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి భాగ్య, దయావతి తదితరులు పాల్గొన్నారు.




## సింగరేణి కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం

### ఆరెల్లి పోషం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి పరిరక్షణకు, కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం పోరాడేది గుర్తింపు సంఘం ఎఐటియుసి మాత్రమేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన ఎఐటియుసి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణిలో గత పది సంవత్సరాలుగా ఎలాంటి సమస్యలు పరిష్కారం కాక కార్మికులు నమ్మకంతో ఏడవ సారి జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎన్నికల్లో హామీ ఇచ్చిన సమస్యల పరిష్కారానికి అగ్ర నాయకులు సీతారామయ్య, రాజ్‌కుమార్ కృషిచేస్తున్నారన్నారు. అందులో భాగంగా నవంబర్ 2024, మార్చి 2025లో జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో కార్మికులకు చెందిన పలుసమస్యల్ని పరిష్కరించాలని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు, యాజమాన్యం కొన్నింటిని అంగీకరించి ఈ నెల 20న సర్క్యులర్‌లు జారీచేసిందన్నారు. సింగరేణిలో పది సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఎఐటియుసి గుర్తింపు సంఘం గా గెలిచిన తరువాత పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఆర్జీవన్‌లో గనులు డిపార్ట్మెంట్ సమస్యలపై మైన్స్, సేఫ్టీ కమిటీ, జీఎం కమిటీ సమావేశాల్లో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. కొన్నికార్మిక సంఘాలు ఎఐటియుసిపై విమర్శలను కార్మికులు పట్టించుకోవద్దని, సింగరేణిలో ఎన్నికలు వద్దన్న సంఘాలకు ఎఐటియుసిపై విమర్శలు హక్కు లేదన్నారు. కార్మిక సంఘాలు ఎఐటియుసిపై అనవసరపు విమర్శలు మానుకోవాలని వారు హితవు పలికారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు ఎస్.వెంకట్‌రెడ్డి, చెప్యాల భాస్కర్, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, నాయిని శంకర్, గొడిశెల నరేశ్, బలుసు రవి, అజీం పాషా, ఉప్పులేటి తిరుపతి, ఎరవెల్లి రాజయ్య, కొప్పుల లింగయ్య, దోరగండ్ల మల్లయ్య, పెద్దెల్లి శంకర్, గోస్కుల శ్రీనివాస్, నిమ్మతి శివ, నాయిని మల్లేష్, శంకర్ రావు, సంపత్ కుమార్, ఓమాజి, రమేశ్, లక్ష్మణ్, సతీష్, అనిల్ కుమార్‌గౌడ్, రాజేష్, పడాల కనక రాజు, బుర్ర భాస్కర్, ఆఫీస్ కార్యదర్శి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## 15న కోల్ ఇండియా కార్యాలయం ఎదుట భారీ ప్రదర్శన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోల్ ఇండియా, సింగరేణి వార్షిక లాభాల్లో 2 నుంచి 3 శాతం వాటా మాజీ కార్మికులకు ఇవ్వాలని, కేంద్ర బడ్జెట్‌లో కోల్ పెన్షన్ అండ్ ఫండ్ కేటాయించాలని, కోల్ మైన్స్ పెన్షన్ పెంచాలని, విశాంత ఉద్యోగులకు, అధికారులకు ఒకరకమైన వైద్య విధానం అమలు చేయాలని, మెడికల్ బిల్లులలో రీయింబర్స్ మెంట్ బిల్లింపులో జాప్యం నివారించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 15న కలకత్తాలోని కోల్ ఇండియా ప్రధాన కార్యాలయం ముందు భారీ ప్రదర్శన నిర్వహిస్తామని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అకిదం దార్ వేణు మాధవ్ తెలిపారు. ధరలకు అనుగుణంగా డిఎ లేకపోవడం, పెన్షన్ పెరగకపోవడం వల్ల దేశవ్యాప్తంగా 5లక్షల పెన్షన్‌దారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ డిమాండ్ల సాధనకు పోరాడుతామని పేర్కొన్నారు.

## మెరుగైన వైద్యసేవలు అందించాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు డాక్టర్లు కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఆదివారం పట్టణంలో వైద్యులు ప్రతాప్‌కుమార్, అరవింద మాదల్లు నూతనంగా ఏర్పాటు చేసిన లోటస్ ప్రైవేట్ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం ఖరీదుగా ఉంటుందని ప్రజలు భావిస్తుంటారని, కానీ షాద్‌నగర్ ప్రాంతంలో ఎక్కువ శాతం గ్రామీణ ప్రజలు ఉంటారని, వారిని దృష్టిలో పెట్టుకొని వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజలకు వైద్యులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, ప్రజల నుండి తీసుకునే డబ్బులకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా వైద్యులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తే ఆసుపత్రి అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సింగారం సుదర్శన్, మంగ మధులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

అందెల శ్రీరాములు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** మహేశ్వరం నియోకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ సుల్తాన్‌పూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తానని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. అదివారం నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో గ్రామస్తులు అందెలకు తమ సమస్యలు వెల్లడించారు. ఈ మేరకు శ్రీరాములు మాట్లాడుతూ సుల్తాన్‌పూర్ గ్రామానికి బస్సు సౌకర్యంతో పాటు బస్తీ దావాఖాలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని త్వరలోనే ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. అక్రమంగా నిర్మిస్తున్న మదర్సా వల్ల అనేక ఇబ్బందులు కాకుండా తగు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రాళ్లగుడెం రామకృష్ణారెడ్డి, రావుల మల్లేష్, నవారు శ్రీనివాస్‌రెడ్డి, చైతన్య ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.
ఫోటో:01ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

## పాత పెన్షన్ విధానం రావాలి

టిఆర్‌టిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జామ కుశల్



**ప్రజాపక్షం/కొందుర్గు:** కొత్త పెన్షన్ విధానం రద్దు చేయడంతోపాటు పాత పెన్షన్ విధానం కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టిఆర్‌టిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జామ కుశల్ డిమాండ్ చేశారు. ఆదివారం కొందుర్గులో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జామ కుశల్ మాట్లాడుతూ గతంలో ఉన్న పాత పెన్షన్ విధానం అందరికి న్యాయబద్దంగా ఉండేదని కానీ ప్రస్తుతం తీసుకువచ్చినటుదంటి కొత్త పెన్సన్ విధానం ఏమాత్రం న్యాయబద్దంగా లేదని అన్నారు. దాంతో ఉద్యోగులు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. ప్రభుత్వం ఇట్టి విషయంపై స్పందించిన నూతన విదానాన్ని తీసివేసి పాత విధానాన్ని కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానం వద్దు..పాత పెన్షన్ విధానం కొనసాగించాలని పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సునీతతోపాటు ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయిలో షాట్‌పుట్ పోటీల్లో వరుణ్‌గౌడ్ ప్రతిభ



**ప్రజాపక్షం/శంకరపల్లి:** శంకరపల్లి మండలానికి చెందిన వరుణ్‌గౌడ్‌కు జిల్లా స్థాయిలో షాట్ పుట్, డిస్కస్ త్రోలో గోల్డ్ మరియు రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్స్ సాధించాడు. శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ గౌడ్ కుమారుడు వరుణ్ గౌడ్ బాసరలోని త్రిబుల్ ఐటిలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. రాష్ట్ర క్రీడా సెక్రెటరీ సారంగపాణి నుంచి ఆయన మెడల్స్ అందుకున్నారు, చదువుతోపాటు క్రీడా పోటీల్లో పాల్గొని బాసర త్రిబుల్ ఐటికి గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఈ సందర్భంగా పలువురు వరుణ్ గౌడ్‌ను అభినందించారు.

## హయత్‌నగర్‌కు రూ.6కోట్ల నిధులు

మధుయాష్కి గౌడ్



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** హయత్ నగర్ డివిజన్ రాఘవేంద్ర కాలనీ నుంచి కుమ్మరి కుంట వరకు నిర్మించే బాక్స్ డ్రైన్ నిర్మాణానికి నిధులు కేటాయించలని జిహెచ్ యంసి కమిషనర్‌ను కలిసి గతంలో వినతిపత్రం ఇచ్చినట్లు మధుయాష్కి గౌడ్ తెలిపారు. ఇటీవల జరిగిన జిహెచ్‌ఎంసి కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్‌తో బాక్స్ డ్రైన్ నిర్మాణం కు నిధులు కోరగా తక్షణమే స్పందించి రూ.6 కోట్లు విడుదల చేశారు. నిధులు విడుదల చేసినందుకు మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ కర్ణన్‌కు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ కుమ్మరికుంట నుండి హయత్‌నగర్ బస్‌డిపో మీదుగా రాఘవేంద్రకాలనీ వరకు ఉన్నకాలనీల ప్రజల కష్టాలు తీరుతాయన్నారు.

## పర్యావరణహితానికి, పచ్చని జీవనశైలికి సైక్లింగ్ ఎంతో దోహదం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్యావరణ హితానికి, పచ్చని జీవనశైలికి సైక్లింగ్ ఎంతో దోహదం చేస్తున్నదని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన 'సండేస్ అండ్ సైక్లింగ్' నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. జాతీయ క్రీడ దినోత్సవాల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం వద్ద జరిగిన 'ఫిట్ ఇండియా – సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై, జెండా ఊపి సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించారు. జాతీయ ఫిట్‌నెస్ ఉద్యమంలో తెలంగాణలో 'సండేస్ అండ్ సైక్లింగ్' నిర్వహించాలని సూచించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవం తొమ్మిదిరోజుల పాటు నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ సైక్లింగ్ క్రీడను మరింత ప్రోత్సహించే కార్యక్రమాలు విస్తృతస్థాయిలో చేపడుతామన్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ వర్స్ (క్రీడా వారే) నెలవారి సంచికను గవర్నర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, బజి రమేశ్, డిసిపి వినీత్, గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు తదితర క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

11 గుంటల భూమి కోసం

## వ్యక్తి దారుణ హత్య

మరో మహిళ పరిస్థితి విషమం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** భూమి కోసం ఇరువర్గాలు ఘర్షణలో వ్యక్తి హత్యకు గురికాగా, మరో మహిళకు తీవ్రగాయాలైన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలో దండుమైలారం గ్రామంలో గుడేటి జంగయ్యకు సర్వే నెంబర్ 156,158,159లో 18ఎకరాల 12గుంటల భూమి ఉండగా ఆయనకు నలుగురు కుమారులు నర్సింహ్మా, మల్లయ్య, యాదయ్య, జంగయ్యలు ఉన్నారు. అయితే ఈ భూమిని పంచుకోగా ఒక్కొక్కరికి నాలుగు ఎకరాల 23గుంటల భూమి రాగ. 11 గుంటల భూమి అదనంగా ఉన్నదని నిరంతరం అన్నదమ్ముల మధ్య ఘర్షణలు జరిగి స్థానిక పోలీసుస్టేషన్‌లో గతంలో ఫిర్యాదు చేసుకున్నారు. అదే కుటుంబానికి చెం దిన గుడేటి బాలరాజు(35)కు 11 గుంటల భూమి తక్కువ రావటంతో తమ వ్యవసాయ భూమి వద్ద అన్నదమ్ములను ప్రశ్నించటంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఒక్కసారి ఒకరు అన్నదమ్ములు గొడ్డళ్లతో దాడి చేసుకోవటం తో బాలరాజుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అడ్డు వచ్చిన తమ్ముడి భార్య మంజులకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం నగరంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. బాల్‌రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, గ్రామంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు, ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎసిపి కెపివి రాజు తెలిపారు.

## ఎంఎస్‌ఒఇతో విద్యార్థులకు భవిష్యత్తు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** అమెరికాలోని మిలవాకీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఎంఎస్ఒఇ) కాలేజీ ఆధునాతన కోర్సులు అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నదని ఎంఎస్‌ఒఇ సీనియర్ డైరెక్టర్ సమంతా కామ్మెరస్, అసిస్టెంట్ డైరెక్టర్ పీటర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ అమెరికాలోని టాప్ టెన్ కాలేజీల్లో తమ కాలేజీలో తమ కాలేజీ ఉన్నదనానరు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు తమ కాలేజీలో చేరి నాలుగేళ్ల కోర్సు పూర్తిచేస్తే మంచి ప్యాకేజీతో ప్లేస్‌మెంట్‌లు ఉంటాయన్నారు. ప్రతిభ విద్యార్థులకు 100శాతం స్కాలర్‌షిప్‌లు అందిస్తామన్నారు. సమావేశంలో ఎంఎస్‌ఒఇ ఇండియన్ డైరెక్టర్లు వివేకానంద మూర్తి, యశ్వంత్‌వర్మ పాల్గొన్నారు.



## 'యశోద' రోబోటిక్ చికిత్సలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వైద్యరంగంలో గైనకాలజీ విభాగంలో యశోద ఆసుపత్రిలో అందుబాటులోకొచ్చిన రోబోటిక్ సహాయక శస్త్రచికిత్సలు సాటిలేని కచ్చితత్వం, సిర్థత్వాన్ని పెంపొందిస్తున్నాయని, ఫలితంగా జీవన నాణ్యతను మెరుగుపరుస్తున్నాయని యశోద ఆసుపత్రి సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ అనిత కున్నయ్య, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.లింగయ్య తెలిపారు. హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో ఆదివారం జాతీయ గైనకాలజీ వైద్య నిపుణులతో ప్రత్యక్ష వర్క్‌షాప్, ఇంటరాక్టివ్ శిక్షణ శిబిరాన్ని 'గైనిక్ రోబోకాన్ – 2025' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోబోటిక్ సర్జరీ గత దశాబ్దకాలంలో ఒక విప్లవాత్మక మార్పు తీసుకొచ్చిందన్నారు. గైనిక్ సర్జరీలో భవిష్యత్తులో అందుబాటులోకి అనేక వైద్య విధానాలు రానున్నాయని తెలిపారు. సమావేశంలో ఒజిఎస్‌హెచ్ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.శాంత కుమారి, అధ్యక్షురాలు డాక్టర్ జయంతి, అధ్యాపకులు డాక్టర్ పీటర్, సి.లిమ్,డాక్టర్ మహేంద్ర తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 'యువత రాజకీయాల్లోకి రావాలి'

నవభారత నిర్మాణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బాలస్వామి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకొన్న తర్వాతే యువత రాజకీయాల్లోకి రావాలని నవ భారత నిర్మాణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రాజేశ్ బాలస్వామి, సభ్యులు పగడాల మహేశ్ సూచించారు. అప్పుడే మనం కోరుకొన్న సమాజాభివృద్ధికి బాటలు వేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ యువత సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా నిలబడేందుకు నవ భారత నిర్మాణ సమితి అండగా ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు యువతను ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో సమితి రాష్ట్ర నేతలు రఫీ, విష్ణు, విజయ ఆనంద, వినోద్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.




## యువత ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములవ్వాలి

**ప్రజాపక్షం/యాచారం :** అన్నిదానాల్లో అన్నదానం చాలా గొప్పదని యాచారం మండల పరిషత్ మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు అన్నారు. అదివారం నందివనపర్తి గ్రామంలోని అమ్మోర్ తోట కాలనిలో అన్నదాన కార్యక్రమం గుండే ప్రసన్న రాఘవేంధర్ కుటుంబ సభ్యుల అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ వినాయకుడి మండపలం వద్ద అన్నదాన కార్యక్రమం చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరు దైవ దానం అలవర్చుకుంటే ముక్తి లభిస్తుందని అన్నారు. భక్తి శ్రద్దలతో గణేశ్‌డి నవరాత్రులు జరుపుకోవాలన్నారు. యువత ఆధ్యాత్మీక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరు సేవా దృక్పంధం అలవర్చుకొవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూడేడ్ల వెంకట్‌రెడ్డి,నేర్ర శ్రీశైలం, షాహిద్,భూపతి రామకృష్ణ,పెరుమల్ల విక్రమ్,వంశీ,శెట్టిమల్ల శ్రీకాంత్,శ్రీనాథ్,పంబాల మధుకర్,శివాజీ,తెల్గమల్ల రాజేంధర్,ప్రశాంత్,కర్ణాకర్,శివ, అఖిల్, మధు పాల్గొన్నారు.



## చెరువుల వద్ద పకడ్బందీగా నిమజ్జన ఏర్పాట్లు

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** గంగమ్మ బడికి గణనాధులు బయల్దేరి వెళ్తున్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాలతోపాటు షాద్ నగర్ మున్సిపాలిటిలో ప్రతిష్టిచిన విఘ్నేశ్వర స్వామికి ఐదు రోజుల పాటు నిత్య పూజలు నిర్వహించారు. దాంతో ఆదివారం సాయంత్రం నుండి వినాయకులను గంగమ్మ ఒడికి చేర్చారు. ఆయా సమీప ప్రాంతాల చెరువుల వద్ద స్థానిక పోలీసుల తోపాటు వివిధ శాఖ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్ మాట్లాడుతూ నిమజ్జన చేసే చెరువుల వద్ద భారీ క్రేన్‌లతోపాటు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకొకుండా ఉండేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. నిమజ్జనాల వద్ద అగ్నిప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు, తెలిపారు.



# ఉత్సవాలు ఐక్యతకు చిహ్నాలు





కిచ్చనగారి లక్ష్మారెడ్డి

ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఉత్సవాలు ఐక్యతకు చిహ్నాలని, గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చెనగారి లక్ష్మారెడ్డి (కెఎల్‌ఆర్) అన్నారు. అదివారం ఆర్‌కెపురం డివిజన్ వాసవికాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాగణపతి 38వ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమానికి టిపిసిసి ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డితో కలిసి కెఎల్‌ఆర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వాసవీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్త, ప్రధాన కార్యధర్శి అంజయ్య, అష్టలక్ష్మి దేవాలయ అక్షయ ట్రస్ట్ కార్యదర్శి మాడ్యం సుధాకర్‌గుప్త, మాజీ చైర్మన్ దామోదర్‌గుప్తా, చిలుక ఉపేందర్‌రెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్:** విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వర స్వామి అశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రతిష్టించిన వినాయకుడి నిమర్జన కార్యాక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. లడ్డూ వేలం పాట నిర్వహించడంతో పాటు నిమర్జన కార్యక్రమ ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా కొనసాగించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, వ్యక్తిగత కార్యదర్శి నాగరాజులు పాల్గొన్నారు.



### అన్నదానం చేసిన ఎమ్మెల్సీ

షాద్‌నగర్ మున్సిపాలిటిలోని వివిధ వార్డుల్లో ప్రతిష్టించిన వినాయకులకు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం స్థానిక మున్సిపాలిటిలోని ఏబి విల్లాస్, ఆనంద్ కాలనీ, ఆర్టీసి కాలనీ, ఎల్‌ఎన్ కాలనీ, శ్రీనివాస కాలనీల్లో ప్రతిష్టించిన వినాయకులకు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సాయికృష్ణ, మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, సుధీర్, నంద కిశోర్, నందీశ్వర్, అశోక్‌రెడ్డి, నేతలు రాయికల్ వెంకట్ రెడ్డి, బిక్షపతి, లంకాల రాఘవేందర్, రఘుపతిరెడ్డి, నక్కల వెంకటేష్, శ్రీకాంత్ గౌడ్, బంకు శ్రీను, మల్లేష్, రాజ్ సర్కార్, మురళి, గణేష్‌లు పాల్గొన్నారు.

**హయత్ నగర్ :** వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సతీమణి కమల సుధీర్‌రెడ్డి ఎల్.బి.నగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ డివిజన్ హై వే కాలనీ పరిధిలో నెలకొల్పిన లంబోదరుడి పూజ కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు జక్కిడి రఘు వీర్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి అరుణ్ రెడ్డి కంచర్ల రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మన్సూరాబాద్ డివిజన్‌లో..** సరస్వతి నగర్ చెండిశ్వర్ కాలనీ బిసి కాలనీ హిమపురి కాలనీ శ్రీనివాస కాలనీ శైలజ పూరి డి పి కాలనీలలో నెలకొలిపిన వినాయక మంటపం లో జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విట్టల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గణపతి చల్లని చూపు అందరిమీద ఉండలని కోరుకున్నారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు రుద్ర యాదగిరి నర్సింహా గౌడ్ చెంగల్ చంద్ర మోహన్ పరంద నర్సింహా పాల్గొన్నారు.

**సరూర్‌నగర్ :** అదివారం సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్‌కాలనీ కమ్యూనిటీహాల్ వినాయక నవరాత్రి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు అన్నారు. ఉపాధ్యక్షులు వన్నాడి సునితాశ్రీనివాస్, విగ్రహదాతలు కోమిడి సుమీల రమేష్ రెడ్డి, జగిని రామమూర్తి జనార్ధన్‌రెడ్డి, దయాకర్, నగేష్, నిత్య, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

### మీర్‌పేట జిల్లెలగూడలో...

మీర్‌పేట జిల్లెలగూడలో కార్పొరేషన్ పరిధిలోని 22వ వార్డు వేంకటేశ్వర కాలనీలో మహాగణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వెంకటేశ్వర కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి శనివారం రాత్రి పలువురు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ మేకల విజయలక్ష్మి రవీందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కాలనీ వాసులు ఐక్యంగా గణేష్ నవరాత్రులు జరుపుకోవడం అభినందనీయమన్నారు. పూజా కార్యక్రమంలో మేకల రవీందర్ రెడ్డి, సుజాత–సుకుమార్, అంజలి–గోపాల్, లలిత–రాములు, శివానంద్–శివజ్యోతి, రేణుకా– రమేష్, కంచర్ల సరిత–కిశోర్‌కుమార్ దంపతులతో పాటు వనజ, లక్ష్మయ్య, ప్రశాంత్, అయోధ్య పాల్గొన్నారు.







# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## శాంతియుత వాతావరణంలో నిమజ్జనాలు జరుపాలి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజలు శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జనాలను జరుపుకోవాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. ఆదివారం తూంకుంట మున్సిపల్‌లోని శామీర్‌పేట, దేవరయాంజాల్, పోతాయిపల్లి, తూంకుంట చెరువుల వద్ద వినాయక నిమజ్జనాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వినాయక నిమజ్జనాలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ప్రజలు చెరువులోకి దిగకుండా చెరువు గట్లపై నుంచి క్రేన్‌ల సహాయంతో వినాయకులను నిమజ్జనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ల తుది జాబితా విడుదలకు నోటిఫికేషన్ జారీ



**ప్రజాపక్షం/వికారాబాద్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ సన్నాహకాల్లో భాగంగా రాష్ట ఎన్నికల సంఘం ఓటర్లు తది జాబితా విడుదలకు నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో గతంలో 566 జిపిలు ఉండగా మండలాల పునర్విభజనతో ఆ సంఖ్య 585కు చేరింది ఇటివల నారాయణపేట్, మహబూనగర్ పోరుగు జిల్లాల నుంచి కొన్ని పంచాయతీల సంఖ్య 594కు చేరింది. ప్రస్తుతం జిల్లాలో 5,058 వార్డులున్నాయి. ఏడాదిన్నర క్రితం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలకు పోలీంగ్ స్టేషన్లను సిద్ధం చేయగా వాటికి అదనంగా గ్రామాల వారీగా ఇంకా ఎన్ని బూత్‌లు అవసరమవుతుయని అధికారులు వివరాలు సేకరించారు. అదనంగా ఎన్నికల పోలీంగ్ స్టేషన్లు తదితర అంశాలకు సంబంధించి వివరాలు సేకరించారు, ఓటర్లను సైతం వార్డుల వారీగా విభజించి ఎన్ని బూత్‌లు అవసరమనే విషయంలో కసరత్తు పూర్తి చేశారు. రాష్ట ఎన్నికల సంఘం ఆరు నెలల క్రితమే గ్రామ పంచాయతీలు ,వార్డులకు సంబంధించి పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుకు షెడ్యూల్ విడుదల చేసింది. పోలీంగ్ స్టేషన్లు జాబితా తయారు చేసి జిల్లా ఎన్నికల అధికారి నుంచి అమోదం పొందారు వీటికి సంబంధించి పోలీంగ్ స్టేషన్లు జాబితా ముసాయిదాను ప్రచురించడంతో పాటు అభ్యంతారలు స్వీకరించి తుది జాబితాను సైతం అమోదించారు. ప్రస్తుతం వార్డుల వారీ జాబితాతో పాటు ఓటరు తుది జాబితాను ప్రచురించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో దాదాపు ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టయ్యింది. వికారాబాద్ 21, వార్డులు 182, ధారూర్ 34, 288 ,మోమిపేట్ 29, వార్డులు 258, బంట్వారం 12, వార్డులు 106 , మర్పల్లి 29, వార్డులు 264, కోట్‌పల్లి 18, వార్డులు 150 వార్డులు, తాండూ ర్ 33,వార్డులు 290, బషీరాబాద్ 39, వార్డులు 312, యాలాల్ 39,వార్డులు 318, పెద్దేముల్ 38, వార్డులు 308, కొడంగల్ 25, వార్డులు 222, దౌల్తాబాద్ 34, వార్డులు 298, బొంరాస్‌పేట్ 35 వార్డులు, దుద్యాల 19, వార్డులు 158, పరిగి 32, వార్డులు 268, పూడుర్ 32, వార్డులు 282, కుల్కచర్ల 33, వార్డులు 280, చౌడాపూర్24, వార్డులు 202, దోమ 36,వార్డులు 308, నవాబుపేట్ 32,వార్డులు 276, జిల్లాలో మొత్తం 594 జిపిలు, వార్డులు 5058, ఈనెల 28న ఓటరు జాబితా గ్రామ పంచాయతీల్లో వార్డులో పబ్లిష్ చేశారు. వికారాబాద్ జిల్లాలో మొత్తం 3,44,963 పురుషులు, 3,54,912 మంది స్త్రీలు ,ఇతరులు 19మంది మొత్తం 6,99,894 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో 594 గ్రామ పంచాయతీ గ్రామ పంచాయతీలుగా వంద శాతం ఎస్‌టి జానాబా ఉన్న పంచాయతీలను గతంలో ఎస్‌టిలకే రిజర్వేషన్లకు అన్యాయం జరిగిందనే వాదన సైతం తెరపైకి వచ్చింది. గతంలో జిల్లాలో 4.8500 వార్డులు ఉండగా ప్రస్తుతం జిల్లాలో 5,058 వార్డులకు పెరిగాయి. ఈ వార్డుల వారీగా పోలీంగ్ స్టేషన్లు ఏర్పా టు చేయనున్నారు. సెప్టెంబర్ చివరి వరకు పంచాయ తీ ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు అదేశించిన నేపథ్యంలో ముందుగా పంచాయతీ ఎన్నికలకే వెళతారనే చర్చలు మొదలయ్యాయని ఇదే సమయం లో ఎన్నికల కోడ్ ఏ క్షణమైనా వచర్చ అవకాశముంద ని భావించి పంచాయతీ ఎన్నికలకు కసరత్తు చేస్తున్నారు.

## బహిరంగ ప్రదేశంలో చెత్త కాల్చొద్దు



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బహిరంగ ప్రదేశాలలో చెత్త కాల్చడం వల్ల కలిగే పర్యావరణ ప్రభావములపై నగర పాలక సంస్థ సిబ్బందికి ఆదివారం కార్యాలయంలో కమీషనర్ ఏ.శైలజ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాలలో చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వలన పర్యావరణ మీద తీవ్ర ప్రభావం చూపుతాయని, కార్బన్ మోనాక్సైడ్, ప్యూరాన్లు, కణిక పదార్థం వంటి విష వాయువులు విడుదలై గాలిలో కలుషితమై శ్వాస కోశ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు ఎవరు బహిరంగ ప్రదేశంలో చెత్త కాల్చరాదని కమిషనర్ సూచించారు.అధునాతన జీవన శైలిలో పరిసరాల కాలుష్యం ఒక తీవ్రమైన సమస్యగా మారిందని, ఇది ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తుందన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త కాల్చినట్లయితే జరిమానా విధిస్తామని తెలిపారు. పట్టణంలోని ప్రజలు ప్రతి ఒక్కరూ స్వచ్ఛ బోడుప్పల్ కోసం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ బి.నారాయణరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వినోద్, ఎన్విరన్మెంటల్ ఇంజనీరింగ్ నిఖిల్, వాట్ ఆఫీసర్స్, వార్డ్ సూపర్వైజర్స్, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సేవాభావంతో వైద్య సేవలు అందించాలి



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు సేవాభావంతో పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని టెలిఫోన్ కాలనీలో ఆదివారం గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వజ్ర హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి బిపి, షుగర్, కంటి, డెంటల్ పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, ఆస్పత్రులకు వెళ్లలేని వారికి ఈ వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, ప్రభాకర్ రెడ్డి, మహేందర్, ధర్మేందర్ రెడ్డి, రమేష్ గౌడ్, ఆర్మీ వెంకటేష్, రుద్రారం గిరి, భానుమూర్తి, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాపూజీ నగర్‌లో గణపతి ఉత్సవాలు



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాపూజీ నగర్ కాలనీలో గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్,సీనియర్ నాయకులు కాటపాక కుమార్, కాలనీ అధ్యక్షుడు బాల్దె వెంకటేష్,బండారి యాదగిరిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించి భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా సుభాష్ నాయక్ మాట్లాడుతూ, కాలనీవాసులందరు భక్తితో పాటు ఐక్యమత్యాన్ని చాటడం అభినందించదగిన విషయమన్నారు. కాలనీ అధ్యక్షుడు బాల్దె వెంకటేష్ మాట్లాడుతూ అయిదు రో జుల పాటు ఘనంగా పూజలు నిర్వహించి అన్నప్రసాదాలు నిర్వహించా ము. ప్రతి సంవత్సరం కాలనీవాసులందరం వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తూ పిల్లలు పెద్దలందరం కలిసి వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి రాజయ్య, కోశాదికారి కన్నె ఉపేందర్, ఉపాధ్యక్షుడు కిష్టయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని తల్లిపై చేసిన వాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై రాహుల్ గాంధీ చేసిన వాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని మూడుచింతలపల్లి మున్సిపాలిటి బిజెపి అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం మూడు చింతలపల్లి మున్సిపాలిటిలో వీరారెడ్డి విగ్రహం వద్ద రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బిజెపి అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీని రాజకీయంగా ఎదుర్కోలేక ఉద్దేశపూర్వకంగా ప్రధాని తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజి అద్యక్షులు నందాల శ్రీనివాస్, ఎస్టిమోర్చ జిల్లా అధ్యక్షులు సుధాకర్‌నాయక్, మున్సిపాలిటి ప్ర ధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పరమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో మహిళలకు 50 సీట్లు ఇవ్వాలి

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 341వ ఆదివారం జ్ఞానమాల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు 50 రిజర్వేషన్ కల్పించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించాలని,అప్పుడే గ్రామాల అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు సిద్ధిస్తాయని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య, చిల్ల అంజయ్య, సవరపు బయన్న, యేసు రాజు, ఎమ్మార్పీఎస్ బోడుప్పల్ అధ్యక్షుడు శివ, ప్రధాన కార్యదర్శి చిన్నింగాల్ల శ్రీకాంత్, జానీ తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

### రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** గ్రంథాలయాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. ఆదివారం శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని గ్రంథాలయ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠకులకు అందుబాటులో గ్రంథాలయాలు నిర్మిస్తుందని చెప్పారు. అలియబాద్‌లో నిర్మాణంలో ఉన్న గ్రంథాయాలనికి అన్ని వసతులు కల్పించి అందుబాటులోకి తెస్తామన్నారు. పాఠకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ కమఠం కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు, మాజీ ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

## డబ్బుల డిమాండ్ కేసులో ముగ్గురు జర్నలిస్టులకు రిమాండ్

### శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ఓ వ్యాపారి నుంచి డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలో ముగ్గురు విలేకరులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ తెలిపారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మ క్కపల్లికి చెందిన శివకుమార్ టిప్పర్లలో మట్టిని సరఫరా చేస్తుంటాడు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో విలేకరులుగా పనిచేస్తున్న పాత్రికేయులు టిప్పర్లను అడ్డగించి డబ్బులు డిమాండ్ చేసి తీసుకున్నారు. మరోసారి అటవీ శాఖ అధికారులతో కలిసి లారీనీ సీజ్ చేసి భారీ నష్టం కలిగించారు. వీరి వేధింపులు భరించలేక శివకుమార్ జూన్ 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నాడు. ఈనెల 29న మూడుచింతలపల్లి నారాయణపూర్‌లో లారీని ముగ్గురు పాత్రికేయులు మళ్లీ అడ్డంగించి డబ్బులు డిమాండ్ చేసి డ్రైవర్‌ను కొట్టి తాళాలు లాక్కన్నారు. శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరు రిపోర్టర్లను శనివారం రిమాండ్‌కు తరలించగా, మరో రిపోర్టర్‌ను ఆదివారం రిమాండ్ చేశామని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ తెలిపారు.

# గణపయ్యా... నీకు ఇక సెలవయ్యా

### తాండూరులో వైభవంగా శోభాయాత్ర
### పోలీసుల గట్టి బందోబస్తు



**ప్రజాపక్షం/తాండూరు :** ఓ గణపయ్యా నీకు ఇక సెలవయ్యా అంటూ.... గణనాథులకు భక్తులు సెలవు పలకారు. తాండూరు పట్టణంలో ఐదు రోజుల పాటు భక్తుల చేత పూజలు అందుకున్న బొజ్జ గణపయ్యాకు ఆదివారం నీకు ఇక సెలవయ్యా అంటూ భక్తుల ఆట పాటల మధ్య వైభవంగా గణనాథుల శోభయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గణపతి శోభయాత్రలో తరలివస్తున్న గణనాథులకు హిందు ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేధిక నుండి ఘనంగా ప్రభుత్వ చీప్ విఫ్ పట్నం మహేదంర్‌రెడ్డి, స్థానిక ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డిలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హిందు ఉత్సవ కేంద్ర సమితి నేతలు వినాయక ఉత్సవ కమిటీ చైర్మన్‌లను వేధిక మీదకు పిలచి ఘనంగా సత్కరించారు. తాండూరు పట్టణంలో పాత తాండూరులో గడి ప్రాంతంలో ప్రతిష్టాపించిన వినాయకుడిని కదలించారు. అక్కడి నుండి బ్యాండు మేళాల మధ్య సాగిన ఉత్సవ శోభ తాండూరు పట్టణంలోని పురవీధుల గుండా కొనసాగింది. ఇందిరాచౌక్, గంజ్, గాంధీ చౌక్ మీదుగా భద్రేశ్వర చౌక్‌లో ఏర్పాటు చేసిన హిందు ఉత్సవ కేంద్ర సమితి స్వాగతం వేధిక వద్దకు చేరుకుని అక్కడి నుండి నేరుగా మార్వాడి బజర్ మీదుగా ఇందిరాచౌక్ నుండి అంబేద్కర్ చౌక్ మీదుగా కోకట్ కాగ్న వాగు వద్ద ఏర్పాటు చేసిన నిమర్జన స్థలంలో గణనాథులను ఘనంగా నిమజ్జనం చేశారు. నిమజ్జన శోభయాత్రలో ఏలాంటి ఆ వాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు. ఈ కార్యక్రమం లో హిందు ఉత్స వ కేంద్ర సమితి చైర్మన్ స్వప్న పరిమళ్, ప్రధాన కార్యదర్శి పట్లోళ నర్సిములు, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌లు రాజుగౌడ్, మురళీ కృష్ణగౌడ్, సీనియర్ నాయకులు కరణం పురుషోత్తమ్‌రావు, డాక్టర్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గోన్నారు.

## రెడ్డి సంఘం అధ్యక్షుడిగా చందుపట్ల




**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా చందుపట్ల వెంకట్ రెడ్డి ఘన విజయం సాధించారు. రెడ్డి సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్ష పదవికి ఇద్దరు పోటీపడ్డారు ఇందులో కందకట్ల మాధవ రెడ్డి,చందుపట్ల వెంకట్ రెడ్డిలు పోటీ పడగా అందుకు ఎన్నికలు నిర్వహించగా అధ్యక్ష పదవికి 82 ఓట్ల మెజార్టీతో చందుపట్ల వెంకట్ రెడ్డి ఘన విజయం సాధించారు. కొత్తగా ఎన్నికైన నూతన సభ్యులు ప్రధాన కార్యదర్శి కొమ్మిడి శివ ప్రదీప్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్లు పలుగుల శ్రీకాంత్ రెడ్డి, సుడి శ్రీకాంత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కంభం లక్ష్మారెడ్డి, కార్యవర్గ సభ్యులు బిరెడ్డి రవీందర్ రెడ్డిలు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ పాత కమిటీ చేసిన సేవలను ప్రశంసిస్తూ వారి సహకారంతో ముందుకు తీసుకువెళ్తానని పేర్కొన్నారు.సంఘం అభివృద్ధి యువతలో ఐక్యంగా ఉండేలా విద్యార్థుల ప్రోత్సాహం,సామాజిక సేవ రెడ్డిల పాత్రను మరింతగా పెంచడానికి సమాజానికి ఉపమోగపడే కార్యక్రమాలను రూపొందిస్తానని హామీ ఇచ్చారు.

## సింగరేణి విశ్రాంతి ఉద్యోగుల పెన్షన్ పెంచాలి



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** దేశవ్యాప్తంగా ఐదు లక్షల సింగరేణి రిటైర్డ్ విశ్రాంతి ఉద్యోగుల పెన్షన్ దారులు దారిద్ర్యరేఖ దిగువున జీవిస్తున్న ఎన్నో సార్లు పెన్షన్ పెంచాలని మొరపెట్టుకున్న ఇప్పటివరకు పెంచలేకపోతున్నారని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేను మాధవ్ అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2007 కు ముందు రిటైర్ కాబడిన వారికి 500శాతం పెన్షన్ పెంచాలని వినియోగదారుల ధర సూచికను బట్టి కరువు భత్యంతో అనుసాధించి ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక సారి పెన్షన్ సవరణ జరపాలని కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ రద్దు చేయాలని అన్నారు.మాడిమాండ్లు పరిష్కరించాలని సెప్టెంబర్ 15న కోల్ ఇండియా హెడ్డాఫీస్ ముందు కలకత్తాలో భారీ ప్రదర్శన నిర్వహించాలని ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు కోల్ ఇండియా విశ్రాంతి ఉద్యోగులు సిద్ధమవుతున్నారని ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు.

## ఎంఆర్‌పిఎస్ మహాగర్జనను విజయవంతం చేయాలి

### బంట్వారం మండల ఇన్‌చార్జ్ భరత్ కూమార్ మాదిగ



**ప్రజాపక్షం/బంట్వారం :** ఛలో హైదరాబాద్ సెప్టెంబర్ 9న పెరేడ్ గ్రౌండ్‌లో జరగబోయే మహాగర్జనను దివ్యాంగుల, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలు భారీ సంఖ్యలో సభను విజయవంతం చేయ్యాలని బంట్వారం మండల ఇన్‌చార్జ్ భరత్ కూమార్ మాదిగ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ చేయుత ఫించన్ మరచిపోయి కాలయాపన చేస్తుందన్నారు. అందులో భాగంగా వృద్ధులు ఒంటరి మహిళలు, ఫించన్ రూ.2 నుంచి రూ. 4వేలు, దివ్యాంగుల రూ.4 నుంచి రూ.6 వేల వరకు, పూర్తి అంగ వైకల్యం కలలిగిన వారికి రూ.15వేలు ఇవ్వాలని సెప్టెంబర్ 9నఛలో హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో జరగబోయే మహాగర్జనను మంద క్రిష్ణ మాదిగ నే తృత్వంలో జరగబోయే ఈ మహా సభకు దివ్యాంగుల, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలు భారీ సంఖ్యలో పాల్గోని సభను విజయవంతం చేయాలన్నా రు.

## దాదా హాజత్ ఉర్సు ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

### సింగూర్ గ్రామంలో ఈ నెల 5 వ తేదీ నుంచి 7 వరకు ఉత్సవాలు
### ఏర్పాట్లు పూర్తి చేస్తున్నా పీఠాధిపతి



**పుల్కల్ :** పుల్కల్ మండల పరిధిలోని సింగూర్ గ్రామంలో ఈ నెల 5వ తేదీ నుంచి 7 వరకు దాదా హాజత్ 80వ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సహేబ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత 80వ సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు కుల మతాలతకు అతీతంగా వేలాది మంది భక్తులు హాజరౌతారు. ఉత్సవంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దర్గాను రంగురంగుల దీపాలతో అందంగా అలంకరిస్తారు. ఎంతో పవిత్రత కల్గిన గంధం, చాదర్ ఇంటి నుండి తీసుకొని దర్గాలోకి తీసికెళ్లి కీలక ఘట్టాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. 6వ తేదిన వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. సాయంత్రం నాతే మై ఫీల్ సమ, అన్నదాన కార్యక్రమం ఉంటుదన్నారు. ముఖ్య అతిథులు అన్నసాగర్ పీఠాధిపతి హజ్రత్ సుఫీ షా మహ్మద్ ఖలీల్ హుస్సేన్ ఉర్ఫ్ జహీద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ పాల్గొంటారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఒక రోజు ముందే ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం



**హైదరాబాద్ :** ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం షెడ్యూల్‌లో మార్పు చోటుచేసుకుంది. చంద్రగ్రహణం నేపథ్యంలో ఒక్కరోజు ముందే గణేశ్ నిమజ్జనం చేయాలని ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ముందుగా నిర్ణయించిన దాని ప్రకారం సెప్టెంబర్ 7వ తేదీన మహాగణపతి నిమజ్జనం జరగాల్సి ఉంది. కానీ అదే రోజు చంద్రగ్రహణం ఉండటంతో నిమజ్జనం ఎప్పుడు చేయాలనే దానిపై ఇటీవల సందిగ్ధత నెలకొంది. ఈ క్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీ ఒక క్లారిటీ ఇచ్చింది. సెప్టెంబర్ 6వ తేదీనే శోభాయాత్ర నిర్వహించి, నిమజ్జనం పూర్తి చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మార్పును భక్తులు గమనించాలని సూచించింది. ఇదిలా ఉంటే ఖైరతాబాద్‌లో కొలువు దీరిన శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతో లక్షలాదిగా తరలివచ్చారు. మింట్ కాంపౌండ్, వార్డు ఆఫీసు, రైల్వే గేటు నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి.. ఖైరతాబాద్ చౌరస్తాలో క్యూలైన్ దాటి జనం క్యూకట్టారు. ట్రాఫిక్‌జామ్‌లు కాకుండా ఉండేందుకు ఇప్పటికే పోలీసులు ప్రత్యేక రూట్ మ్యాప్ విడుదల చేశారు.

## డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ పోలీసు బృందాల తనిఖీలు



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు కోస్గి మండల కేంద్రంలో బాంబు డిస్పోజెల్ పోలీస్ బృందం, డాగ్స్‌స్కార్డ్ పోలీసులు మండల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా గణేష్ మండపాల దగ్గర, ప్రార్థన మందిరాల వద్ద, ప్రధాన చౌరస్తాలలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్‌పి తెలిపారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా లేదా రెండు మూడు రోజులు ఒకే చోట వాహనాల నిలిపి ఉంచిన బ్యాగులు కనపడిన, ఎవరైనా అనుమానాస్పదంగా సంచరించిన అట్టి సమాచారం సంబంధిత పోలీసులకు ఇవ్వాలని ఎస్‌పి తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబి పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయులు సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని కోరారు.

# రీల్




## 'కానిస్టేబుల్' ట్రైలర్ విడుదల

జాగృతి మూవీ మేకర్స్ బ్యానర్ పై వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో బలగం జగదీష్ నిర్మించిన థ్రిల్లర్ చిత్రం 'కానిస్టేబుల్'. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని అమీర్ పేట్‌లో ఏఏఏ మల్టీ ఫ్లెక్స్ థియటర్‌లో ఘనంగా జరిగింది. సీనియర్ నటుడు డా: రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిధిగా విచ్చేసి ట్రైలర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా డా:రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గతంలో నేను కూడా పోలీస్ పాత్రలు చేశాను. అయితే ఆ పాత్రలు కామెడీ ప్రధానంగా సీరియస్ నెస్ సాగేవి. కానీ ఈ సినిమా కంటెంట్ నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా ఉంది. వరుణ్ సందేశ్ కూడా తన పాత్రలో ఒదిగి పోయి ఉంటాడని భావిస్తున్నానని అన్నారు.

## 'డ్యూడ్' నుంచి బూమ్ బూమ్ పాట రిలీజ్

వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో దూసుకుపోతున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ పాన్ ఇండియా మూవీ 'డ్యూడ్'తో అలరించడానికి రెడీ అవుతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. 'ప్రేమలు' అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు.ఫస్ట్ సింగిల్ బూమ్ బూమ్ పాటను రిలీజ్ చేశారు. ఈ చిత్రం అక్టోబర్ 17న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషలలో విడుదల కానుంది.






## 'ద్రౌపతి-2' ఫస్ట్ లుక్

నేతాజీ ప్రొడక్షన్స్ తరపున చోళ చక్రవర్తి, జి.ఎం. ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా రూపొందిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ద్రౌపతి–2'. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇది వరకు పళయ వన్నారపేట్టై, ద్రౌపతి, రుద్ర తాండవం, బకాసురన్ వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన మోహన్.జి ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో సినిమా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్‌లో 75శాతాన్ని ముంబైలో జరుగుతోంది. మిగిలిన షూటింగ్‌ను సెంజి, తిరువణ్ణామలై, కేరళలలో చిత్రీకరించనున్నారు.

## యాక్షన్ సీన్స్ చేయడం చాలా ఇష్టం | విక్రమ్ ప్రభు



క్వీన్ అనుష్క శెట్టి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'ఘాటీ'. విక్రమ్ ప్రభు మేల్ లీడ్‌గా నటించిన ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. సెప్టెంబర్ 5న ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో నటుడు విక్రమ్ ప్రభు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. డైరెక్టర్ క్రిష్‌ని చూసి నేను ఈ సినిమాకు ఓకే చెప్పా. ఆయన నన్ను కలిసి కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యా. ఆయన చాలా పాజిటివ్ పర్సన్. చాలా ఎక్స్‌పీరియన్స్ ఉన్న డైరెక్టర్. నాకు కథ చెప్పడానికి ముందు 'ఘాటీ' వరల్డ్ ఎలా ఉంటుందో చూపించారు. అలాగే నన్ను ఈ రోల్‌కు ఎందుకు సెలెక్ట్ చేశారో అనే విషయం గురించి అరగంటసేపు చాలా క్లియర్‌గా వివరించారు నా గత సినిమాల్లోని చాలా సీన్స్ గురించి చెబుతూ.. నిన్ను దృష్టిలో పెట్టుకునే 'దేశిరాజు' క్యారెక్టర్ రాశానని చెప్పారు. ఆ మాట నాకెంతో సంతోషాన్నిచ్చింది. స్క్రిప్ట్ చాలా ఫ్రెష్‌గా అనిపించింది. 'ఘాటీ' వరల్డ్ ప్రతి ఒక్కరూ రిలేట్ అయ్యేలా ఉంటుంది. క్రిష్ చాలా హోమ్ వర్క్ చేసి ఈ స్క్రిప్ట్ ప్రిపేర్ చేశారు. స్క్రిప్ట్‌లో నాకున్న సందేహాలన్నింటికీ ఆయన చాలా చక్కగా సమాధానాలిచ్చారు. అప్పుడు నాకు స్క్రిప్ట్‌పై కాన్ఫిడెన్స్ పెరిగి ఓకే చెప్పా. ఇందులో నా ఫేవరెట్ యాక్టర్ అనుష్క గారు ఉండడం నాకు ఇంకా హ్యాపీ. తెలుగు సినిమా చేయాలని ఎప్పటి నుంచో ఉంది. కానీ నా లైఫ్‌లో ప్లాన్ ప్రకారం ఏదీ జరగలేదు. నేను డైరెక్టర్ అవుదామనుకుంటే యాక్టర్ అయ్యా. అందుకే నా హార్ట్ ఏం చెబితే అదే చేసుకుంటూ వెళ్తున్నా. అనుష్కతో కలిసి నటించే ఛాన్స్ గతంలో ఒకసారి మిస్ అయింది. 'రుద్రమదేవి'లో అల్లు అర్జున్ చేసిన గోనగన్నారెడ్డి పాత్రను గుణశేఖర్ ఫస్ట్ నాకే చెప్పారు. కానీ అప్పుడు నాకు కుదరలేదు. అల్లు అర్జున్ ఆ పాత్రకు వందశాతం న్యాయం చేశారు. అలాంటి స్టోరీ వస్తే చేయానికి సిద్ధంగా ఉన్నా. యాక్షన్ సీన్స్ చేయడం అంటే నాకు చాలా ఇష్టం. చాలా ఎంజాయ్ చేస్తూ చేశా. యాక్షన్ సీన్స్ చిత్రీకరణలో డీఓపీ పాత్ర ఇందులో చాలా కీలకం. మిగతా సినిమాల్లో కంటే ఇందులో ఫైట్స్ చాలా డిఫరెంట్‌గా ఉంటాయి. ఇందులో నా పాత్ర దేశిరాజు మాట్లాడే భాష ఛాలెంజింగ్‌గా అనిపించింది. అనుష్కకి నేను అభిమానిని. అద్భుతమైన సంగీతాన్ని సాగర్ అందించారు. అది మీరు థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు కచ్చితంగా ఫీల్ అవుతారు.

## 'మోగ్లీ' గ్లింప్స్ విడుదల



బబుల్గమ్ సినిమాతో హీరోగా పరిచయమైనా రాజీవ్ కనకాల, సుమ కనకాల కుమారుడు రోషన్ కనకాల తాజాగా 'మోగ్లీ' అనే సినిమాతో జనం ముందుకు వస్తున్నాడు. కలర్ ఫోటోతో జాతీయ అవార్డు గెలుచుకున్న దర్శకుడు సందీప్ రాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన మోగ్లీ 2025, పోస్టర్లు స్పెషల్ గ్లింప్స్ విడుదల చేశారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ది వరల్డ్ ఆఫ్ మోగ్లీ గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. గ్లింప్స్ నాని వాయిస్‌తో ప్రారంభమవుతుంది. 2025లో అటవీ నేపథ్యంలో జరిగే ప్రేమకథను అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఒక యువకుడు గ్యాంగ్ స్టర్, స్మగ్లర్‌గా కాకుండా, ప్రేమికుడిగా 30 మందిని పరిగెత్తిస్తాడనే నెరటివ్ చాలా ఆసక్తికరంగా ఉంది.దర్శకుడు సందీప్ రాజ్ ప్రేమకథను ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్‌లో ఫ్రెష్ విజువల్స్, ఎమోషన్స్‌తో అద్భుతంగా చూపించారు. హీరో పట్టణ జీవితంతో పరిచయం లేని వాడు కానీ అడవిలో మాత్రం తనకి తిరుగు లేదు. రోషన్ కనకాల గుర్రంపై దూసుకెళ్లే విజువల్స్ బాగున్నాయి.

## 'బరాబర్ ప్రేమిస్తా' పోస్టర్ విడుదల



చంద్రహాస్ మొదటి చిత్రంలోనే తన నటనతో అందరినీ ఆకట్టుకున్నారు. ఇక ఇప్పుడు 'బరాబర్ ప్రేమిస్తా' అంటూ ఆడియెన్స్‌ను మరోసారి మెప్పించేందుకు రెడీ అవుతున్నారు. సందీప్ కిషన్ ఈ కొత్త చిత్రానికి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కథలో దేశ భక్తికి సంబంధించిన అంశాల్ని కూడా జోడించారు. ఐదు రూపాయల బిళ్ల, వాటి చుట్టూ ఉన్న బుల్లెట్లు, పోస్టర్‌ను డిజైన్ చేసిన తీరు చూస్తుంటే మంచి పవర్ ఫుల్ స్టోరీతోనే సినిమా రాబోతోందని అర్థం అవుతోంది. చంద్రహాస్ బర్త్ డే సందర్భంగా సెప్టెంబర్ 17న ఈ మూవీకి సంబంధించిన టైటిల్, గ్లింప్స్‌ను రిలీజ్ చేయబోతోన్నారు.

## 'లిటిల్ హార్ట్స్' ట్రైలర్ రిలీజ్

'90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్, 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మూవీ 'లిటిల్ హార్ట్స్'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై దర్శకుడు సాయి మార్తాండ రూపొందించారు. '90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ 'లిటిల్ హార్ట్స్' మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి థియేట్రికల్‌గా రిలీజ్ చేస్తున్నారు. 'లిటిల్ హార్ట్స్' సినిమా సెప్టెంబర్ 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల చేశారు. 'లిటిల్ హార్ట్స్' ట్రైలర్ ఆద్యంతం హిలేరియస్ ఫన్‌తో ఆకట్టుకుంటోంది. జియో సిమ్ రాకముందు జరిగిన కథంటూ ఈ ట్రైలర్ స్టార్ట్ అవుతుంది.



## 'దేవసస్య' నుంచి ఇందుమామ సాంగ్ రిలీజ్

సెల్విన్ దేశాయ్, ఆహన్, బింబిక రావ్, ప్రకాష్ బేల్వాడి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'దేవసస్య'. ఈ చిత్రాన్ని అనంత ఫిలింస్ బ్యానర్ పై అనంతమూర్తి హెగడే నిర్మిస్తున్నారు. కార్తీక్ భట్ దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో 'దేవసస్య' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా నుంచి ఇందుమామ లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఇందుమామ పాటకు శ్రీకాంత్ లిరిక్స్ అందించగా, ధనుంజయ్ సీపాన పాడారు. హరి అజయ్ మంచి ఫోక్ బీట్‌తో కంపోజ్ చేశారు. 'ఇందుమామ ఇందుమామ ఇందుమామ..' అంటూ సాగుతుంది. ట్రైబల్ ట్రెడిషన్, డ్యాన్సులతో డిజైన్ చేసిన ఈ పాట ఆకట్టుకుంటోంది.



## అంతా లోపభూయిష్టమే

(మొదటి పేజీ తరువాయి)

పొందుపర్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మూడు బ్యారేజీల ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణలో నాటి ముఖ్యమంత్రి సూక్ష్మ అంశాలలో కూడా భాగస్వామి అయి ఆదేశాలు జారీ చేశారని, ఫలితంగా బ్యారేజీల నిర్మాణంలో అక్రమాలు బ్యారేజీలలో ఇబ్బందులు తలెత్తాయని కమిషన్ స్పష్టం చేసింది. నాటి నీటిపారుదల ఆర్థిక, ప్రణాళిక మంత్రి ప్రభుత్వ విధానాలను అమలు చేసే బాధ్యతను తీసుకున్నారని, మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి మేడిగడ్డకు స్థల మార్పిడి, నీటి లభ్యత ఆరోపణలపై సిఎం నిర్ణయం నిపుణుల కమిటీ నివేదికను తొక్కి పట్టి (జిఓ 28) నిర్ణయం తీసుకున్నారని, మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణం నుంచి ప్రారంభం వరకు నీటిని నిలువ ఉంచడం వల్ల బ్యారేజీలపై ప్రమాదకరమైన ప్రభావం పడిందని తెలియజేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఏర్పాటుచేసిన 'కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కెఐపిసిఎల్) ద్వారా రుణాలను సేకరించి లబ్ధిదారులకు చెల్లించడంపై



ఆర్థికపరమైన దర్యాప్తు చేయాలని కమిషన్ సిఫార్సు చేసింది. నిర్మాణ ఏజెన్సీలు సమర్పించిన బిల్లులు ఏ విధంగా, ఏ పద్ధతిన చేశారని ప్రక్రియపై (ధరల సవరణతో సహా) లోతుగా విచారణ చేయాలని కమిషన్ పేర్కొన్నది. మరోవైపు మూడు బ్యారేజీల నిర్మాణానికి కెఐపిసిఎల్, ప్రభుత్వం సేకరించిన బడ్జెట్ యేతర రుణాల విషయంలో నిబంధనలు పాటించారా లేదా అనే విషయాలపై నిశితమైన అధ్యయనం చేయాలని కమిషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై కంట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్), విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ కూడా తమ నివేదికలలో పేర్కొన్నారని కమిషన్ పేర్కొన్నది. కాళేశ్వరం బ్యారేజీల భద్రతపై నేషనల్ డ్యామ్ సెఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) తుది నివేదికను ఇవ్వాల్సి ఉందని, ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి పూర్తి స్వేచ్ఛ ఉందని కమిషన్ స్పష్టం చేసింది. బ్యారేజీల నిర్మాణంలో నాటి ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి పూర్తి స్థాయిలో భాగస్వాములుగా ఉన్నారని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలనే నాటి ముఖ్యమంత్రి స్వప్నాన్ని సహకారం చేసేందుకు అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి పనిచేశారని, ఇందులో తప్పు చేసిన అధికారులను గుర్తించి వారి పేర్లను కూడా నివేదికలో కమిషన్ స్పష్టంగా పేర్కొన్నది. ''అధికారులు మురళీధర్, బి.హరినాథులు ఉద్దేశపూర్వకంగా మూడు బ్యారేజీల కాంట్రాక్టును పెద్ద మొత్తంలో ఇచ్చారు. బ్యారేజీల నిర్మాణానికి సంబంధించి వాస్తవాలను, నిపుణుల కమిటీ నివేదికను (జిఓ 28) ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టి సిడబ్ల్యుసి నుంచి అనుమతిని తీసుకున్నారని, తద్వారా ప్రభుత్వం ముందుకు సాగేందుకు సహకరించారని, అందులో భాగంగానే బ్యారేజీల నిర్మాణానికి టర్న్‌కి ప్రాతిపదికన కాకుండా గుత్తగా కాంట్రాక్టు ఇచ్చారని, తప్పు చేసిన ఈ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫార్సు చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన జిఓ 24 (తేదీ13.4.2015), జిఓ 40 (తేదీ 18.01.2016)లను మంత్రివర్గం ఆమోదానికి పెట్టకుండా ప్రభుత్వ బిజినెస్ రూల్స్ ను ఉల్లంఘించినందుకు అప్పటి సిఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, నీటిపారుదల శాఖ అధికారి ఎస్‌కె జోషిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. మేడిగడ్డ ఎల్లంపల్లి మధ్య రెండు బ్యారేజీల నిర్మాణానికి డిపిఆర్‌ల తయారిని వ్యాప్‌కోస్‌కు కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేశారని, నేటికీ వ్యాప్‌కోస్ డిపిఆర్‌లను ఇవ్వలేదని, ఈ నేపథ్యంలో రెండు బ్యారేజీల డిపిఆర్‌లను వ్యాప్‌కోస్‌కు ప్రతిపాదించిన, అనుమతించిన చీఫ్ ఇంజనీర్ జి.శంకర్ నాయక్ తదితర అధికారుల నుంచి రూ.96 కోట్లలను రికవరీ చేయాలని కమిషన్ సూచించింది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ చేపట్టిన కమిషన్ ముందు తప్పుడు సాక్ష్యం ఇచ్చినందుకు చీఫ్ ఇంజనీర్లు బి.హరిరామ్, ఈ.నరేందర్ రెడ్డి, పి.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఓంకార సింగ్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో కమిషన్ సిఫార్సులు చేసింది.

## ఏకతాటిపైకి రావాలి

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు ఏకపక్షంగా మద్దతును ప్రకటిస్తూనే మరో వైపు డొంక తిరుగుడుగా మాట్లాడుతూ అసలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూటకో మాట మార్చుతూ అబద్ధాలు మాట్లాడితే తప్ప ఎంఎల్‌ఎలు కాలేమన్న సంకేతాన్ని ప్రజలకు పంపిస్తున్నారన్నారు. శాసనసభలో ఆదివారం పంచాయితీరాజ్ చట్టం సవరణ బిల్లు 2025పై జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు బిసి వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని బిజెపి సభ్యులు మాట్లాడడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. బిసి బిల్లును 9 షెడ్యూల్‌లో చేర్చకుండా కేంద్రం అన్యాయం చేస్తుందా లేక రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందా అని ప్రశ్నించారు. బిజెపి సభ్యులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే బిసి బిల్లును కేంద్రంతో ఆమోదింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా విప్లవాత్మకమైన అడుగు వేసిందన్నారు. అయితే గవర్నర్ ఆ బిల్లును అమోదించకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడడం అన్యాయం అన్నారు. ఈ బిల్లునైనా గవర్నర్ ఆమోదించాలని, ఇందుకు అన్ని పార్టీలు సభ్యులతో ప్రతినిధుల బృందం గవర్నర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలన్నారు.

### కేంద్రం ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించలేదా

బిసి రిజర్వేషన్లకు బిజెపి మతం రంగు పులుమడం సరైంది కాదని కూనంనేని సాంబశివరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇడబ్ల్యుఎస్ బిల్లు ద్వారా ముస్లింలలోని పేద వర్గాలకు సైతం రిజర్వేషన్లను కల్పించలేదా అని ప్రశ్నించారు. మరి హిందువులలో పేదలు ఉన్నట్లే ముస్లింలలో కూడా ఉన్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పిస్తే తప్పేమిటని ఆయన ప్రశ్నించారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాల్లో చైతన్యం వచ్చిందని, వారిని ఎవరూ ఆపలేరని హెచ్చరించారు. ఇప్పటికైనా అన్ని పార్టీలు కుంటి సాకులు మానుకుని బిసి బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించుకునేందుకు సమాయత్తం కావాలని కోరారు.

## రైతు చుట్టే రాజకీయం..!

(మొదటి పేజీ తరువాయి)

మొదటి నుండి అండగా ఉన్నారనడంలో ఏలాంటి సందేహం లేదు. ఆ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు రైతు చుట్టూ రాజకీయం చేసింది. తాగు, సాగు నీరుతోపాటు రైతు రుణమాఫీ, రైతుబంధు, రైతుభీమా వంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారికి మరింత దగ్గరైంది. వరుసగా పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన ఆ పార్టీని కాదని 2023లో ప్రజలు ప్రత్యేక తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించి అధికారం కట్టబెట్టారు. అధికారం కోల్పోవడంతో జీర్ణించుకోలేని ఆ పార్టీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తూ ప్రతి చిన్న విషయాన్ని రాజకీయం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీల పేరుతో ఎన్నికల బరిలో దిగిన విషయం అందరికి తెలిసిందే. ఇందులో రైతుల పంట రుణమాఫీ కీలకం కాగా ప్రభుత్వం కాస్త ఆలస్యం చేయడంతో రైతులను మోసం చేసిందంటూ ఆందోళనలు చేపట్టారు. 6 మాసాల తర్వాత ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల లోపు పంట రుణ మాఫీ చేయగా పూర్తిస్థాయిలో ఎవరికి అందలేదంటూ ఆరోపిస్తూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు రైతుల్లో గందరగోళం సృష్టించింది. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కృంగిపోవడంతో ప్రభుత్వం సాగు నీటిని విడుదల నిలిపివేయడంతో బిఆర్‌ఎస్‌ను బదనాం చేయడం కోసం... కేసీఆర్‌పై కోపంతోనే రైతులను ఇబ్బంది పెడుతున్నారంటూ పెద్దఎత్తున ప్రచారం చేశారు. దీనిపై ప్రభుత్వం విచారణ కమిటి వేసిన తరువాత ఇచ్చిన నివేధికను కూడా తప్పుపడుతూ రైతులను తమవైపుకు తిప్పుకొని లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తున్నారు.

### నేడు యూరియా కొరత పేరుతో లబ్ధికి యత్నం...

### స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టుకోసమేనా..?

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో తిరిగి లబ్ధిపొందేందుకు యూరియా కొరతను తెరమీదకు తెచ్చి రైతులను రెచ్చగొటుతున్న పరిస్థితి. కేంద్రంలోని బిజెపి తెలంగాణ రాష్ట్రానికి రావల్సిన యూరియాను సకాలంలో సరఫరా చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తుంది. ఈ విషయం స్వయంగా వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పత్రికముఖంగా పదే పదే చెప్పారు. యూరియా కోసం ఢిల్లీకి వెళ్ళి కేంద్ర మంత్రుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగిన విషయం అందరికి తెలిసిందే. రైతులకు అవసరమైన యూరియాను ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నా కేంద్రంలోని బిజెపిని నిలదీయకుండా తాము రైతులపక్షాన ఉన్నామని చెప్పేందుకు కపట ప్రేమను ప్రదర్శిస్తూ బిఆర్‌ఎస్ నేతలు ఆందోళనలు చేయడం, ప్రకటనలు చేయడం రైతులను గందరగోళానికి గురిచేస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన స్వంత మీడియాతోపాటు కొన్ని యూట్యూబర్స్‌తో అక్కడక్కడ రైతులతో మాట్లాడించి సోషల్‌మీడియాలో పోస్టులు చేసి చిలువలు పలువలు చేస్తుంది. సూర్యాపేట జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు 4 లక్షల 82 వేల ఏకరాలలో వరిని సాగుచేయగా 92వేల ఏకరాలలో పత్తిని సాగుచేశారు. ఈ పంట సాగుకు మొత్తం 60731 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని వ్యవసాయ అధికారులు ముందే అంచనా వేశారు. ఆ అంచనాకు అనుగుణంగా రైతులకు యూరియాను అందుబాటులో ఉంచారు. వర్షాలు ముందస్తుగా కురవడంతో రైతులు తమ పంటసాగును ముందే చేశారు. ప్రతి ఖరీఫ్‌లో ఆగష్టు, అక్టోబర్ మాసాలలో అధికంగా రైతులకు యూరియా అవసరముండగా గత ఖరీఫ్ కన్నా 2వేల మెట్రిక్ టన్నుల యూరియాను అదనంగానే రైతులకు అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి 'ప్రజాపక్షం' కు వివరించారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని రాజకీయ పార్టీలు సృష్టిస్తున్న గందరగోళంతో యూరియా కొరత నిజమేనని నమ్మి ముందు రోజుల్లో అవసరమైన యూరియాను కూడా నేడు కొనుగోలు చేసుకొనేందుకు దుకాణాల వద్ద బారులు తీరుతున్న పరిస్థితులు కనబడుతున్నాయి. కావాలనే వారిని రెచ్చగొట్టి ఎరువుల దుకాణాల వద్ద రైతులను పోగుచేయడం... చెప్పులు, బస్తాలు, కందువలు క్యూలైన్‌లో పెట్టి సోషల్‌మీడియా ద్వారా లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైన రాజకీయ పార్టీలు తమ రాజకీయం కోసం రైతులను ఆయోమయానికి గురిచేయవద్దని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

## భాగస్వాములుగా ఉందాం

(మొదటి పేజీ తరువాయి)

మన రెండు దేశాల సంబంధాలను వీక్షించకూడదు' అని జిన్‌పింగ్‌కు చెప్పగా, సరిహద్దు వివాదం రెండు దేశాల సంబంధాలనూ నిర్వచించకూడదని జిన్‌పింగ్ పేర్కొన్నారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) 25వ వార్షికోత్సవ సదస్సు ప్రారంభానికి ముందుగా ఆదివారం వారిద్దరూ ముఖాముఖీ సమావేశం జరిపారు. ద్వైపాక్షిక, ప్రాంతీయ, ప్రపంచ సమస్యలు, ఉగ్రవాదం వంటి సవాళ్ళు ప్రతిఘటించడం, బహుముఖ వేదికలద్వారా న్యాయబద్ధమైన వాణిజ్య విస్తరణ వంటివన్నీ ఉమ్మడి అంగీకారంలో ప్రధానాంశాలుగా ఉన్నట్లు భారత్ విదేశాంగ మంత్రిత్వశాఖ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ప్రపంచ ఆర్థికవ్యవస్థ,ప్రాంతీయ సహకారం, ద్వైపాక్షిక సంబంధాలు సహా విస్తారమైన అంశాలపై ప్రధానంగా ఇద్దరిమధ్యా సంభాషణ జరిగింది. గత ఏడాది కజన్‌నగరంలో సమావేశం తర్వాత రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు, శాంతి ప్రక్రియను ముందుకు తీసుకువెళ్ళేందుకు ఇప్పటివరకూ పలు సమావేశాల ద్వారా సాధించిన సానుకూల ప్రగతి సంతృప్తికరంగా ఉండటంపట్ల మోదీ–జిన్‌పింగ్ హర్షం ప్రకటించారు. ఇరు దేశాల సైన్యాలు గత ఏడాది విజయవంతంగా వెనక్కు మళ్ళాయని, అప్పటి నుండీ సరిహద్దుల్లో శాంతి కొనసాగుతోందని నాయకులు ఇద్దరూ సంతృప్తి ప్రకటించారు. ఆగస్టు నెలారంభంలో రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధులూ జరిపిన సంభాషణల్లో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారని, తదుపరి వారు కొనసాగించే కృషికి మద్దతుగా ఉండాలని వారిద్దరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.

భారత్‌పై 50 శాతం భారీ అదనపు సుంకం విధించిన ట్రంప్ వైఖరివల్ల అమెరికాతో బంధం బలహీన పడుతున్న తరుణంలో రెండు ఆసియా అగ్రదేశాధినేతలమధ్య జరిగిన ఈ సమావేశం ప్రపంచ ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యా అధ్యక్షుడు పుతిన్,మోదీ,జిన్‌పింగ్ ప్రధాన కేంద్రంగా జరిగే ఎస్‌సిఓ సదస్సులో ప్రతి పరిణామాన్నీ క్షుణ్ణంగా ప్రపంచానికి తెలియజేసేందుకు దాదాపు 3000 మందికిపైగా జర్నలిస్టులు పూర్తిదృష్టి కేంద్రీకరించారు. 43 శాతం జనాభాకు, 23 శాతం జిడిపికి ప్రాతినిధ్యం వహించే 24 దేశాల నాయకులు సదస్సులో పాల్గొంటున్నారు. ఈ సదస్సు సోమవారం పూర్తయిన తర్వాత కూడా చైనా 80వ విజయోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు వీలుగా మరో రెండు రోజులు పుతిన్ తన పర్యటన కొనసాగించడం మరో ముఖ్యాంశం.

### నేరుగా విమానాలు, వీసా సదుపాయం

భారత్–చైనా మధ్య నేరుగా విమానాల రాకపోకల ద్వారా ప్రజలమధ్య సంబంధాలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని, వారికి వీసా సదుపాయాలు ఇవ్వాల్సిన అవసరాన్ని మోదీ–జిన్‌పింగ్ ప్రముఖాంశంగా గుర్తించారు. కైలాస్ మానస సరోవర్ యాత్ర, పునరుద్ధరణ, టూరిస్టు వీసాల పునరుద్ధరణకు అంగీకరించారు. ద్వైపాక్షిక సంబంధాలను రాజకీయ,వ్యూహాత్మక మార్గంలో ముందుకు తీసుకువెళ్ళాల్సిన అవసరం ఉందని వారిద్దరూ పునరుద్ఘాటించారు. ఎస్‌సిఓలో చైనా అధ్యక్షస్థానానికి మోదీ తన మద్దతు తెలియజేశారు. అదేవిధంగా 2026లో భారత్ ఆతిథ్యం ఇస్తున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు హాజరు కావాల్సిందిగా జిన్‌పింగ్‌ను మోదీ ఆహ్వానించారు. తనకు ఆహ్వానం అందించినందుకు జిన్‌పింగ్ కృతజ్ఞతలు తెలియజేశారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వం అంత్యంత కీలకమైన విషయమని ఈ ముఖాముఖీ సమావేశంలో మోదీ పునరుద్ఘాటించారు. సరిహద్దుల్లో శాంతి రెండు దేశాల అభివృద్ధికీ కొనసాగింపుగా ఉంటుందన్నారు. ''మన సహకారం రెండు దేశాలలో ఉన్న 280 కోట్లమంది ప్రజల ప్రయోజనాలతో ముడిపడి ఉంది, ఈ పరస్పర ప్రయోజనాలు కూడా ప్రపంచ మానవాళి సంక్షేమానికి మార్గం సుగమం చేస్తుంది'' అని తన ప్రారంభవాక్యాలలో మోదీ చెప్పారు. జిన్‌పింగ్‌తో తన సంభాషణ, సమావేశం ఫలవంతమైందని సోషల్ మీడియా వేదికగా మోదీ ప్రకటించారు. కజన్‌లో సమావేశం తర్వాత రెండు దేశాల సంబంధాలలో మంచి పురోగతి వచ్చింది, పరస్పర గౌరవం,పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికపై సహకారం కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నాం'' అని చెప్పినట్లు పేర్కొన్నారు. ఏడు సంవత్సరాల తర్వాత మోదీ తిరిగి చైనా పర్యటనకు వెళ్ళారు. ఈ సందర్భంగా చైనా కమ్యూనిస్టుపార్టీ పొలిట్‌బ్యూరో స్థాయిసంఘం సభ్యుడు కై క్వీతో కూడా మోదీ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలలో తన దార్శనిక దృక్పధాన్ని మోదీ ఆయనతో పంచుకున్నారు. రెండు దేశాలమధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలిన కై క్వీ కూడా బలంగా ఆకాంక్షించారు.

### డ్రాగన్–ఏనుగు ఒకటిగా ఉండాలి:జిన్‌పింగ్

బెదిరింపులకు బదులుగా రెండు దేశాలు పరస్పర అభివృద్ధికి అవకాశాలు అన్వేషించాలని మోదీతో జిన్‌పింగ్ చెప్పారు. శత్రువులుగా కాకుండా భాగస్వాములుగా ఉండాలని రెండు దేశాల నాయకులు అంగీకరించారని చైనా అధికార పత్రిక ప్రకటించింది. ఈ మార్గాన్ని సమగ్రంగా అనుసరిస్తే ద్వైపాక్షిక సంబంధాల్లో స్థిరమైన పురోగతి సాధిస్తామని, నిర్దిష్ట సమస్యలన్నీ ఒక కొలిక్కి వస్తాయని జిన్‌పింగ్ మోదీతో అన్నారు. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాలు)లో ముఖ్యమైన సభ్యదేశాలుగా భారత్–చైనా తమ పాత్ర పోషిస్తున్నాయని, రెండు దేశాల ప్రజల శ్రేయస్సును కాపాడటం, అభివృద్ధి చెందుతున్న దేశాల పునరుజ్జీవనానికి ప్రోత్సాహం ఇవ్వడం, మానవ సమాజ పురోగతిని ముందుకు తీసుకువెళ్ళడం వంటి కీలక బాధ్యతలను రెండు దేశాలూ నిర్వర్తించాల్సి ఉందని జిన్‌పింగ్ అన్నారు. 'రెండు దేశాలూ పరస్పర విజయం సాధించడానికి సహాయపడేవిధంగా మిత్రులుగా, మంచి పొరుగుదేశాలుగా మారాలి, డ్రాగన్–ఏనుగు రెండూ ఒకటిగా ఉండటమే ప్రగతిమార్గంలో సరైన ఎంపికగా ఉంటుంది, రెండు దేశాల దౌత్యసంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకకు ఈ ఏడాది చిహ్నంగా ఉన్నందువల్ల వ్యూహాత్మక,దీర్ఘకాలిక దృక్పథంతో మన సంబంధాలను వీక్షించాలి' అని జిన్‌పింగ్ అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com